
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు
29-7-'53

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



ప్రతిబింబాలు

ఫొటో : శ్రీ పి. శివరామరాజు, మద్రాసు.

★

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

సంపుటము 45
సంచిక 48
29-7-53

Founder: K. NAGESWARA RAO

విజయ ఆషాఢ బహుళ తదియ; బుధవారం



అలంకరణ

శ్రీమతి గోమతీదేవి, మద్రాసు.

విషయానుక్రమణిక

సంధి విగ్రహం

సంధి విగ్రహం (పంచతంత్రం) బొమ్మల సీరియల్ కారణాంతరాల వల్ల ప్రచురించలేక పోయినందుకు చింతిస్తున్నాము. తిరిగి త్వరలోనే ప్రచురించగలమని పాఠకులకు మనవి.

—సంపాదకుడు.

కాలక్షేపం

"ఎక్కడి యూరు కాల్నిలువ
కింటికి బోవలెనంచు బల్కెదీ
వక్కట! మీ కుటీరనిల
యంబులకున్ సరిరాకపోయెనే
ఇక్కడి రత్నకందరము?
లిక్కడి నందన చందనోత్కరం?
బిక్కడి గాంగసైకతము?
లిక్కడి యీ లవలీ నికుంజముల్?"

తా॥ ఎక్కడి ఊరు అది? ఇక్కడ ఉండటానికి కాలు నిలువ దన్నట్లుగా యింటికి పోవలెననిన్నీ, "మా ఊరుకు వెళ్లిపోవలె" నన్నీ నీవు ఆతురతపడతావు ఎందుచేత? ఇక్కడ ఉండేటటువంటి రత్నములతో ప్రకాశించే గుహావిహారములున్నూ ఇక్కడ ఉండే మంచిగంధపు చెట్లతో శోభాయమానంగా ఉన్నటువంటి ఉద్యానవనముల వరుసలున్నూ, ఇక్కడ ఉండే గంగాప్రవాహ తీరపు ఇసుక తిన్నెలున్నూ, యిక్కడ లవలీ అనే చక్కని పూలతీగతో అల్లుకొనియున్న పొదరిండ్లున్నూ, అక్కటా! మీ కుటీరములవంటి (పూరి గుడిసెలవంటి) నివాసములకు సాటి రాకుండా హీనములై కన్పించుచున్నవా?

ఒక గర్వాంధ గంధర్వ గంధగజగామిని పైరీతిగా అన్నది. ప్రవరుడు అనే ఒక అమాయక నిరతాగ్ని హోత్రపరుడైన బ్రాహ్మణుడు హిమాలయ ప్రాంతంలోని హిమాచలప్రదేశ్‌కు వెళ్ళి "తరుగహనగుహా విహార తత్పరమతియై" (చెట్లు చేమలు అడవులు కొండగుహలు చూస్తూ తన్మయుడై, కర్మవశాత్తు ఆ గంధర్వగజగామిని నిజనివాస ప్రదేశానికి వెళ్లడం సంభవించింది. ఆ గంధర్వ స్త్రీకి సంగీతం అనేది ఉగ్గుపాలతో పెట్టిన విద్య - పసందుగా పాడుతుంది. రాళ్ళు కరిగేటట్లుగా రాగాలాపన చేయగలనని చెప్పింది. బాగా పాడుతుంది-బాగా ఆడుతుంది కూడాను. భరతనాట్యంలో సురతాణి - కామశాస్త్రంలో కళాప్రవీణ - బహుశః అందులో బి. ఏ. పరీక్ష (బాచెలర్-ఆఫ్-ఆర్ట్సు) "కళా బ్రహ్మచారి" అనే పట బిరుదం పొందినదేమో! లేదా బి-కామ్- (బాచెలర్ - ఆఫ్ - కామశాస్త్ర) "కామశాస్త్ర - బ్రహ్మచారి" అనే పట్టమును పొందినదేమో! మనకు నిర్ధారణగా తెలియదు. వీణె బాగా వాయించే ప్రవీణ. పేరు వరూధిని. వయస్సు సుమారు 25 సం॥లకు మించకుండా ఉండవచ్చు. మకాం, సాకిన్ హిమాచలప్రదేశ్ - గంగ ప్రవహించే ప్రాంతం అది. ఆమె నివసించే ప్రదేశంవద్దనే, గంగానది ఇసుక తిన్నెలు (గాంగ సైకతములు) ఉన్నాయి. చాలా సన్నని రవసెల్లాలవంటి గుడ్డతో తయారు చేసిన పరికిణీ కట్టుకొని దానిపైన సన్నని వల్లెవాటు వేసికొన్నది. బంగారు గజ్జెల వడ్డాణం, బంగారు గాజులు వగైరా ఆభరణాలు ఉన్నాయి. చాలా అయిశ్వర్యవంతురాలు. ఆమెకు చాలా ఉద్యానవనములు ఉన్నాయి. ద్రాక్షతీగల పందళ్లు అల్లుకొని ఉన్నాయి. చంద్రకాంతశిలా వేదికలు ఆ తోటలలో ఉన్నాయి. అనేక ఫలవృక్షాలు ఉన్నాయి. చెలికత్తెలు, దాసీలు, పరిచారికలు ఉన్నారు. మొగవాండ్రు ఇంట్లో ఎవరున్నూ ఉన్నట్లుగా ఆచూకీ చిక్కడం లేదు. అటువంటి సందర్భంలో, పేదకు పెన్నిధి లంభించినట్లుగా "అలేఖ్య తనూ విలాసు"డైనటువంటి (లిఖించడానికి వీలు లేని దేహసౌందర్యవిలాసం కలిగినటువంటి) ఒక చక్కని నడివయస్సు బ్రాహ్మణుడు ఆమె ఉండే మకాముకు వచ్చాడు.

ఆమె మకాముకు వచ్చినా, ఆమెకు కాముకుడు కాలేదు. స్వగ్రామానికి స్వగృహానికి వెళ్ళిపోవలెనని తహతహలాడుతున్నాడు. కాని, ఆ వరూధినీ, బి-కామ్-గారు మాత్రము ఆయన ధోరణి చూచి హేళన చేయడం సాగించింది. "మా ఊరుకు వెళ్లాలి" "నా యింటికి వెళ్ళాలి" అని తొందరపడ్తావెందుచేతా? ఎక్కడి ఊరది? ఏమంత గొప్ప ఊరేమిటి ఖాది? ఆంధ్రరాజధాని యైనక ర్నూ ల్...

దాసు వామనరావు

కంటె గొప్పవూరా? నాయింటికి పోవాలని చెప్పులలో కాళ్ళుపెట్టుకొన్నట్లుగా, పుట్టి మునిగిపోతున్నట్లుగా గడబిడ చేస్తావేమిటి? వెళ్ళవచ్చును లేవయ్యా-ఇంతలో మించిపోయింది ఏమీ లేదు. ఇక్కడ ఉండే టటువంటి చల్లని తోటలకంటె, పూపాదరింట్లకంటె, ఇసుకతిన్నెలకంటె మిన్నయైనది కాదు. మీ ఊరి బడాయి. ఇక్కడి చంద్రకాంతశిలలతో అద్దాల మేడలలాగున ఉండే యీ భవనాలు, యీ వనాలు, అనుభవించవలసిన యౌవనాలు మనవి - కనుక కాలు నిలువకుండా యింటికి పోతానని అంటావేమిటి?" అని ఆ ప్రవరుణ్ని ఆ వరూధిని నడివీధిలో నడుముమీద చెయ్యివేసి "ఆగు! ఎక్కడికి పోతావ్" అన్నట్లుగా సవాల్ చేసి చీవాట్లు పెట్టింది.

ఇదంతా చూస్తే అడుమళీయాళంలాగున ఉంది. "వచ్చినవాడు ఫల్గుణుడవశ్యము గెల్తుమనంగరాదు" అన్నట్లుగా, వచ్చినవాడు ప్రవరసోమయాజి. "వివిధాధ్వర నిర్మల ధర్మకర్మదీక్షాపరతంత్రుడు" చాలా నియమనిష్ఠాగరిష్ఠుడైన కర్మిష్ఠి- వేదాధ్యయనం నిరంతరంగా చేస్తూ అందులో తత్పరుడైన వాడు ప్రవరుడు, అయితే, ఆవచ్చిన ప్రముఖుడు ఎవరో, ఊరేమిటో, పేరేమిటో, తెలిసికొనకుండా, తావు టికాణా చాకస్ చేయకుండా తాను ఎవరితో, ఎంతటి పండితునితో మాట్లాడుచున్నదో తెలిసికొనకుండా, ఆయన ముందర తాను చదివిన చదువులన్నీ ఏకరువుపెట్టి, తన గొప్ప తాను చెప్పుకొని ఆత్మస్తుతి చేసికొనడం కేవలం వెనుకా ముందూ తెలియని స్వగుణమర్దనంగా ఉంటుంది. ఆ పహిలా పచ్చీసు గంధర్వాంగన తన గొప్ప తాను ఎంతగా చెప్పుకొన్నప్పటికీ, ఆమె ఎదుట నిలువబడిన ఆ పండితుడు, ఆమె ఆలాప ప్రలాపములన్నీ ఓర్పుతో ఆలకించినాడే గాని, తన గొప్పను తాను తిరుగుజవాబుగా చెప్పలేదు. "అరెరె! నేనెవరి ననుకున్నావ్?" అని ప్రవరుడు ప్రత్యుత్తరమీయలేదు. "నీవు చాలా చదువుకున్న దానివే - చాలా గొప్పదానివే. నీవంటి విద్వాంసురాలిని కలిసికొని చెలిమిచేసికొనగల్గుట నా కలిమి యని తలంచుచున్నాను" అనే ధోరణిలో మిస్ వరూధినిని కొంచెం ఉబ్బించుటకు తగిన ఉదారమర్యాద మాటలు, తాను ఉబ్బి తబ్బిబ్బై ఆదరాబాదరా ఆమె ముందర దొర్లించలేదు. "ఎక్కడి యూరు?" అని ఆమె ప్రశ్నిస్తే, తన ఊరు "అరుణాస్పదం" అని కూడా ఆమెకీ యివ్వలేదు.

అయినా, ఆయనకది పరస్థలం-ఆమెకది స్వస్థలం - ఆమెకు అక్కడ స్థానబలం ఉంది గనుక ఆయనతో ఆమె ఎంత లాఘవంగా చులకనగా మాట్లాడినా చలామణీ అవుతుంది. ఆయన ఒంటరిగా ఉన్నాడు. అసహాయుడు. ఆమెకు పరిచారిక పరివార జనం ఉంది. అయినప్పటికీ "ఇంటికి బోయెదనంచు బల్కెదవు?" అని ఆ మహాపండితుణ్ని ప్రశ్నించింది. "నీవు" అని పరాయి పెద్దమనిషిని పల్కరించడం కేవలం గర్వం, అహంకారం తప్ప మరొకటి కాదు. మొదటినుంచి చివరవరకూ "నీవు" "నీవు" అని ఏకవచనంలోనే ఆయనను పల్కరించి చుల్కరించింది. ప్రవరుడంటే కేవలం "బ్రహ్మశ్రీ వేదమూర్తులైన ప్రవర సోమయాజి" అని ప్రజాపూజితుడైనవాడు. "మాన్యక్షేత్రముల్" అనేకము కలిగినటువంటి స్థితిపరుడు. రాజమాన్య రాజపూజితుడు. "వేదమూర్తి" అంటే యీ కాలపు "డాక్టర్ - ఆఫ్ - డివినిటీ" (డి. డి. (D. D.) బిరుదుపొందిన) "పరతత్వ కోవిదుడు" అని గొప్పగా చెప్పుకోదగినవాడు. అటువంటివాని ముందర యీ గడసరి గంధర్వకామిని వరూధిని, తన వేదాంతశాస్త్ర పాండిత్యంకూడా భాషించడం మొదలు పెట్టింది. అంజనేయుల వారి ముందర కుప్పిగంతులు వేసినట్లు అప్పుడు ఆ చర్చలో ఆమెగారు చూపించిన మిడిమిడిజ్ఞానము, గాలి సంగీతంవంటి వినికిడివిద్య, సారంలేని సరకు అని సరసంగా నిరసించాడు. "ఈపాండిత్యము నీకు దక్క మరియెందే గంటిమే - కామశాస్త్రోపాధ్యాయిని నావచింపదవు మేలో హో! త్రయీ ధర్మముల్ పాపంబుల్, రతి

★ కాలక్షేపం ★

ఘృణ్యామంచు; - నికనేలా తర్కముల్? మోక్షలక్ష్మి పథ్యాగమ సూత్రపంక్తికి వెహో- మీ సాంప్రదాయార్థముల్”

“చాలిక నీ పాండిత్యం - ఇక కట్టిపెట్టు - కామశాస్త్రం అంతా చదివి (బి. కామ్) పండితురాలనని చెప్పుకోంటావుగదా, కామశాస్త్రంలో నైనప్పటికి మిగిలిన ధర్మములన్నీ పాపములని చెప్పలేదు. ఏశాస్త్రమునకైనా మోక్షలక్ష్మియే లక్ష్యం - నీవు చదువుకొన్న విద్యాశిక్షణలోని సంప్రదాయం చాలా బాగుందిలే!” అని మెత్త మెత్తగా చీవాట్లు పెట్టి, “మీ ఊరు గొప్పదే కావచ్చు - నీపేరు గొప్పదే కావచ్చు. నీ యింట్లో గడ్డపెరుగూ, మీగడ పాలూ, ప్రతిరోజూ బాదం హల్వా ఉంటే ఉండవచ్చు. పూల తోటలో నీకు తూగుటుయ్యాల ఉంటే ఉండవచ్చు - కాని, “ఒడల్ తిరమే? చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్” అన్నాడు. “నీ భోగాలు నీకు బాగైతే నీవు ఊగు” అని చెప్పి, “నీకూ, నీ భోగాలకూ, నీ ఆరామాలకూ రాం! రాం!!” అని ఆ రామామణితో ఆ ధీరచిత్తుడు గంభీరంగా అన్నాడు. ఆయన వద్ద ఉన్న ఆ గాంభీర్యం, ఆ గాంధర్వ యువతిలో కంచు కాగడా వేసి వెతికి చూచినా స్తనశల్యపరీక్ష చేసిచూచినా కన్పించదు. తన “బి. కామ్” పాండిత్యంతో కొమ్ములు తిరిగిన “డి. డి.” పండితునితో డీ. డీ. అని వాదించుటకు పూనుకొనడం కేవలం పేలవం అయి చివరకు తానే తేలవడం జరుగుతుంది.

ఆ బ్రాహ్మడికి ఆనందం యిచ్చేవి యివి కానేకావు. నిత్యం అగ్నిహోత్రుణ్ణి ఆరాధించి ఉపాసన చేయడంవల్ల ఆయనకు ఆత్మతేజం ప్రజ్వరిల్లినట్లుగా ఉంటుంది. ఈ ఆత్మతేజం ఆయన సాధకం చేసేటటువంటి ధ్యానమనన విధానంవల్ల కలుగుతుంది. ఏకాగ్రచిత్తంతో నియమనిగ్రహంతో అగ్నిహోత్రుని ఆరాధనలో నిమగ్నుడైన వాని “శీలంబున్ గుణమున్ శమంబు దమమున్” ఆ చెల్వంపు లేబ్రాయములోనే అగ్నిహోత్రునివలె స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నాయి. అందువల్లనే ప్రవరుడు అగ్గినిప్పువంటి మనిషి అయినాడు. అటువంటివానికి ఈమరునికటారి కులుకుమిటారితుటారి వలపు వగలు గిలిగింతలు పెట్టగలవా? “కలంచునే సతుల మాయల్ ధీర చిత్తంబులన్?” అటువంటి అగ్గినిప్పువంటి బ్రాహ్మణుడు ఆమెతో స్పష్టంగా కట్టెవిరిచినట్లు చెప్పివేశాడు. “నా.కరణుల్ 'దర్భలు నగ్నులుం బ్రియములైన ట్లన్యముల్ గా; వొడల్ తిరమే? చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్.”

అగ్నిహోత్రం తయారుచేయుటకు “అరణి” అనేటటువంటి ఒకవిధమైన ఎండు పుల్లతో మరొక కర్రమీద మథించేవారు. అప్పుడు కట్టెతో కట్టె రాచుకొని నిప్పు రాచుకొనేది. అందువల్ల ప్రవరసోమయాజికి ప్రియమైనవి ఏమిటయ్యా అంటే, రావి పేళ్ళు, సమిధలు, అరణులు, దర్భలు, అగ్నిహోత్రము. ఇవి ఆయనకు ప్రియమైనట్లుగా అన్యములు (ఇతరమైన వేవిన్నీ) ప్రియము కావు. ఈ ఒడలు (శరీరము) (తిరమే) స్థిరమైనదా? కనుక తుచ్ఛమైన సుఖములను గూర్చి నాతో చెప్పవద్దు - అవన్నీ మీసాలమీద అంటుకొనియుండే తేనె చుక్కలవంటివి. క్షణకాలభోగములవి - ఈవిధముగా - ఆభోగములమీద తనకు మోజులేదన్నాడు. చాలాకాలంక్రిందటనే ఏనాడో వాటిమీద వ్యామోహం హోమం చేశానన్నాడు.

కాని, అటువంటివానిని లోకం అరసికుడని నిరసిస్తుంది. కావ్యాలు ప్రబంధాలు చదివి, రసగ్రహణపారీణుడైనట్లయితే, శృంగారరసంకూడా ఎటువంటిదో పండితుడైనవాడు అనుభవించవలసినదే అని అప్పకవి మొదలుకొని భావకవివరకు వాదించడం కలదు. ఆంధ్రకవితాపితామహుడనబడినటువంటిన్నీ వరూధినీ ప్రవరుల గాథగల, మనుచరిత్ర ప్రబంధమును రచించినటువంటిన్నీ అల్లసాని పెద్దన్నగారు యీ ప్రబంధ కవిత్వతత్వం ఎటువంటిదో ఒక ఉత్పలమాలికలో సవిస్తరంగా విస్తరించి శ్రీకృష్ణదేవరాయల వారివద్ద నిండు దర్బారులో గండపెండేరమును (కాలికి బంగారు అందెను) బహుమానంగా పొందియున్నారు.

“పూతమెరుంగులున్ పసరుపూపబెడంగులు జూపునట్టి, వాకైతలు...” అని తమ ఉత్పలమాలికను ప్రారంభించినారు.

అవన్నీ పూతమెరుంగులు - పసరుపూపబెడంగులు - ఒకవిధమైన మోజు కల్పించే చమత్కార వర్ణనలు; ఒక విధమైన మతిభ్రమ కల్పించేవి, యీ ప్రబంధ రచనలన్నారు పెద్దన్నగారు. కాని, “శిరోమణి” పరీక్షప్యాసయినవారికికూడా చాలామందికి యీవిషయం బాగా తలకెక్కడంలేదు.

కవిరాజవరంలో ఒక యువకుడు ఉన్నాడు. ఆంధ్రసాహిత్యంలో మునిగి తేలుతూ ఉంటాడు. ఆయన పేరు “భావనారాయణ.” కాని ఆయన “భావశ్రీ” అని వ్రాసికొంటాడు. ఇంటిపేరు ఏమిటో తెలియదు. భావశ్రీఇంటి పేరు అభావంఅన్నారు కొందరు. ఆమాటకువస్తే శ్రీనాథునివంటి మహాకవి యింటి పేరు ముక్కంటికైనా తెలియదన్నారు. “భావశ్రీ” యింటిపేరు “బ్రహ్మకైన తెలుసునో తెలియదో?.” అతని భార్య అతనికంటె పదిఆకులు ఎక్కువ చదివినదే గాని తక్కువ చదివినది కాదు. ఆమెకు ప్రబంధాలంటే ఊరగాయ జాడీలవంటివి. అవన్నీ రసం ఊరుతూఉండేటటువంటివనిన్నీ మన పూర్వకవులు యీలోకం నుంచి వెళ్లిపోతూ మన ఉపయోగంకోసం వారు మనకు పెట్టియిచ్చిన ఊరగాయ జాడీలనిన్నీ, ఆమె ప్రబంధాలను పరిగణించి గౌరవించేది.

ఆమెకు యక్షగానంలోని కందార్థం అంటే, చాలా యిష్టం. సర్వలఘుకందం అంటే, ఆమెకు సర్వకాల సర్వావస్థలలో ఆనందకందంగా ఉండేది. అంతేకాదు. ఆ కారణం చేతనో వేరే కారణంచేతనోగాని, ఆమెకు కందకూర అంటే జిహ్వ లేచి వచ్చేది. ఆమె కందం వ్రాస్తే అందం చిందులుత్రొక్కుతూ ఉంటుంది. ఆమెకు పుట్టింటివారు పెట్టినపేరు సుందరమ్మ. కాని ఆమె కాపురానికి వచ్చినతర్వాత, ఆమె భర్త ఆపేరు రద్దుచేసి మరొక ముద్దుపేరు పెట్టుకొన్నాడు. ఆమెకుగల అభిరుచినిబట్టి ఆమెను “కందరాణి” “కందరాణి”అని పిలుస్తూ ఉండేవాడు.

ఆమె కాపురానికి వచ్చిన క్రొత్త దినాలలో ఆమె భర్తయైన “భావశ్రీ”, శిరోమణిపరీక్షకు చదివి హాజరు అయ్యే నిమిత్తమై తిరుపతికి వెళ్లాడు. కొన్ని మాసాలపాటు ఆయన అక్కడ ఉండవలసి వచ్చింది. అక్కడ ఉన్నంతకాలం “నాతిగల బ్రహ్మచర్యం తప్పిందికాదు” కాని ఆ దివ్యక్షేత్రంలో సహాధ్యాయులకు యితర విద్యార్థులగోష్ఠిలో కష్టం అనిపించలేదతనికి. కాని, ఆయనలేని శయనాగారం ఆమెకు కమలంలేని కాసారంగా ఉంది. పౌర్ణమికీ అమావాస్యకూ, ఆ “కందరాణి”కి విరహవేదన ఆరోహణ క్రమంలో ఉంటూవచ్చింది. పౌర్ణమి వచ్చిందంటే ఆమె చంద్రుణ్ణి దూషిస్తూ డజనుల కొద్దీ కందపద్యాలు చదివేది. ఒకరోజున విరహవేదన ఎక్కువై వెంటనే అంట్లుతోమే దాసీ దాన్ని పిలిచింది. లేత పచ్చి తామరాకులున్నూ, తామరకాడలున్నూ చెరువులోనివి తీసికొని రమ్మంది. ఆతామరాకులనుచక్కగా పరుపువలె పరిపించి వాటిమీద శయనించి

తనపైన ఆ పచ్చి తామరకాడలను పూర్తిగా కప్పివేయవలసినదిగా పాచికని చేసే అప్పలమ్మతో చెప్పింది. పని మనిషి ఆ ప్రకారంగా సే ఆ తామరకాడలన్నీ ఆమె మీద వేసి పూర్తిగా కప్పివేసింది. కొంతసేపయిన తర్వాత "కందరాణి" చిందులు తొక్కుతూ లేచి గోలచేయడం ప్రారంభించింది. ఒళ్లంతా ఒకటే దురద. అది కండూతి అంటే కండూతి కాదు. కండలుకోసినంత కండూతి ఆ యింతి బాధ ఇంతింత కాదు. "ఎంత గోకినా, ఎంత రక్కినా సఫలా మేమి?" గోళ్లతో రక్కినకొద్దీ రక్తం వచ్చిందే గాని, బాధ తగ్గేవిధానం కన్పించలేదు. కందరాణి ఒళ్లంతా కందగడ్డ అయింది. మొత్తంమీద యీ బాధతో ఆ విరహబాధ మాత్రం పూర్తిగా పోయింది. చివరకు దాసీ అప్పలమ్మ యీ అవస్థ చూచి 'కందరాణి' దేహమంతా చింతపండు పులుసు పట్టించి మాలీసు చేసి స్నానం చేయించినతర్వాత ఆమె ప్రాణం హాయిగా ఉంది. నలమహారాజుకున్నూ దమయంతీదేవికిన్నీ పూర్వం యిదేవిధంగా విరహవేదన సంభవిస్తే చిగురుటాకుల పాన్పుమీద పడుకొన్నారు. లేత తామరకాడలు ఒంటిమీద కప్పుకొన్నారు. "తలిరుల శయ్యలన్ ఒ మృగు మృణాళములన్" అని స్పష్టంగా చెప్పబడిఉంది. ఇదంతా రసజ్ఞులకు ప్రమాణమైన ప్రణయకలాపం. కందరాణికీ విరహం తరహాఅంతా తెలుసు. అనుభవంమాత్రం అంతగా లేదు. నేటికది సత్యమో అసత్యమో పరీక్షచేసి చూస్తే ఇది విరహాగ్ని పరీక్ష అయింది. ఒళ్ళంతా భగ్గుమని మండినట్లయింది.

"భావశ్రీ"గారు తిరుపతినుంచి తిరిగి వచ్చిన తర్వాత జరిగిన కథంతా కపటం లేకుండా చెప్పింది. కాని ప్రబంధకవిత్వ సత్యంలో అవిశ్వాసం ఆమెకు ఏర్పడే సందుకు "భావశ్రీ"కి మనస్సు చివుక్కుమన్నది.

మరునాడు రాత్రి యింట్లో పడక గదిలో ఉడికిపోతున్న పనే సెగతో, భావశ్రీగారు తన మంచమూ తన పరుపూ పెరటిలో ఏదైనా పూలతీగెల పొదరింటిలో వేసికొని పరుండవలెనని నిర్ణయించాడు. పెరటిలో పొదరిండ్లు లేవుగాని పారిజాత వృక్షమొకటి బాగా పూలుపూచి ఘుమఘుమ లాడుతూఉంది. ఆ చెట్టుక్రింద తన మంచం వేయించి హాయిగా పక్కలలో పడుకున్నాడు. కాని కొంతసేపటికి మంచం

(56 వ పేజీ చూడండి)

శ్రవ్య నాటిక:

నిచ్చెనలు .. పాములు

[రెయిల్వే స్టేషను తోపింపచేసే ధ్వనులు. సంకీర్ణమైన మానవ కంఠాలు. రెయిలు బయలుదేర బోయే ముందు కొట్టే గంట వినబడుతుంది. గార్డు వేసే యీలకూడా వినబడుతుంది తరవాత.]

ఒక కంఠం: ఏయ్, ఏయ్, ఇది పరుపుల పెట్టె. ఇందులోకి జొరపడ్డావే, మరెక్కడా చోటులేనట్టు. అదిగో అదిగో. ఉంటుంది. ఉంటేమంటే, (కోపంగా) అక్కడ కూచోకయ్యా, పరుపులో గాజు సామానుంది.

గొంతో: (పకటంగా నవ్వుతాడు) – తిమ్మాయింపండి. పాలేశ్వరుడుగారూ, గుర్రాన్ని కట్టెయ్యండి మరీ. గాజు సామానులు, గాజుసామానూ. సిక్కుదుప్పట్లో? నైట్ డ్రెస్సు, ముఖమల్.

పాలే: పారి నియ్యిల్లు బంగారంకానూ, నువ్వుటోయ్ సూర్యనారాయణా. కూచో, కూచో, పోల్చుకోలేకపోయాను, నువ్వూ నీ మప్లరూ, కోతిటోపీ.

సూర్య: మరే, చలి చంపేస్తోంది. ఇంత దిక్కుమాలిన చలిచేత. అలవాటైపోయి ఏడిస్తేనా, ఇంకా? అది సరేగాని, ఎక్కణ్ణించి రావడం? సెలవు అప్పుడే అయిపోయిందా?

పాలే: హలో, (పెద్ద మూలుగు మూలిగి) ది, ఓ సిగరెట్టు అందుకో. అగ్గిపెట్టో. క్కడ రిలీవింగు? ఇంకా రిలీవింగులోనే న్నా?

సూర్య: ఇన్నేళ్ళొచ్చి మీరింకా ందులోంచి బైటపడలేకపోతే. నన్ను దరికొచ్చి దాతేవడు? చెప్పరేం ముందు మీ ంగతి చెప్పండి. అప్పుడే సెలవు అయిపోయిందా?

పాలే: ఆహాఁ, ఎంతసేపు, కళ్ళుమూసి తెరిచే అంతటిలో అయిపోతుంది. మాలతీ ట్‌పూర్ నించి వస్తున్నాను. నీసంగతి చెప్పవేం? ఎక్కణ్ణుంచి?

సూర్య: ఇక్కణ్ణించే.

పాలే: నాయనా, నీలాగ పైలాపచ్చీసు యిస్సులో లేను. అర్ధరాత్రి వెళ్ళిపోయింది. ఏ స్టేషనో ఏమిటో చూశానా, డిశానా?

సూర్య: ఊఁ, రాధామోహన్‌పూర్.

పాలే: కోవాగా?

సూర్య: కాదు, కూడ్సు.

పాలే: ఎవరికి బదులు?

సూర్య: సోనాబాబుకి. అది సరేకాని, దేశం వెళ్ళారుకదా, ఏం తెచ్చారు?

పాలే: చూడూ, దేశం అంటే జ్ఞాపకం వచ్చింది, మీ యింట్లో వైకుంఠపాళీ ఉందా?

సూర్య: ఎందుకూ.

పాలే: పాపం, ఆపిల్ల అడిగింది. ఇమాటు తెచ్చిపెట్టమంది. ఆ అడివి స్టేషన్‌లో ఏం తోచడంలేదట.


సూర్య: ఏ పిల్ల?

పాలే: అదే, చిన్న మేష్టరుగారి అమ్మాయి. అమ్మయేంలే, పురిటికొచ్చింది. తొలికానుపు... అదేమిటి అలా చూస్తావ్?

సూర్య: ఏంలేదు. వైకుంఠపాళీ అంటే..

పాలే: (ఆదుర్దాగా) అంటే?

సూర్య: ఏం లేదూ... ఏదో జ్ఞాపకం వచ్చి.



పాలే: ఏం జ్ఞాపకం వచ్చింది, చెప్పు చెప్పు, ఏదేనా ప్రేమకథా ఏం? అవంటే నాకు మహా యిష్టం. నేను—

సూర్య: మీ సున్నితమైన అభిరుచులు నాకు తెలియవ్ గనకనా?

పాలే: సరేలే... చెప్పవోయ్, నాదగ్గర దేనికి దాపరికం? కుర్రాడివి. అందులో ఒక డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాం... చెప్తావా, పెద్దవాణ్ణి ఏదో విని సంతోషిస్తాను.

సూర్య: ఉద్ధరిస్తారు.

పాలే: చెప్పుదూ. ఊరించకా.

సూర్య: వైకుంఠపాళీ! ఎంత చిత్రమైన ఆట! ఒక్కసారే ఆడాను. వరసగా అయిదురోజులు. తరువాత మరి ఆడలేదు; ఇక జన్మలో ఆడతలుచుకోలేదు కూడా.

పాలే: ఏం?

సూర్య: చెప్తా వినండి. జీవితంలో ఇక మన కిచెప్పుకోవడాలే మిగిలాయి. అన్ని పేకమేడలూ కూలిపోయి, చివరకి రోజులు రూళ్ళకర్రలా సాఫీగా గడచిపోతున్నాయి. అంచేత ఇహ చేసేదేముంది. గతం నెమరువేసుకోడం తప్ప?

పాలే: సరే, కవిత్వంలోకి దిగావు, అసలు సంగతి చెప్పు.

సూర్య: వినండి. ఆరేళ్ళ క్రితం ముచ్చట, కాలేజీలో చదువుకునేరోజులు. మీకు తెలుసుగా, చిన్నప్పటినుంచీ మా అక్కయ్యగారింట్లో పెరిగినానని. క్రిస్మస్ సెలవులకి ఓసారి వెళ్ళినప్పుడు, మీకు జ్ఞాపకం ఉందా – మనదేశం అంతటా పెద్ద తుపాను పట్టింది?

పాలే: అవునులే. పేపర్లలో చదివాను.

సూర్య: ఓహో, ఆ రోజుల్లో మీరు పేపరు కూడా చదివేవారన్నమాట. ఆఁ. అప్పుడే. మా అక్కయ్యగారింటో. మా అక్కయ్య, బావా, మా మేనకోడలు, మేనల్లుడు – అంతే. అయిదు రాత్రిళ్ళు, అయిదు పగళ్ళు, ఏక తుపాను – గాలీ వర్షం.

* * *

[పెనుగాలి వీచే చప్పుడు. తెరలు తెరలుగా, హోరుమని వర్షించడే ధ్వని.]

సూర్య: అక్కయ్యా.

నరసమ్మ: ఓయ్.

సూర్య: ఏం వాన, ఏం వాన, దీనితో అంతు అంటూ ఉండేదు కాబోలు. చేగోడీలున్నాయా, అయిపోయాయా, అక్కయ్యా.

నర: ఉన్నాయిరా, గూట్లో వెండి పళ్ళెంలో ఉన్నాయి. తీసుకో. (కాస్త గట్టిగా) రా అమ్మా, కాంతం, రా. ఏం కాంతం, యిలా వర్షంలో కొట్టుకొచ్చావు. భోజనాలయాయా?

కాంతం: అయాయి పిన్నిగారూ, నా నాన్న, మావయ్యా భోంచేశారు. ఇదిగో, మా రాలుగాయి ఇక్కడున్నాడేమో అని–

నర: సుబ్బయ్యా, మకేం బెంగపెట్టుకోకు. వాడి కిక్కడ అన్నం పెట్టాను. నీ సంగతి చెప్పు, నువ్వు భోంజేశావా?

కాం: ఏం భోజనం పిన్నిగారూ. నన్ను తిండికూడా తిననిస్తాడా, మా నాన్న. (బాధపడుతూ) మా అమ్మే ఉంటేనా!

నర: అయ్యో, పిచ్చితల్లీ. పెద్దదాని

ఎన్నాళ్ల నుంచో గారాబంగా పెంచుకున్న కోతిని తాను అమ్మివేయ దలచినట్టు ఒక దొరసాని పత్రికల్లో ప్రకటించింది. కానీ తన కత్యంత ప్రీతి పాత్రమైన ఆ వానర శ్రేష్ఠాన్ని ఆమె అమ్మివేయ దలుస్తున్నందుకు చాలామంది ఆశ్చర్య పడి ఇందులో ఏదో కిటుకుంటుం దని దాన్ని కొనడానికి సాహ సించ లేక పోయారు. అందు వల్ల ఆ దొరసాని పత్రికల్లో మళ్లీ ఇలా ప్రకటించింది.

"నా కోతి ముసలిదై పోయిందని గానీ, లేక దాని కేదో ఆరితీరని రోగం దాపు రించిందని గానీ నేను దాన్ని అమ్మివేయడం లేదు. తీరిక సమయాల్లో దాని చేష్టలు చూస్తూ కాలం గడిపిదాన్ని నేను కానీ ఇక మీదట ఈకోతి అవసరం నాకుండదు. నేను త్వరలో పెండ్లి చేసుకో బోతున్నాను"

యం. ఆర్., చిత్తూరు.

వవుతున్నావు, ఆమాత్రం ధైర్యం తెచ్చుకోవాలి, లే, నీకూ—

సూర్య: ఎవరూ, పెద్దదానివవటం? ఓహో, కాంతం! ఏం కాంతం! కులాసాగా ఉన్నావా?

కాం: ఓహోహో, సూర్యం, ఎప్పుడొచ్చావ్, సూర్యం? తుపానులో కొట్టుకొచ్చావే.

సూర్య: అబ్బే, నేను మధ్యాహ్నం బండిలో వచ్చాను. సాయంత్రం మేఘాల మీద తుపానొచ్చింది.

కాం: (నవ్వుతూ) నువ్వే తుపాను లాంటివాడివు. నీకేం నాయనా, మహారాజువు. అవును గాని, పిన్నిగారూ, మా బృహస్పతి ఏడీ? (గట్టిగా) ఒరేయ్, గాడిదా.

సుబ్బ: (దూరంనించి) ఓయ్. (దగ్గరగా వచ్చి) పిల్చేవా అక్కా?

కాంతం: (కోపంగా) ఏం చేస్తున్నావిక్కడ?

సుబ్బ: నేనా? నేనే? మరీ, పిన్నిగారు అన్నం పెట్టేరూ, తినేశాను.

కాంతం: ఉద్ధరించావ్.

సుబ్బ: (ఏకు వు గొంతుకతో) ఏం చెయ్యను మరి. సాయంత్రంనించి నాన్నా, మామయ్యా పోట్లాడుకుంటున్నారు. అక్కడ నాకు భయం వేస్తోంది.

నర: ఊరుకోవే... ఏదో కుర్రకుంక. ఒరేయ్, సుబ్బయ్యా, పందిరిమంచం మీది కెళ్లి పడుకో. అక్కడ రాముడూ, పాప ఉన్నారు. వాళ్లని లేపకేం. రా, కాంతం, నీకూ సూర్యానికీ వడ్డిస్తాను. లేరా, సూర్యం.

కాంతం: బాబుగారో.

నర: బాబుగారు అప్పుడే భోజనానికి లేస్తారా, నీ పిచ్చిగాని. పదకొండూ కొడితేగాని, అర రాత్రి కిరాతుల వేళ ఆయన భోజనం. (రయ్యిమని తెరలు తెరలుగా తుపాను చప్పుడు.) అబ్బ, ఎన్నాళ్లుంటుందో, యీ పాడుతుపాను. చీదరగా ఉంది. లెండి మరి. కాంతం! కంచాలు పెట్టు.

కాం: ఇదిగో.

[క్షణం విరామం.]

కాంతం: సూర్యం, వక్కపొడి వేసుకుంటావా?

సూర్యం: అలవాటు లేదు. అయినా లే, నీ చేత్తో యిస్తున్నప్పుడు ఎలా లేదనటం కాంతం?

కాం: ఊఁ.

సూర్యం: స్కూలుకి వెళుతున్నావా?

కాం: వెళ్లికేం. అదొక్కటేగా, కాస్త బతుకుమీద ఆశ కల్పిస్తూంది. లేకపోతే, ఇంకేం చూసుకుని, బతికటం.

నర: (లోపలినుంచి వస్తూ) చూసుకోవటం ఏమిటే?

కాం: పిన్నిగారూ, స్కూలుకి వెళుతున్నావా అంటాడు సూర్యం.

నర: స్కూలేమిటిరా, పాపం! కాంతం నిజంగా వేలలో ఎంచదగిన పిల్లరా. ఎటువంటి మొగుడొస్తాడో గాని, పాపం.

కాం: వచ్చారుగా, యమదూతలాగ.

సూర్యం: ఎవడువాడు, ఆ దుర్మార్గుడు, మరుక్షీ, దుందుభి?

నర: ఆఁ, వాళ్ళ నాన్నకి అదో పిచ్చి. మేనమావకిచ్చి పెళ్ళి చేస్తానంటాడు. కాకి ముక్కుకి దొండపండు అన్నట్టు. వాడెవడో ఉత్తరాదిలో ఉన్నాట్ట. ఏదో పని. యీమధ్యనే పెళ్ళాం పోయిందట.

సుబ్బ: (గాభరాగా ప్రవేశిస్తూ) చంపేస్తున్నారు. చంపేస్తున్నారు. గది గోడల నిండా నెత్తురు.

నర: (ఆందోళనగా) ఎవర్నిరా? ఎవర్రా?

సుబ్బ: నల్లుల్ని—పిన్నిగారూ! ఎన్ని నల్లులనుకున్నారూ! బాబయ్యగారు ఒక్కొక్కటే తీసి గోడకేసి రాసేస్తున్నారు.

కాం: (కోపంతో) పోరి చవటా. చూడగా చూడగా నీకు పిచ్చెక్కుతూన్నట్టుంది. ఇంత బుర్ర లేకపోతే ఎలాగరా? ఇదొకటి పిన్నిగారూ, నాకు గుండెలో కుంపటి. ఎన్నిటికని చెప్పండి. అటువంటి నాన్న. ఇంట్లో ఉన్నామో ఊడేమో, తింటున్నామో. పస్తుంటున్నామో, అక్క లేదు. ఏమైనా అంతే - పెళ్లి చేసేస్తాను, ఒప్పుకో, అంటాడు.

సూర్యం: అంటాడంటాడు.

కాం: ఇటు వీడు చూస్తే, ఉత్త బృహస్పతీ, బుద్ధావతారం. ఏం దారి చెప్పండి.

నర: ఏం పరవాలేదు, వెర్రితల్లీ, అన్నిటికీ భగవంతుడు ఉన్నాడు. మా యింట్లో ఉండిపోండి, సరా. నా పిల్లలతో పాటే మీరూనూ?

కాం: ఏమిటో పిన్నిగారూ, చివరికి మీరే నాకు తల్లీ, తండ్రీ, అన్నీ.

సూర్యం: సరేగాని, వర్షం యింకా ఎక్కువవుతోంది. ఒరేయ్ సుబ్బయ్యా! నిద్రపోవేంరా?

సుబ్బ: రావటంలేదు.

నర: యీరాత్రికి ఇంకేం వెళతావు కాంతం, ఇక్కడే పడుకో.

కాం: అప్పుడే నిద్రరావటంలేదు. కడుపులో బెంగగా ఉంది.

సూర్యం: మరేం భయంలేదు, నిద్ర రాకపోతే, లే, చదరంగం ఆడదాం.

కాం: చదరంగం ఒద్దుబాబూ, ఎవడి తరం యీరాత్రి, వైకుంఠపాళీ ఆడతాం అందరం కలిసి.

నర: నేను ఆడను. చూస్తాను కావలస్తే, లేదా, పుస్తకం చదువుకుంటాను. మీరిద్దరూ ఆడుకోండి.

కాం: అయితే ఒక్క ఆటఆడి మూసేద్దాం. ఏం సూర్యం?

సూర్యం: సరే.

[క్షణం విరామం.]

కాం: (పాడుకుంటూ వస్తూన్నట్టు.)

★ నిచ్చెనలు పాములు ★

పొడుస్తూ బాలుడు
పొన్న పువ్వూ చాయ
పొన్న పువ్వూ మీద
బొగడ పూవూ చాయ
శ్రీ సూర్యనారాయణా,
మేలుకో
హరిసూర్యనారాయణా.

నర: వాడప్పుడే లేస్తాడే వె(ర్రి)తల్లీ, నేనేం కోడినా, కాకినా, ఊ తెల్లారక ముందే లేవడానికి, అంటాడు.

కాం: (నవ్వుతుంది) కోడీ కాకీ కంటె కనికిష్టం, అవి సైతం తెల్లారేసరికి లేచి పోతాయి. (గట్టిగా) ఓ సూర్య భగవాన్లు గారూ.

సూర్యం: (లోపలినించివస్తూ) ఎవరూ? ఓహో కాంతమా? అప్పుడే స్నానం, కాఫీ, అన్నీ అయిపోయినట్టున్నాయే?

నర: అప్పుడే ఏమిట్రా, నీ మొహం, ఏడు దాటి లేను.

కాం: (నవ్వుతుంది) వంటకూడా చేసేశాను పిన్నిగారూ, వాళ్లెప్పుడొస్తే, అప్పుడు వడ్డిస్తాను. ఇలాగే వేపుకు తింటాడు పిన్నిగారూ, నాన్న. వేళకి తిండికి రావడానికి కూడా ఆయనగారికి కష్టం. అందులో మావయ్య జతపడ్డాడా, ఊఁ ఏక పేకాట, పేకాటా, చుట్టలూ, ఇంకా ఏం తోచకపోతే సుబ్బయ్యకి వీపు మీదా, నాకు మాటలతో-టీ పెళ్లి. చదువు కుందికి కూడా తోచదు.

సూ: సరేలే ఉండు. కాఫీతాగి ఒస్తాను. తుపానులో ఏం చదువుతావు, వైకుంఠపాళీ ఆడదాం.

కాం: (వెటకారంగా) మా చిట్టి నాయనే. వైకుంఠపాళీ అంటే నీకు అస హ్యమేమో.

సూ: లేదు. అభిప్రాయం మార్చుకున్నాను.

కాం: సరే.

[క్షణం విరామం]

కాం: (పాడుకుంటూ వస్తూన్నట్టు)
ఉదయిస్తూ బాలుడూ
ఊల్లిపువ్వూ చాయ
పుల్లిపువ్వూ మీద
ఉగ్రంపు పొడిచాయ,
శ్రీ సూర్యనారాయణా మేలుకో
హరి సూర్యనారాయణా.

ఏం వాన ఏం వాన! ఇవాళ మూడో రోజు కదూ సూర్యం. యీ తుపాను? తగ్గుతుందా బాబూ, ఎప్పటికైనా?

సూర్య: తగ్గదు. నువ్వలా పాడినకొద్దీ తుపాను ఎక్కువౌతుంది.

సుబ్బ: సూర్యం బాబోయ్.

సూర్యం: ఏమిరా బాబూ, ఏం?

సుబ్బ: రోడ్డు-చివర మూడు దిరిసెన చెట్లు పడిపోయాయి.

సూర్యం: నీకెలా తెలిసిందిరా యీ కబ పటి వార్త?

సుబ్బ: వేణు చెప్పాడు. వాడికి వెంక టేశ్వర్లు చెప్పాడు.

సూర్యం: వాడి కెవరు చెప్పారో?

సుబ్బ: ఎవరికి?

సూర్యం: వెంకటేశ్వర్లుకి.

సుబ్బ: ఏమో మరి. (ఆత్రంగా) అడిగి రానా?

కాం: ఏడిశావ్. ఎవర్నీ అడగక్కర లేదు. కూర్చో. ఇంతోటి మహా వార్తను. అందులో అద్భుతం ఏముంది! ఇళ్లే పడిపోతున్నాయి, మనుషులు చచ్చిపోతున్నారు. కానీ సూర్యం మరీ, ఎంతసేపు తాగుతావ్. ఆ కాఫీ. నేను పోతాను బాబూ అలా గయితే.

సూర్యం: ఉండుండు, అయిపోయింది. ఒరేయ్ సుబ్బిగా.

సుబ్బ: ఆఁ.

సూర్యం: చూడూ, నెమ్మదిగా వంటిం టోకి వెళ్లి అగ్గిపెట్టె తస్కరిస్తావ్?

సుబ్బ: అంటే?

కాం: (నవ్వుతుంది) బలే. వాడిదగ్గరా నీ పాండిత్యము. అగ్గిపెట్టెరా. పిన్నిగారు చూడకండా తీసుకురా. లే సూర్యం – పందెం నీది – వెయ్యి.

సూర్యం: ఇదిగో. (గవ్వల చప్పుడు) నాలుగూ. మళ్ళీ, రెండూ. ఎక్కడుంది నాపావు?

కాం: ఇదిగో, యీ కుండేలు గదిలో ఉంది. (గబగబా) ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదూ, ఆరూ, అమ్మయ్యో, యాగంలోకి ఒచ్చావు. నిచ్చెన, స్వర్గ లోకంలోకి తీసుకెళ్లింది నీ పావుని.

సూర్యం: బలే. యీ పటం కనిపెట్టిన వాడి కెవడికో ఆ వేదాళ్ళ మనస్సులు కూడా తెలుసల్లే ఉంది. సరే. నువ్వెయ్యి.

కాం: ఇదిగో...చూడూ. ఛీ ఎప్పుడూ మంచి పందెం పడదూ. నా పావు ఎక్క డుందీ? చెట్లల్లో. అమ్మయ్యో, ఒకటి, రెండు, మూడు. దేవుడా మళ్ళీ పాము మింగేసింది. (సాగదీస్తూ) మళ్లీ మొట్టమొద టికి. సరేలే.

సూర్యం: ఏదీ, ఆ పావు? దగ్గిర ఏం రాసుందో చదువ్.

కాం: ఆఁ వాడి నెత్తి. ఏవో రాశాడు, నీలాంటి ఊసుపోనివాడు.

సూర్యం: చదువ్. మోహము! చూశావా మరి. అందులో పడితే ఏమవు తుంది మరి.

కాం: (పరాగంతో) సరేలే, ఆడుదూ.

సూర్యం: ఇదిగో. చూడూ. అమ్మయ్యో, హిడింబి గదిలో పడ్డాను.

కాం: పెళ్ళిపోతున్నావు గబగబా ముందుకి.

సూర్యం: పరవాలేదు కాంతం, ఎక్క డికి పోతాను. నువ్వొచ్చిందాకా ఆగు తాను.

కాం: ఏమో, నన్ను పాములు ప్రాణం తీసేస్తున్నాయి.

(నరసమ్మగారి గొంతుక)

నర: ఏఁవర్రా. మీ ఆట బంగారం గానూ, విసుగులేదురా. మూడు రోజుల నుండి ఏకటాకీని ఆడుతున్నారు.

కాం: ఏం చెయ్యం పిన్నిగారూ, యీ

తుపాను చూడండి. చీదరెత్తించేస్తోంది. ఉడకేసి వాళ్ళకింత పడెయ్యడం తప్పితే కొంపలో ఉండ బుద్ధెయ్యదు.

నర : నే ఒద్దొన్నా నే వెర్రితల్లీ. నేనూ ఆడుదును. తీరిక లేదు. మీకు యీ వైకుంఠపాళీ పిచ్చి, రాముడుకీ పాపకీ కౌరమ్సు పిచ్చి, ఆఫీసులో ఆయనకి పజిల్సు పిచ్చి. అందరం యీ తుపానులో చిక్కడిపోయాం.

కాం : మరే పిన్నిగారూ, తుపాను. (గాలీ, వర్షం చప్పుడు).

[క్షణం విరామం]

కాం : (పాడుతుంది)

జామెక్కి బాలుడూ

జాజిపువ్వా చాయ

జాజిపువ్వా మీద

సంపెంగ పూచాయ

శ్రీ సూర్యనారాయణా,

మేలుకో

హరి సూర్యనారాయణా.

నర: (చలితో వణికిపోతున్నట్టు) హు, హు హు... కాంతం, మీకు చలివేయడం లేదర్రా, ఒరేయ్ సూర్యం, కాస్త ఆ పందిమంచం దగ్గిర కిటికీ వేసెయ్, పిల్లలకి జల్లుకొడుతుంది.

కాం : లేదు పిన్నిగారూ. అప్పుడే యివాళ నాలుగోరోజు. రేపటికైనా తగ్గుతుందో లేదో, యీ వాయుభారి తుపాను.

నర : సుబ్బయ్యేడీ ?

సూర్యం : (నవ్వుతూ) సుబ్బిగాడా, వాడు వాళ్ళనాన్నలాగే జీనియస్ అనుకో. అడివిగాడిదకి కొమ్ములెన్నిరా అన్నాను. కనుక్కొస్తానని రాముడు దగ్గరికి పరిగెత్తాడు. (గట్టిగా) సుబ్బయ్యా, ఒరే సుబ్బయ్యా.

సుబ్బ : (లోపలనుంచి) ఓయ్. (దగ్గిరగా) పిలిచావా?

సూర్యం : కనుక్కున్నావురా?

సుబ్బ : ఆ! రెండుటా.

[అంతా గొల్లుమని నవ్వుతారు.]

నర : ఊరుకోరా సూర్యం. నువ్వు మరీనీ.

కాం : చూడండి పిన్నిగారూ, వాణ్ణి వెర్రివాణ్ణి చేసి ఎలా ఆడించేస్తున్నాడో.

నర : ఫరవాలేదే. ఏదో కాస్సేపన్విస్తూ, ఆడిస్తూ, వాడికి కాస్త ఉషారివ్వనీ. మరీ పాపం, ఆ నాన్న వాడి సంగతే పట్టించుకోడు:

కాం : ఏదీ సూర్యం. పందెం ఎవరిది. నీదేనా? వెయ్యి. (జాలిగా) ఆ హైసా ముచ్చటకి గెలవలేదు. ఒక్కసారైనా గెలిచి మానేద్దామనీ.

నర : తుపాను తగ్గితే కాని గెలవలేవే తల్లీ.

సూర్యం : అవును. ఒకటీ, రెండూ సారూప్యంలోంచి తిరుగుడుపువ్వగడిలోకి వచ్చాను. (గవ్వల చప్పుడు — తుపాను హోరు. [క్షణం విరామం.)]

★ నిచ్చెనలు—పాములు ★

కాంతం : (పాడుతుంది)

మధ్యాహ్న బాలుడూ
మల్లెపువ్వూ చాయ
మల్లెపువ్వుమీద
మంకెన్న పొడిచాయ
శ్రీసూర్యనారాయణా,
మేలుకో,
హరిసూర్యనారాయణా.

సూర్యం : (నవ్వుతూ) నువ్వెంత లాలించి పిలిచినా, ఆ సూర్యనారాయణ ఉదయించడు. నువ్వేం కుంతీదేవివా?

కాం : ఆఁ, ఉదయించక ఊరెట్టుకుంటాడా ఏం? ఇవాళ్టికి అయిదో రోజు. సోమవారంనాడు వెలిగించిన దీపాలు. మంగళ, బుధ, లక్ష్మి, ఇవాళ శుక్రవారం.

సూర్య : ఇవాళ కొత్త తెరిపి ఇచ్చింది మరి. సాయంత్రం సూర్యదర్శనం అవొచ్చు (హఠాత్తుగా) అదేమిట్రా, సుబ్బయ్యా, ఏడుస్తున్నావేం?

సుబ్బ : (ఏడుస్తూ) నాన్న కొట్టాడు.

కాం : (విసుక్కుంటూ) కొట్టకేం చేస్తాడు మరి. అంతేగా ప్రయోజకత్వం, ఏడవకు, వేణు దగ్గిరికెళ్ళి ఆడుకో...

సూ : అదేమిటి కాంతం. ఏదీ, ఇలా చూడు, తలెత్తు, ఛా, ఎందుకూ కళ్ళమ్మట నీళ్ళు. ఛా, తప్పు, ధైర్యం తెచ్చుకోవాలి. ఇంతమాత్రానికే బెంబేలు పడిపోతే ఎలాగ?

కాం : (ప్రయత్నంమీద దుఃఖం ఆపుకుంటూ) - ఏమిటో సూర్యం. నాకంతా అగమ్యంగా ఉంది. పుట్టిన దగ్గరనించి ఒక్కలా నడుస్తోంది జీవితం. నా సంగతి సరే, వాణ్ణి చూడు, తల్లిలేని పిల్లడు, వట్టి అమాయకుడు. బుద్ధావతారం. వాడి సంగతి ఏంగాను. నా సంగతి ఏంగాను?

సూ : ఏం భయంలేదు కాంతం. జీవితమే అంత. యీ ఆటలాగే, అన్నీ పాములూ నిచ్చెనలూ, పైకెక్కుతుంటాము, కిందకి దిగుతూంటాము. అందరం అంతే.

కాం : నీకేం సూర్యం, ఆడదాని హృదయం నీకేం తెలుస్తుంది. ఆడదాని బాధ నీకేం తెలుస్తుంది.

సూ : కాంతం, నువ్వూ అలా అంటే నేనింకేం చెప్పను? నీకేం కావాలి? నేనున్నన్నాళ్ళు నీకేమీ భయం లేదనుకో. నిన్ను సుఖపెట్టడం తప్ప, ఇంకో ఆలోచనే నాకు లేదు. అంతా నీలో ఉంది.

కాం : ఏమిటో సూర్యం. ఏమీ ఎరగని దాన్ని. అమ్మో ఉంటే నా అనిపిస్తుంది. నాన్న సంగతి నీకు తెలుసుగదా. ఇక నాకు మిగిలిందల్లా పిన్నిగారూ, ఆ మిషనరీ దొరసానీ. దొరసాని మట్టుకు ఏం చేస్తుంది, స్కూల్లో జీతం లేకండా చదువుకోనిస్తుంది.

సూ : దిగులు పడకు కాంతం. ఇంకొక్క రెండేళ్ళు కళ్ళు మూసుకో. తరవాత నేనే చదివిస్తాను నిన్ను.

కాం : అంటావు. అంతే. నీ చదువయిపోయాక నువ్వూ అందరిలాగే ఓ యిల్లాల్ని కట్టుకుని, ఏ ఉద్యోగానికో ఎగిరిపోతావు. అప్పుడు నేను జ్ఞాపకం ఉంటానా నీకు?

సూ : అదంతా నీదయ. నువ్వే నన్ను మరిచిపోతే?

కాం : అక్కడే పొరపడుతున్నావు సూర్యం. ఆడది అంత త్వరగా, అంత సులభంగా మరిచిపోలేదు; మీలాగ, ఏనాటికయినా నేను నీకు బోధపడతానా సూర్యం.

సూర్యం : నీకోసం ఎంతకాలమైనా ఆగుతాను కాంతం, నువ్వూ నాకోసం ఆగు.

(నరసమ్మగారి గొంతుక.)

నర : కాంతం, ఎందుకే సుబ్బయ్య ఏడుస్తున్నాడూ? ఏమైనా అన్నారా ఏమిటి?

కాం : అదేంలేదు, రాత. నేను వాణ్ణే అంటాను పిన్నిగారూ. మగాడు, నాన్న కొట్టాడు.

నర : వాడి చేతులు పడిపోనూ, కుర్రాణ్ణింతుకే అలా కొట్టుకుంటాడూ?

సూర్యం : నే నూరుకోబెడతానుండు. (గట్టిగా) సుబ్బయ్యా.

సుబ్బ : (దూరంనించి) ఓయ్. (దగ్గరగా) ఎందుకూ?

సూర్యం : ఏడుస్తున్నావురా?

సుబ్బ : ఆఁ.

సూర్యం : ఎందుకూ?

సుబ్బ : ఏమిటో మరి. అప్పుడప్పుడు ఏడవ బుద్ధివేస్తుంది. నాన్న కొడతాడు. అక్కయ్య తిడుతుంది. బళ్లో మేష్టరూ కొడతాడు. ఏడుస్తాను మరి.

సూర్య : ఏడిశావ్. అలా ఏడవకూడదు ఆడదానిలాగ చూడూ, సుబ్బయ్యా, పొడుపుకథలు అడుగుతాను, జవాబు సరిగ్గా చెపితే, నీకు మంచి ప్రెజెంట్.

సుబ్బ : అడుగు మరి.

సూర్య : చిట్టినాయన. అన్నింటికీ సిద్ధమే. ఇది చెప్పు చూదాం. కళ్ళు రెండే కాని కాళ్ళు మాత్రం రెండు. ఉన్న నోరు ఒకటైనా, వాగుడు మాత్రం పదినోళ్ళది. ఏమిటది?

సుబ్బ : ఏమిటదీ? మళ్ళీ అనుగూ?

సూర్య : నీ మొహం. జాగ్రత్తగా విను. కట్టింది గాలిమేడ. గోడలుమాత్రం ఇసికా, సున్నం, కదల్లేదుగాని పరిగెట్టాలని ఆశ. ఏమిటది?

సుబ్బ : ఏమో బాబూ, మొదట చెప్పిందే ఇది.

సూ : అప్రా. ఆఖరుదాన్ని, సరిగ్గా విను. కళ్ళున్నాయిగాని, దృష్టి లేదు. నోరుందిగాని వాయిలేదు. మాట ఉంది గాని మంతిలేదు. పగలు.

కాం : ఛా, ఏమిటదీ, వెర్రివాగుడు. నువ్వు చెప్పూ, సమాధానం చూదాం.

సూ : (నవ్వుతాడు) నాకుమట్టుకు ఏం తెలుసు?

కాం : అమాయికులతో చెలగాటం ఆడకు సూర్యం. ఎంత బాధగా ఉంటుంది.

సూర్యం : వాడా అమాయకుడు. ఏమిరా సుబ్బయ్యా, నువ్వు అమాయకుడివా?

సుబ్బ : ఏమో మరి. అంతా అంటున్నారు.

సూర్యం : పెద్దయ్యాక నువ్వు ఏం పని చేస్తావురా?

సుబ్బ : దివాలి బండ్లోతు. ఊళ్ళో రోజూ భగభగా మెరిసేటట్టు తోముతాను.

కాం : ఓరి నీ మొహం యీదా, అకెం కోతికలురా.

సూర్యం : మీ తమ్ముడు మరేం అనుకున్నావ్. బృహస్పతి.

* * *

[క్షణం విరామం. రైలు వాయువేగంతో పరిగెడుతున్న చప్పుడు]

సూర్యం : విన్నారా, పాలేశ్వరుడు

గారూ, అదీ జరిగింది. ఏదీ, ఆ సిగరెట్టు పెట్టె ఇలా అందుకోండి.

పాలే: ఇంద ఎన్నాళ్ళయింది, ఇది జరిగి?

సూర్యం: చెప్పాను కదుటండి. తుపానొచ్చిన సంవత్సరమనీ. అయిదేళ్ళవదూ దగ్గిర దగ్గిరా.

పాలే: 'అవదు మరీ. అవుతుంది..... అమ్మాయి పూర్తి పేరు ఏమిటన్నావూ?

సూర్యం: లక్ష్మీకాంతం.

పాలే: వాళ్లనాన్న పేరు?

సూర్య: పురుషోత్తం. మీ కేమైనా తెలుసా ఏమిటి?

పాలే: అబ్బే, ఊరికే అడిగాను. తరవాత ఏం జరిగింది? ఆ అమ్మాయిని ఎప్పుడైనా చూశావా?

సూర్య: లేదండీ. ఆతరవాత మా వాళ్లకి ఆ ఊరునుండి బదిలీ అయిపోయింది. నేను కాలేజీలో ఉన్నప్పుడు కాంతం రెండు మూడు ఉత్తరాలు రాసింది. జవాబు ఏం రాయడానికీ తోచలేదు. సందేలు మళ్లుమ చేని. చేశాప్ప వణికేసి. రెండు మూడు సార్లు రాసి చింపి వేశాను కూడా. అటు తరవాత ఏముంది. మామూలు కథే. ఉద్యోగం కోసం నేను యిలా దేశదేశాలు తిరగడం, మా మేనమామ కూతుర్ని పెళ్ళాడడం, ఇవన్నీ జరిగాయి. సరే, మా ఆవిడ మీకు తెలుసుగా.

పాలే: తెలియకేం. మరి కాంతంకోసం వెతకా లనిపించలేదూ? నువ్వు పెళ్ళాడినప్పుడు నువ్వు చేసిన పని మంచిదే ననిపించిందా?

సూ: ఏమిటో. తరవాత క్రమంగా నిరాశ ఎక్కువైపోయింది. జరిగిందేదో జరగనివ్వడమేగాని, స్వంతంగా ఆలోచించే శక్తిపోయింది. గాలి ఎటువేస్తే అటే. అదిగాక, ఆ తుపానులో ఏమిటో ఉందండీ, పాలేశ్వరుడుగారూ, నక్కచెప్పినట్టు, అంతగాలివాన నే నెప్పుడూ చూడలేదు. ఆ అయిదురోజులూ మహా వింతగా ప్రవర్తించాం, అంతా ఏదో భయం. ఏదో బెంగ. అప్పట్లో నాకనిపించేదీ, "ఏదో రెండుమూడు జన్మల అనుభవాలు కలిసిపోయాయి"ని. అప్పుడు కాంతం ఎలా కనిపించేదో తెలుసా? ఏదో జన్మజన్మాలనుంచీ వాతో కలిసి బతుకుతున్న మనిషిలాగ, నాకోసమే అసలు యీ భూమిమ్మీద పుట్టినట్టు అనిపించేది. కాంతం ఏమాట మాటాడినా అది ఇదివర కెక్కడో విన్నట్టూ, అవ్వాళ్ళో కాక, యిదివర కెక్కడో, ఎప్పుడో కాంతాన్ని చూసినట్టూ, అనిపించేది. ఉండుండి భయంవేసేది. తుపాను అనుకుంటాను.

పాలే: అవును. ప్రకృతి చెలరేగితే మనం ఏమాత్రం! గడ్డిపోచల్లా కొట్టుకుపోతాం. అయితే మీ బావగారి పేరు ఏమిటన్నావ్?

సూ: శివానందంగారు, మీకు తెలుసా ఏమిటి?

పాలే: అబ్బే. ఊరికే అడిగాను.

సూ: ఏమిటో సోనిస్తురూ, సోగి. అయితే ఎప్పుడొచ్చేనన్నారూ, సెలవునుంచీ.

పాలే: మూడు రోజు లయింది. ఆఫీసులో అడుగుపెట్టగానే రిలీవింగు పంపివేశారు.

సూ: మీకేమండీ, సీనియర్ పత్తులూ, కష్టి ఏమాత్రం?

పాలే: అబ్బే, ఇంక ఆ వ్యాపకం పెట్టుకోదలుచుకోలేదు.

సూ: ఆహా, అపర ధర్మరాజులు. పది హేనురోజులైంది, నేను రైలుమీదికి వెళ్లి. ఫూడీ, తర్కారీ!! అన్నం లేదు.

పాలే: కష్టి ఏమాత్రం!

సూ: అఁ, ఏకో, టీ, సిగరెట్లూ కలిసొచ్చాయి. అంతే, ఓహో, ఒచ్చేశామండోయ్. జంక్షన్ వొచ్చేశాము. టైమెంతో. పదకొండుంబావు. రైట్ టైమ్. డ్రైవరు ఉద్దండుడులా ఉన్నాడు. అమ్మయ్యా, కొంపచేరుకొనే సరికి అర్థరాత్రి అవుతుంది.

[రైలు ఆగినచప్పుడు, పట్టాలు తొలగించుకుని, టకటకమని కీచుమని స్టేషనులో ఆగే ధ్వని, కోలాహాలం. జనసమ్మర్దం.]

సూ: లెండి పాలేశ్వరుడు గారూ, బిచాణా సర్దండి. కబుర్లు చెప్పుకుంటూ కమ్మలమీంచి నడిచిపోదాం.

పాలే: నువ్వు ముందువెళ్లు నాయనా. నాకు కాస్త పనుంది. చిన్న మేష్టరుతో కొంచెం మాటాడి, తరువాత ఒస్తాను.

సూ: అచ్ఛా. అయితే నేను నడుస్తాను మరి, పొద్దున్నే మా ఇంటికి కాఫీకి రండి.

పాలే: మంచిది నాయనా, బతికి సుఖపడు. ఆగడు, ముందు నడువ్. తరవాత కలుసుకుందాం.

సూ: వెళ్లి రానా?

పా: సరే.

* * *

[క్షణం విరామం.
తలుపుకొట్టిన చప్పుడు.]

సూ: జానకీ...జానకీ...జానకీ...
(తలుపు కొట్టిన చప్పుడు.)

జానకి: (లోపలనుండి) - వస్తున్నా—
(గడియ తీసిన చప్పుడు).

సూ: హమ్మయ్య యీ రైలు డ్యూటీ కాదుగాని, ప్రాణంపోతోంది జానకీ.

జా: భోంచేశారా? లెండి. అంతా సిద్ధంగా ఉంది.

సూ: ఎలా తెలుసు నీకు? ఇలా అర్థరాత్రి దిగబడతానని.

జా: బాగుంది సరసం. కంట్రోల్ ఫోన్లో చెప్పారుగా.

సూ: ఎవరు చెప్పారు?

జా: కోనయ్య. సాయంత్రం పనిగట్టుకొచ్చి చెప్పాడు.

సూ: సరసం ఆడి ఉంటాడు.

జా: ఏడిసినట్టే ఉంది. ఎవరితో?

సూ: ఏమో, నీకే తెలియాలి.

జా: చెప్పుదురూ, ఎందుకొచ్చిన గోల, నాకు నిద్దరొస్తోంది బాబూ.

సూ: ఏమిటి చెప్పడం?

జా: భోజనం జేస్తారా?

సూ: చెయ్యను.

జా: రక్షించారు. అయితే పడుకోండి హాయిగా. తెల్లారేక మాటాడుకుందాం.

సూ: ఏమిటి సంగతులు? మీ నాన్నదగ్గరనుండి ఏమైనా ఉత్తరాలొచ్చాయా?

జాన: లేదు. అన్నట్టు చూశారా? ఎంత చిత్రంగా ఉందో; విన్నారా, మీరీ సగంతి?

సూ: ఏ సంగతి?

జా: మన పొరుగాయన పాలేశ్వరుడుగారు. రెణ్ణెల్లు సెలవుపెట్టి దేశంవెళ్ళి ఏం చేశాడో తెలుసా?

సూ: ఇద్దరు కలిసే ప్రయాణం చేశాం ఇందాక. ఏం చేశాడేమిటి? కొంపతీసి పెళ్ళిచేసుకోలేదు కద.

జాన: సరిగ్గా అదే చేశాడు. వయస్సు మళ్ళాక బుద్ధి పెడతలలో పడుతుంది కాబోలు. కాలనీ అంతా ఒకటే యిది.

(53 వ పేజీ చూడండి)

అప్రాప్తమనోహరి

"అబ్బబ్బ లోకు లెంత కృతఘ్నులు!" అనుకున్నాడు నారాయణ. తనేమో బంగారు కొండ త్రవ్వి లోకుల తలపైకెత్తేసినట్టు, చేసిన మేలుకు కించిత్తు కృతజ్ఞతనైనా చూపక పోవడం అటుండగా వాళ్లు తనను అధః పాతాళంలోనికి తోసేసినట్టు భావించుకుని, లోకులపైన కోపాలు, మిరియాలు నూరసాగాడు నారాయణ.

ఈ అమూల్యమైన అభిప్రాయం నారాయణకు ఆదినుంచీ లేదు. ఈమధ్యనే కలిగింది. తన భార్య చనిపోయినప్పుడు ఇరుగు పొరుగు పెద్దమనుషులు, దూరపు బంధువులు, వీధంటవెళ్లే పరిచితులూ వీళ్లందరూ తనచుట్టూ మూగి మానవ జీవితం యొక్క అస్థిరత్వాన్ని గురించీ, ఒక్క నారాయణ భార్యగాక, ఈ ప్రపంచంలోని ప్రతి ప్రాణి ఎప్పుడో ఒకప్పుడు చనిపోవలసిందననే సత్యాన్ని గురించి, ఎవరికి తోచిన మాటలువారు చెప్పి ఓదార్చేసి వెళ్ళినప్పుడు "ఆహా! లోకులెంత దయాళువులు" అనుకున్నాడు నారాయణ. అలా అనుకుని అంతలో వచ్చిన ప్రతివ్యక్తీ తనకు ఆత్మీయుడని భావించీ, పెళ్ళిచూపులకై తను మొదటిసారి అత్తగారింటికి వెళ్ళినప్పుడు జానకి తనపై పాపిగా ఏలా రాళ్ళు కరిగి నీళ్లై ప్రవహించాయో, ఆమె రాకతో వెయ్యి జ్యోతులు వెలిగించినట్టు తన ఇల్లెలా దేదీప్యమానమైపోయిందో, తనేదో మాటపట్టింపు మీద ఆమెపై అలిగి మాట్లాడక పోయినప్పుడు ఆమె కార్చిన కన్నీటి యొక్క ఘన పరిమాణమెంతో, తను కిటికీ అరుగుపై కూచుని వున్నప్పుడు ఆమె వంటగదిలో నుంచి 'ఏమండీ' అని పిలిచే పిలుపులో ఎంత మాధుర్యం దాగివుండేదో ఈవిషయాలన్నింటినీ కథ్లచేయంగా ఉపన్యసించేవాడు నారాయణ. ఎదుటిమనిషి మనోరంజకమైన ఈ ప్రణయ వృత్తాంతాల్ని వింటూ, ఇటీవల ఆ ఇంట్లో ఒక దుర్ఘటన జరిగిందన్న విషయాన్నే విస్మరించి "ఆహా, ఓహో, అరరే" అంటూ వినోదసాగరంలో తలమునకలైపోయి తర్వాత తిరిగి తెప్పరిల్లుకుని "అటువంటి ఇల్లాలికే చావు తప్పలేదే నారాయణా! ఇక మనమంతా ఎంతక్?" అని తనకు తెలిసిన వేదాంతాన్ని ఏకరువుపెట్టి, అతనిదగ్గర సెలవుతీసుకొని వెళ్ళిపోయేవారు.

నారాయణ కథల్ని కల్పించి చెప్పడంలో ఎంతటి సమర్థుడైతేనేమి, అవేమీ కళ్యాణాత్మకమైన విష్ణుకథలు కావుగదా, వినంగా వినంగా క్రొత్తలు కావడానికి! వినివినీ వినుగెత్తిపోవడంవల్ల చాలామంది నారాయణ ఇంటికి రావడానికి సాహసించలేకపోయారు. ఒకవేళ ఎవడో ఒక మిత్రుడు, అతనికి వీధిలో హఠాత్తుగా ఎదురైనా "ఉండు నారాయణా! కొంచెం అర్జెంటు పనివుంది. సాయంత్రం వచ్చి మాట్లాడుతానులే" అని చరచరా వెళ్ళిపోయేవాడు.

పరిచితులందరూ, నారాయణనీలా తప్పించుకు తిరగడంలో మరొక అంతరార్థం కూడా లేకపోలేదు. బ్రతికి వున్నంతకాలం అతను భార్యను చెప్పరాని చిత్రహింసలకు గురిచేశాడు. ఈ కారణం వల్లనే ఆమె చనిపోయినప్పుడు దగ్గరి బంధువులెవరుగానీ నారాయణ ముఖాన్ని చూడ్డానికి మనస్కరించక జానకమ్మ అంత్యక్రియలకు కూడా [illegible]. వాళ్ళు [illegible] ఏమిటి, నిజం చెప్పాలంటే భార్య చనిపోయినందుకుకూడా నారాయణ చింతించలేదు. జానకమ్మ మొదటినుంచీ దుర్బలమైన మనిషి. తనాశించినంత సౌఖ్యం ఆమెవల్ల కలుగకపోయినందువల్ల నారాయణ ఆగ్రహోదగ్రుడై ఆమె కంటపడితేనే మండిపడేవాడు.

సంవత్సరానికి రెండుమూడుసార్లు సినిమా మాత్రం నారాయణకొక వాడుక. అరణాలు ఖర్చుచేసి సినిమాహాల్లో ప్రవేశించే నారాయణ అనిమిష నయనాల్తో తెరపైని బొమ్మల్ని తిలకించేవాడు. ఒక్క క్షణంపాటు కళ్లు అరమూతలు పడినా తను ఇచ్చిన అరణాల్లో కొంత వ్యర్థమైపోగలదని నారాయణ గాఢంగా విశ్వసించేవాడు. గ్రహచార వశాత్తు అదేదైనా హైక్లాసు పిక్చరై అందులో తనకు కావలసిన పచ్చి శృంగారము అసభ్యమైన హాస్యమూ లేకపోతే డైరెక్టరునీ నటీనటుల్నీ కసిదీరా తిట్టుకుంటూ ఇంటికి వచ్చేవాడు. ఐతే సినిమాలనుగురించి నారాయణ ఉద్దేశ్యాలు ఏలాటివైనప్పటికీ అందువల్ల ప్రొడ్యూసర్లకు గానీ, థియేటర్ యజమానులకు గానీ పీసమంత నష్టమైనా వాటిల్లలేదు. కానీ, అతను సినిమావలే భార్యనుకూడా ఒక వినోదసాధనంగా పరిగణించినందువల్ల మాత్రం, ఆమె భూలోకంలోనే నరకయాతన అనుభవించింది.

అంతగా భార్యను సుఖపెట్టిన నారాయణ, ఆమె చనిపోగానే ప్లేటు మార్చేసి తనామెను పువ్వుల్లోవుంచి పూజించినట్టు లేనిపోని అభూతకల్పనలన్నింటినీ ఏకధాటిగా ఏకరువుపెడ్తే అతనిని గురించి తెలిసినవారు ఎంతకాలమని ఓపిగ్గా వినగలరు? ఒక్కొక్కరే తనఇంటికి రావడం బొత్తిగా చాలించుకునేసరికి నారాయణకు పిచ్చిబట్టినట్టయింది.

ఒకనాడు నారాయణకు అన్నం వడ్డిస్తూ అతని విధవ అప్పచెల్లెలు "ఏంరా బాబూ! నిన్ను చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతున్నది. నువ్వేం ముసలివాడివా, ముతకవాడివా? ఎక్కడో ఒక సమ్మంధం చూచి ఆ కార్యం కాస్తా అయిందనిపించుకో. నా కట్టె ఏం శాశ్వతం? రేపో, మాపో నేను మట్టిలో కలిసిపోతే నీకు గంజి కాచిపోసేవాళ్ళెవరు?" అన్నది. నారాయణ తల పైకెత్తి "ఏమిటే, ఏమిటే!" అన్నాడు. ఆమె "పెండ్లిరా, పెండ్లి" అన్నది. "పెండ్లా, పెండ్లా" అంటూ నారాయణ అంతటి తీయని ఊహ తన తలలో పుట్టకపోయినందుకు తన్నుతానే నిందించుకొని సరైన సమయంలో ఈ హితబోధ చేసినందుకు తన అప్పచెల్లెల్ని లోలోపలనే అభినందించుకున్నాడు.

ఆరాత్రి నిద్రలో నారాయణ ఒక కల గన్నాడు. అది కొంచెపాటి చేంతాటిలా సుదీర్ఘమైన కల. ఆ కలలో నారాయణకు ఒక అమ్మాయితో పెండ్లి జరిగింది. ఆ పెండ్లి శకుంతలా దుష్యంతులు చేసుకొన్న

గాంధర్వ వి[illegible] నారాయణ నందనందనంటి సుందరోద్యాన సీమలో పచారు చేస్తుండగా, అతనికొక అమ్మల మిన్న ప్రత్యక్షమైంది. "శివుడవో, మాధవుడవో, కమలాభవుడవో, నిన్నెవరని నిర్ణయించేదిరా?" అన్న త్యాగయ్యగారి ధర్మ సందేహంలా, ఆమె దాపునవున్న సరోవరంలోనుంచీ పైకి తేలిన నాగకన్యో, దివినుంచీ భువికి జారిన నిర్జరాంగనో, లేక సామాన్య మానవవనితో నిర్ణయించుకోలేక నారాయణ పొందిన ఆరాటం వుందే, అది వర్ణనాతీతం! వనిత తనంతదా వలచి వచ్చినప్పుడు పలకరించకనైనా పోవడం అనాగరికంగా వుంటుందనుకొని నారాయణ ఆమెతో ఏదో మాట్లాడబోయి, ఉద్వేగంవల్ల నోట మాటరాక ఒక చిరునవ్వు మాత్రం విసరగలాడు. ఆగంతకురాలు ఆ చిరునవ్వుతో చిత్తైపోయి, సిగ్గుపడి ఆసిగ్గే తన సింగారాన్ని ద్విగుణీకృతం చేయగా తటాలున తలకిందికి వంచుకున్నది. సరిగ్గా ఆ సమయానికి పొదరింట్ల చాటునుంచీ ఇద్దరు లేజవరాండ్రు ఈవలికి వచ్చి ఆమె చేతికొక పుష్పహారమిచ్చారు. మరుక్షణంలో ఆ హారం నారాయణ మెళ్లో పడింది. తర్వాత నూత్న దంపతుల్ని ఒక మందారవృక్షం క్రింద చలువరాతిన్నెపై కూర్చుండబెట్టి ఆ నవయౌవనవతులు పెండ్లి పాటలు పాడారు.

"ఎంత చక్కనివాడో చూడమ్మా!
మా రాకుమారుడు
కంతునే మరపించునే కొమ్మా!
ఇతని రూపము జూచినారే
విరహవేదన జెందినారే
దివిజభామినులెందరో, ఈ
మోహనాంగుని వలచినారే"

అని ఒక చక్కనిచుక్క మరో పుత్తడి బొమ్మకు చెబుతుండగా నారాయణ తను కోసలరాజ్యాధిపతో, కళింగ భూమీశుడో, ఉత్కళ నరపాలుడో తెలియక తికమకపడ్డాడు.

ఈలా ఏ దేశానికి తను రాజో, లేక ఏ సామ్రాజ్యానికి సామ్రాట్టో తెలుసుకోలేక నారాయణ డైలమాలో అవస్థపడుతుండగా, అతనికి నిద్రాభంగం కలిగింది. లేచి చూచేసరికి శర్మ తనను తట్టి లేపుతున్నాడు.

"అక్కయ్యా! త్వరగా టిఫిన్ కానీయ్" అని రమణమ్మకు పని పురమాయించి నారాయణ తన బాల్యస్నేహితుడితో "ఏంరా, ఆరు నెల్లకు ముందు మాయమైపోయినవాడివి ఈరోజు ఎక్కణ్ణుంచీ ఊడిపడ్డావ్" అన్నాడు

శర్మ నారాయణ ప్రశ్నకు జవాబు చెప్పకుండా "పాపం. నీభార్య పోయిందటగా"



"ఎక్కడమ్మా పెళ్లిచూపులు! తెల్లవారి తొమ్మిదిగంటల కనగా వచ్చాం......ఆ మనిషికి ఇంత ఘోషా ఐతే నేను భరించలేనబ్బా!"

అన్నాడు. "అవున్రా. చనిపోయింది" అని నారాయణ రెండు క్షణాలపాటు విచారాన్ని అభినయించి తర్వాత "మళ్ళీ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు

శర్మ ఒక వెకిలినవ్వు నవ్వి "సంసార సాగరంలోబడి మునగానాం, తేలానాం అంటూ అఘోరించాలంటావేమిట్రా ఇంకా? నీకిప్పుడు ముప్పై అయిదేళ్ళు ఇక పదేళ్లలో ముసలాడివైపోతావ్. నా మాట విని పెళ్ళిమాట కట్టిపెట్టు తిరుప

అప్రాప్త మనోహరి ★

తిలో వేంకటేశ్వరుడున్నాడు. భద్రాచలంలో శ్రీరాముడున్నాడు. మైసూరులో దసరాకు వేడుకలు జరుగుతాయట. ఎక్కడో, హైదరాబాదుదగ్గర అజంతా, ఎల్లోరా గుహలున్నాయట. ఒకసారి హాయిగా దేశమంతా చుట్టివద్దాంరా" అన్నాడు.

నారాయణకు చెప్పరానంత కోపం వచ్చింది. తను శుభమా అని పెళ్ళిచేసుకోబోతుండగా, అది మానేసి బైరాగి వాడిలా దేశాలవెంట తిరిగి వద్దాం రారా అని పిలిచే శర్మను ఏంచేస్తే తీరుతుందో నారాయణకు తోచలేదు. ఈలాటి అవివేకికి తను టిఫిన్ తయారు చేయమని చెప్పినందుకు అతడు లోలోపల ఎంతో కించపడ్డాడు. శర్మ మాత్రం తర్వాత ఏమీ మాట్లాడకుండా మౌనందాల్చి రవణమ్మ తెచ్చిఇచ్చిన పెసరట్లుతిని, ఒక గ్లాసెడు కాఫీ త్రాగి "ఏమో. నేను చెప్పవలసింది చెప్పాను. తర్వాత నీ ఇష్టం." అంటూ వెళ్ళిపోయాడు.

"ఓరీ శర్మా! నువ్వెంత మూర్ఖుడిరా?" అనుకొన్నాడు నారాయణ. ఇంటికి వచ్చిన వాడిని ఆప్యాయంగా పలకరించి కమ్మని పెసరట్లు సమర్పించినందుకైనా వీడు ;లక్షణంగా పెళ్లిచేసుకోరా బాబూ అనరాదా అని నారాయణ ఆరోజంతా తనకు కనపడిన ప్రతివాడితోనూ శర్మఎంతటి అవివేకో, ఎంతటీ అప్రయోజకుడో ఉదాహరణలతో సహా వివరించి చెప్పాడు.

ఐతే ఒక శర్మే కాదు, తనతో ఏమాత్రం స్వల్పపరిచయమున్న వాడైన ప్రతివాడూ తన రెండో వివాహానికి సుముఖత చూపనందున, నాయణకు లోకులందరూ కృతఘ్నుల్లా కనిపించారు! చేబదుళ్లు లేదనకుండా ఇస్తున్నా, ఇంటి కడప త్రొక్కినవాడికి ఒకపూట భోజనంతోనో, ఒకవేళ టిఫినుతోనో కడుపు నిండించి పంపుతున్నా ఎవడుగానీ, తన వివాహప్రస్తావన వస్తే మూతిముడుచుకుంటాడేమి? తనుబాగుపడాలంటే వీళ్లుకండ్లల్లో నిప్పులు పోసుకుంటారెందుకు? అని వితర్కించుకొని, నారాయణ లోకులందరూ ఎవడికివాడే బాగుపడాలని చూస్తాడనీ, ఎదుటివాడు పచ్చగావుంటే వాళ్లల్లో ఎవడుగానీ చూచి సహించలేడనీ, వాళ్లకెంత మేలుచేసినా బూడిదలోపోసిన పన్నీరులా వ్యర్థమేనని ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

ఇలా లోకులపైన విశ్వాసరాహిత్య తీర్మానాన్ని రూపొందించుకొన్న తర్వాత నారాయణకు పరమానందంతో పరిచయం కలిగింది. పరమానందం ఆ ప్రాంతానికి పెళ్లిళ్ల పేరయ్య. పెళ్లిచేసుకోవడానికి వరుడు, వధువు సమ్మతిస్తే చాలుననీ, మిగతా లోకులయొక్క అభిప్రాయాలని పరిగణించడం బొత్తిగా అనవసరమనీ, తేల్చిచెప్పిన పరమానందం నారాయణకళ్లకు బొగ్గుల్లో వజ్రంలా కనిపించాడు. అంతటి రహస్యాన్ని బయట పెట్టడంతో ఊరుకోక పరమానందం వల్లిపీడులో ఒక అమ్మాయి వున్నట్టు, ఆమె తండ్రి ఒకవరుణ్ణి చూచిపెట్టమని తనను వేపుకతింటున్నట్టూ చెప్పి, పెద్దలు శుభస్య శీఘ్రమ్మన్నారు గనుక నారాయణను పెళ్లి చూపులకోసం బయల్దేరమన్నాడు.

* * *

గలగలాపారుతున్న ఏటినీటిలో ముఖం శుభ్రంగా కడుక్కొని, కొత్తగా కొన్న దువ్వెనతో క్రాపునున్నగా దువ్వుకొని, ఊరిముందరరావిచెట్టుక్రింద విఘ్నేశ్వరునికి వచ్చిన పని రైట్టయితే రాబోయే వినాయకచవితికి నూరు ఉండ్రాళ్లు ఇచ్చేటట్టువాగ్దానంచేసి పరమానంద భరితుడై పరమానందంతో వల్లిపీడు చేరుకున్నాడు. ఇంటిముందర వరాండాలో కూచొని భట్టి విక్రమాదిత్యుని కథలు చదువుకుంటున్న అయినాపురంవారి అమ్మాయి సుజాత మొట్టమొదట నారాయణను చూచి "అమ్మా అమ్మా! కృష్ణవేణికి పెత్తనం వస్తున్నారే" అని ఇంట్లోకి కేకవేసి, పొరుగింటి పద్మాక్షిని, మిద్దింటి కమలనీ వెంటబెట్టుకొని సందువీధినిబడి నాలుగడుల్లో వెంకటప్పయ్యగారి ఇల్లు చేరుకొని పెరట్లో మల్లెపందరికింద జామిపండుతింటూ కూచున్న కృష్ణవేణితో "వస్తున్నార్ వస్తున్నార్ వస్తున్నార్ కృష్ణవేణి" అనిరాగం తీసింది, తనతమ్ముడు పాడే "వస్తున్నాయ్, వస్తున్నాయ్ జగన్నాథ రథ చక్రాల్" అనే పాటను అనుకరిస్తూ.

నారాయణ అనే వరునితో సహా తాను నాలుగైదురోజుల్లో రానున్నట్టు పరమానందంముందే జాబువ్రాసివుండడంవల్ల ఎవరువస్తున్నారో, ఎందుకు వస్తున్నారో కృష్ణవేణికి తెలుసు. నారాయణ రెండోపెళ్ళివాడనీ, అతని అంపపు కోతకు తట్టుకోలేక మొదటిభార్య నూరేండ్ల నిండు బ్రతుకు మధ్యలో మట్టిపాలయిందనీ ఆమెకెవరో చెప్పారు. అందుమీదట ఆమె తల్లితో తనకిప్పుడే పెండ్లీ, గిండ్లీ ఏమీ వద్దని చెప్పింది. కానీ ఇంట్లో ఆమె మాట చెల్లలేదు. అందుచేత "కానీండీ మీరేం చేస్తారో నేను చూస్తాగా!" అన్నట్టు ఆమె ఎవరితోనూ మాట్లాడకుండా, సరిగ్గా వేళకు తినకుండా ఒకవిధమైన సత్యాగ్రహాన్ని కొనసాగిస్తోంది.

చెలిమికత్తెలు కృష్ణవేణితో పరాచికాలెలా ప్రారంభించడమా అని ఆలోచిస్తుండగా ఇంట్లోనుంచీ ఒక అబ్బాయి పరుగెత్తు

ఆరోజు రైలు ఆరుగంటలు లేటుగా వెళ్తోంది. బండిలో ఒకడు మరియొకనితో, రైల్వే టైంటేబుల్ని చూపిస్తూ: ఈ టైంటేబిల్ ఉపయోగమేమిటండీ?

మరియొకరు: బళ్లు ఎంత లేటుగా వెళ్తున్నాయో తెల్సుకోవడానికి.

సి. ఆర్. లక్ష్మి, నంద్యాల.

కుంటూ వచ్చి వాళ్ళు వచ్చేశారండోయ్" అంటూ చప్పట్లు చరిచాడు. "మనిషి ఎలా వున్నాడో చూచి వస్తానమ్మా" అని కమల ఇంట్లోకి పోబోయింది. పద్మాక్షి ఆమెచేతిని పట్టుకొని బలవంతంగా క్రిందకూచోబెడ్తూ "ఓసి నీఇల్లు బంగారంగానూ! కలకాలం ఆయనగారితో కాపురంచేయబోయే వాళ్ళకే లేని తొందర నీకెందుకే? అదీగాక మొట్టమొదట నువ్వు ప్రత్యక్షమైతే, ఆయన కొంపదీసి నిన్నే పెళ్ళికూతురనుకుంటే, తర్వాత కృష్ణవేణి గతేమిటి?" అన్నది. "ఔను నిజం, ఔను నిజం, నీవన్నది నిజం,నిజం" అని సుజాత పద్మాక్షి పలుకుల్లో వాస్తవమున్నట్టు ఒప్పుకోగా, కమల "ఇంతకీ ఆయన ఎలావున్నాడో గదబ్బా" అని ఒక అమాంతమైన సందేహాన్ని వెలిబుచ్చింది. సుజాత "నువ్వు తోలుబొమ్మలాటలో జుట్టు పోలిగాణ్ణి చూళ్లేదటే" అన్నది సీరియస్ గా. ఆమె అలా అనగానే కమల తనకేదో పెద్ద రహస్యం తెలిసిపోయినట్టు "ఐతే కృష్ణవేణక్క బంగారక్కగా మారబోతుందన్నమాట!" అని పక్కున నవ్వేసింది!

అంతవరకూ వాళ్ళమాటల్తో తన కేమీ సంబంధం లేనట్టు పరధ్యానం నటిస్తూ కూచునివుండిన కృష్ణవేణి, ఇక ఊరుకోలేక కమల చెవులు మెలిబెడ్తూ "ఏమన్నావ్, ఏమన్నావ్" అన్నది తన ఉక్రోషాన్నంతా వెళ్ళగక్కుతూ. సుజాత కృష్ణవేణి చేతుల్ని గట్టిగా పట్టుకొని కమల దూరంగా పారిపోవడానికి వీలుకలగజేసి పద్మాక్షితో "ఐనా కాలం బొత్తిగా చెడిపోయిందమ్మా! ఉన్నమాట చెబితేనే ఉలుకైతే ఇంక ఏ నీళ్లులేని బావిలో దూకేది!" అని నిట్టూర్చి, పైట చెరుగులో ముఖాన్ని దాచుకొని ముసిముసినవ్వులు నవ్వుకొంది. తనకన్నా పెద్దదైన సుజాతను ఏమనడానికి పాలుపోనందువల్ల కృష్ణవేణి కోపమంతా దుఃఖంగా మారింది. గద్గదమైన కంఠంతో ఆమె "నా బ్రతుకంటే అందరికీ ఎగతాళై పోయింది. నేను బంగారక్కనైతే ఔతానులే. మీరు ఇంద్రాణులు కాబోవడం కూడా నేను చూస్తాగా" అని వెక్కి వెక్కి ఏడుస్తూ "మిమ్మల్ని ఇక్కడికెవరు రమ్మన్నారు? ఎందుకొచ్చారు? పొండి" అన్నది.

"ఎంత వెరజాణవే తల్లీ! ఏడిస్తే మేమందరమూ వెళ్లిపోతామనుకుంటున్నావా? నువ్వు ఏడవవసమే కాదు. కావలిస్తే మమ్మల్ని తిట్టు, కొట్టు. ఏమైనా చెయ్. మేమిక్కడనుంచీ కదలం" అని సుజాత కృష్ణవేణిదగ్గర కూచుని కొప్పులో ఇరుక్కునివున్న కుటిలకుంతలరాశిని విప్పి పద్మాక్షి తెచ్చియిచ్చిన దువ్వెనతో దువ్వుతూ "ఓసి వెర్రిబాగుల్దానా! ఇంట్లో ఒక అమ్మాయి వున్నదంటే ఎందరో వస్తారు పెళ్ళిచూపులకని. వస్తే వస్తారు, మనదేం పోయింది! అమ్మకు నాన్నకు మన పైన ఎంత అధికారముంటేనేమి, అది ఈ పెళ్ళిళ్ళ విషయంలోమాత్రం చెల్లుబడి కాదు. చెల్లుబడి అయ్యేకాలం పోయేది. వాళ్లేమనుకుంటున్నారో మరి!" అని అనునయించింది.

హాల్లో నారాయణ పరమానందంతో రాజకీయాల్ని గురించీ, సినిమాలని గురించీ తన ప్రత్యేకాభిప్రాయాల్ని ఇంట్లో వాళ్ళందరూ వినేటట్టు చెబుతూ అప్పుడప్పుడూ దొంగచూపుల్తో ఇంటని గాలించేశాడు. తాను జీవితంలో మొట్టమొదటిసారిగా కొన్న సిగరెట్ పాకెట్ చేతిలో వుంచుకొని, ఇంటిలోపలినుంచిగానీ బయటినుంచి గానీ ఎవరైనా అక్కడికొచ్చినప్పుడు సవిలాసంగా సిగరెట్ ముట్టించి పొగను

★ అప్రాప్త మనోహరి ★

ఒక్కొక్కసారి ఒక్కొక్కవైపుకు ఊదుతూ కృష్ణవేణి తమ్ముణ్ణి రెండుమూడుసార్లు దగ్గరికి పిలిచి "మీ ఊళ్లో ప్లేయర్స్ సిగరెట్లు దొరుకుతాయా!" అని అడిగాడు. ఆ అబ్బాయి "మా ఊళ్లో చాలామంది తాజ్మహల్ బీడీలు తాగుతారు. కొందరు ముసలాళ్లయి లంగరు పొగచుట్టలు తాగుతారు. అవి కావాలంటే తెచ్చి ఇస్తాన"నగా నారాయణ పల్లెటూళ్ళ అజ్ఞానానికీ అనాగరికతకూ నిలయాలనీ, వాటిని ఉద్ధరించాలనే ఆశయం తనవంటి వాళ్ళకు వున్నప్పటికీ అదెందువల్లనో నెరవేరడం లేదనీ ఒక వేడి నిట్టూర్పు విడిచాడు.

అప్పటికి మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. వంటింట్లోనుంచీ తాళింపు వాసనలు బయలుదేరి నారాయణ నాసికా పుటాలను గిలిగింతలు పెడుతున్నాయ్. అతనికి ఆకలైనమాట కూడా నిజం! ఐతే ఆకలికన్నా మరోక తీవ్రవేదన అతణ్ణి బాధించసాగింది. అందువల్ల అతడు లేచి కొంతసేపు అటూ ఇటూ పచారుచేసి "ఒక్కమాట చెప్పాలి పరమానందం! నాతోరా" అని అతణ్ణి వెంటబెట్టుకొని ముందు పెండలో ఊరుదాటి ఒక నిర్జనమైన ప్రదేశాన్ని చేరుకొని "ఇక్కడికి మన మెందుకు వచ్చామో నీకు తెలుసా పరమానందం?" అని ప్రశ్నించాడు. పరమానందం "పెళ్లి చూపులకు" అన్నాడు, ఇంచుక విస్మయంతో. "ఎక్కడయ్యా పెళ్లిచూపులు! తెల్లవారి తొమ్మిది గంటల కనగా వచ్చాం. ఇంతవరకూ పెళ్లి కుమార్తె ఇంట్లో వున్నదీ లేనిదీ తెలియదు. ఆ మనిషికి ఇంత ఘోషా ఐతే నేను భరించలేనబ్బా!" అని నారాయణ తన పరితాపాన్ని వెళ్లగ్రక్కాడు. వచ్చిన కోపాన్ని అణచుకొని పరమానందం నవ్వి "బలేవాడివి నారాయణా! ఆత్రగానికి అన్నం ఆకులో పెడుదువుగానీ నాకు నేలపైనే పెట్టమన్నాడట, ముందటి కెవడో నీలాటి నిదానస్తుడు! నువ్వు వచ్చి రాకముందే ఆ అమ్మాయి సింగారించుకొని నీ ముందరికి రావడానికి అదేమైనా భోగంవాళ్ల కొంపనుకొన్నావా? రావయ్యా రా! ఈరహస్యం చెప్పడానికా ఎండలో ఇంతదూరం నడిపించింది" అని, నారాయణ ఏమో చెప్పబోతున్నా వినిపించుకోకుండా ఊళ్లోకి దారితీశాడు.

ఇల్లు చేరుకొని అతిథు లిద్దరూ భోజనాలకు కూచున్నారు. కృష్ణవేణి తల్లి అన్నం వడ్డించి కూరవేసి లోపలికి వెళ్లింది. నారాయణ నెయ్యికోసమో, మరి దేనికోసమో ఎదురు చూచి చూచీ ఆశ నిరాశ చేసుకొని భోంచేయడానికి ఉపక్రమించాడు. అతడు రెండు ముద్దలు నోట్లో వేసుకొని మూడో కబళాన్ని ఎత్తుకోబోతుండగా తలుపువద్ద ఒక మెరుపు మెరిసినట్టయింది. సంభ్రమంతో ఆవైపుకు దూపు మళ్లించాడు నారాయణ!

ఈ విశాల ప్రపంచంలో ఎందరో అందగత్తెల్ని చూచిన నారాయణ, వాళ్లందరూ ఈ పెళ్లికూతురు ముందు బలాదూర్ అనుకున్నాడు. ఆమె కొరుముబ్బుల్లో తటాలున పుట్టి, నిటారున పైకి ప్రాకి, హఠాత్తుగా మాయమయ్యే విద్యుల్లతలా దగ్గరికి వచ్చి నేయి అభిఘరించి లోపలికి వెళ్లిపోయింది. ఆమె రాకపోకలు నారాయణకు స్వప్న ప్రపంచంలో జరిగిన మహాద్భుత సంఘటనల్లా గోచరించాయ్. అతడు తింటున్న అన్నాన్నే గాక ప్రపంచంలో తను ఉంటున్న విషయం కూడా మరచిపోయి రెండు మూడు క్షణాలపాటు ఆమె వెళ్లినవైపే చూస్తూ వుండిపోయాడు.

ఉన్నట్టుండి తామొక నిర్ణయానికి రావడానికి వీల్లేదనీ, అందరితో సంప్రదించి వారం రోజుల్లో ఉత్తరం వ్రాస్తాననీ చెప్పి కృష్ణవేణి తండ్రి పరమానందాన్నీ నారాయణనీ బస్సెక్కించాడు. శరవేగంతో పోతున్న బస్సులో కూచొని నారాయణ అంతకంటే వేగంగా గాలిమేడలు కట్టసాగాడు. సంగం ప్రయాణమైపోయిన తర్వాత పరమానందం "ఏం నారాయణా! తీవ్రంగా ఆలోచిస్తున్నావ్" అన్నాడు. "ఏమీ లేదు పరమానందం! పెద్దవాళ్ళు ఉండి ఉండీ ఒక్కొక్క మాట చెబుతుంటారు. వాళ్ళు చెప్పేటప్పుడు మనం వినీ వినకుండా వెళ్లిపోతుంటాం. వాళ్ల మాటల్లో ఎంత సత్యముందో తెలుసుకోలేని అవివేకులం మనం" అన్నాడు నారాయణ. ఈ ఉపోద్ఘాత మెందుకో తెలియక పరమానందం "ఇంతకూ అసలు సంగతేమిటయ్యా?" అన్నాడు. నారాయణ తన తండ్రి తెల్లవారుఝామున వచ్చేకలతప్పక నిజమౌందనే వాడనినీ, అప్పుడతని మాటల్లో తనకు నమ్మకముండేది కాదనీ, ఈనాటికి తనకు తన తండ్రిమాట ఎంత వాస్తవమైందో తెలిసిందనీచెప్పి, తన స్వప్నవృత్తాంతాన్ని వివరించి "ఆహా, ఎంత ఆశ్చర్యం పరమానందం! ఆ కలలో కనపడిన అమ్మాయే ఇక్కడ కనపడ గలదని నేను కలలోకూడా అనుకోలేదు సుమా!" అంటూ ముగించాడు.

సినిమాల్లో నాయికా నాయకుల విరహవేదనలో వివిధఘట్టాల్ని చూచి పంతసించిన నారాయణ ఆ అవస్థలన్నిటినీ తనకు ఆరోపించుకొని ఆ వారంరోజులు చాలా బాధపడి, ఎనిమిదోరోజు తెల్లవారేసరికి పరమానందం ఇంటికివెళ్లాడు. పరమానందంభార్య "ఆయన ఊళ్లోలేరండీ" అన్నది. నారాయణ "ఎక్కడికివెళ్ళాడ"ని ప్రశ్నించాడు. ఆమె "సారిగింటి రామనాథాన్ని పిలుచుకుని వలిపిడుకు వెళ్లారు" అన్నది. నారాయణ నిర్ఘాంతపోయి "సారుగింటి రామనాథాన్నెందుకు పిలుచుకపోయాడు?" అని అడిగాడు. "పెళ్లిచూపులకోసం పిలుచుకపోయారండీ" అన్నదామె నెమ్మదిగా!

నారాయణతలపైన పిడుగు పడ్డట్లయింది. ఈ ఘోరవార్త విన్న తర్వాత తనకే క్షణానైనా జీవితంపైన విరక్తి పుట్టిపోవడానికి వీలేడంత అవకాశముందనీ, తనదురదృష్టం కొద్దీ ఆ విరక్తి కాస్తా పుట్టుకొచ్చినప్పుడే ఎదురుగుండా కారో, బస్సోవస్తే దానికింద పడి తనకుతానే తన నిండుప్రాణాల్ని తుదముట్టించుకునే దురవస్థ ఏర్పడవచ్చుననీ, ఆలోచించి నారాయణ రోడ్డునబడి ఇంటికి వెళ్లకుండా దగ్గరున్న పార్కులోకి వెళ్ళి ఒక సిమెంటు బెంచీపైన కూలబడ్డాడు. తర్వాత అతనికేం చేయడానికి పాలుపోలేదు. గొంతెత్తి ఏడ్చుకొందామంటే, అది తగిన చోటు కాకపోగా! ఆటికొద్దీ ఎవరిసైనా తిట్టుకొందామంటే. ఎవరైనా విని ఏదెవడో పిచ్చివాడని అపహాస్యం చేస్తారని జంకు! ఏ పరిచితునితో నైనా



తన గోడు చెప్పుకోండా మంటే, అవమానం! ఈ పరిస్థితిలో నారాయణ మధ్యాహ్నం పన్నెండుగంటలవరకూ ఆ సిమెంటు బెంచీపైనే పడుకొనివుండి, ఆ తర్వాత ఒక అద్భుతమైన ఊహ, అమూల్యమూ, అమోఘము, అద్వితీయమూ ఐన ఊహ ఒకటి స్ఫురించగా తటాలున లేచి కూచున్నాడు.

నారాయణకు చిన్నప్పటినుంచీ ఒక హాబీవుంది. అదేమంటే ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాయడం! ఆలాటి ఉత్తరాలు వ్రాయడంలో అతడు డిటెక్టివు నవల్లో దొంగల నాయకులవలె మహామేధావి. ఐతే ఇంతవరకూ అతడు సాధకంచేసిన ఈ విద్య వల్ల అతనికి అణుమాత్రమైనా లాభంకలిగింది కాదు. ఈనాటికి ఈ విద్య తనకు రామబాణంలా ఉపకరించగలదనుకొని నారాయణ జేబీలోనుంచీ కాగితమూ, కలమూ తీసుకొని తక్షణం జాబువ్రాయడానికి ఉపక్రమించాడు.

"శ్రీ రామనాథంగారికి

కేవలం-ఒక తెలిసినవాడు ఇది మంచి, ఇది నొప్పి అని తెలియజెప్పక పోవడంవల్ల మీబోటి అమాయకుడొకడు సర్వనాశనమై పోతుంటే, చూస్తూ ఊరుకోలేని స్వభావం నాది! అందుచేతనే నేనీ జాబువ్రాస్తున్నట్టు మీరు గుర్తించాలి.

ఇటీవల మీరు పెళ్లిపీడుకు వెళ్ళినట్టు తెలిసింది, వధువును చూచి రావడానికి. చూచివుంటా రామెను! ఇంతటితో ఆ సంబంధాన్ని గురించి మరిచిపోండి. లేకపోతే మీరు యావజ్జీవం నామాట వినసందుకు పశ్చాత్తాపపడవలసి వుంటుంది.

తల్లిని చూచి పిల్లను పెళ్లి చేసుకోవాలన్నారు పెద్దలు! ఆ తల్లి సంగతి మీకు తెలియ దనుకుంటున్నాను. తెలిసివుంటే మీరా వూరు దరిదాపులకైనా పోయివుండేరు. ఆమె నోరుంటే, దానికి లౌడ్ స్పీకరే సాటి! ఆమెను చూస్తే ఆ వూరిలోని ఆబాలగోపాలానికి సుంకెల్లో జ్వరం! అంత గయ్యాళి!!

ఇక ఆమె కుమార్తెను గురించిన యథార్థాలను గనుక నేను చెప్పబోతే మీకు నా మాటలు నచ్చవని నాకు తెలుసు. కానీ కన్నెం చేయమంటారు! నేను వ్రాయడానికి గానీ, మీరు చదువుకోవడానికి గానీ తగిన విషయాలు కావవి!! ఇంతే నేను చెప్పగలను. తరవాత మీ ఇష్టం.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి.

ఇంకో మాట: నేను వ్రాసిన విషయాలు ఆ ఇద్దరు తల్లీ కూతుళ్లకే గాక ఆ వూరిలోని యావన్మంది స్త్రీలకూ వర్తించగలవని మీరు గుర్తించినట్టయితే మరీమంచిది."

మరునాడు నారాయణ ఐదు రూపాయలు ఖర్చు పెట్టుకొని ముప్పై మైళ్ళ దూరంలో వున్న ఒక ఊరికి వెళ్లి తను వ్రాసిన జాబును పోస్టుచేసి తిరిగివచ్చాడు.

నెలరోజులు గడచినతర్వాత అతనికి పెళ్లివీడునుంచీ ఒక జాబు వచ్చింది. అందులో తమ నిర్ణయాన్ని తెలపడానికింత ఆలస్యం

(56 వ పేజీ చూడండి)

ఒక సాయంత్రం

[నా మాట:— రాయలసీమ ప్రజలు మాటాడే తెలుగు భాషకూ కోస్తా ప్రాంత ప్రజలు మాటాడే తెలుగు భాషకూ తేడావుందని సామాన్యంగా అందరకూ తెలిసేవుంటుంది. ఈ తేడా చూపడమే నా ఉద్దేశం. ఇందులో పాత్రలు కల్పితాలే నని మనవి.]

వెలుదుర్తి గ్రామం, ద్రోణాచలం—కర్నూలు లైనులో, ద్రోణాచలానికి పన్నెండుమైళ్ళ దూరంలోనూ, కర్నూలికి ఇరవైమైళ్ళ దూరంలోనూ ఉన్నది. అటు పట్టణమూ, ఇటు పల్లెటూరూ కాక, మధ్య రకంగా ఉండే గ్రామం, వెలుదుర్తి.

సాయంత్రం కావస్తున్నది. పక్షుల మధుర కిలకిలారావం వినిపించటం లేదు కాని, కాకుల 'కావ్, కావ్' మనే గోలమాత్రం వినవస్తున్నది. మనుషులకీ, మానులకీ తమ ఒంటిబురద రాసుకుంటూ ఇళ్ళకు వచ్చే గేదెలకు బడితె పూజ జరుగుతున్నది. పశ్చిమాన ఉప్పరం ఆకాశబాధుని అజ్ఞచే రమ్య రాగవర్ణాన్ని ధరించలేదుగాని, భూమిని వదలలేక వెళ్ళిపోయే సూర్యుని బాధవలె పడమట ఆకాశం రక్తవర్ణాన్ని దాల్చింది. టూరింగ్ సినిమా తాలూకు ప్రకటన బళ్ళు అఖరుసారి ఊళ్ళో తిరిగి వస్తున్నాయి. అక్కడక్కడా బజారులో పిల్లలు, "బొచ్చెగుడిశో" అటో, "ఉప్పరిపట్టె" ఆటో ఆడుకుంటున్నారు. చెడిన పల్లెల సౌభాగ్యానికి చక్కని 'స్పెసిమెన్' — వెలుదుర్తి.

సుంకిరెడ్డి విసవిసా నడుచుకుంటూ 'దస్తుమియ్యా కట్ట' దగ్గరకు వస్తున్నాడు. అతని కోసం మిత్రులు అక్కడ కాచుకొని వున్నారు. రోజు సాయంత్రం వారు ముగ్గురూ అక్కడే కలిసికుంటారు. కాని, అక్కడ తన మిత్రులు గురుపాదు, యల్లారెడ్డిగారలతో ఇంకో కొత్తమనిషికూడా కూర్చున్నాడు. ఎవరైవుంటారు చెప్మాఅని ఆలోచించుకుంటూ కట్టదగ్గరకు వచ్చాడు.

బాగా దగ్గరకు వచ్చాక కాని, ఆ మనిషిని పోల్చుకోలేకపోయాడు. "అరె! ఏందిపై, రామారావ్? ఎన్నడొస్తివి?" అంటూ విస్మయంతో ప్రశ్నించాడు సుంకిరెడ్డి.

జవాబివినడంకోసం, రామారావు వైపుకే మొహాంతిప్పారు యల్లారెడ్డీ, గురుపాదూ.

'సాయంత్రం నాలుగ్గంటల ట్రైనులో వచ్చానోయ్' న్యూస్ పేపరు ఒక చేత్తో పట్టుకొని, ఇంకో చేతిని నెమ్మదిగా తట్టుకుంటూ జవాబిచ్చాడు రామారావ్.

'ఏందబ్బా? గోత్తేపట్టకుండా అయిపోతివే! కర్రెగయిండావ్, శానా చిక్కిపోతివి. నే నస్సలు గొత్తుపట్టలేదంటే! ఎవురబ్బా అనుకొంటి. ఏం అట్లయిండవ్?' ఇంకా ఆశ్చర్యపోతూ, గుక్క తిప్పుకోకుండా సుంకిరెడ్డి మాటాడాడు.

'అబ్బే! ఏఁ లేదూ.' అన్నాడు రామారావు జేబు రుమాలుతో మొహం తుడుచుకుంటూ. కాసేపు సంభాషణ ఈ ధోరణిలో నడిచాక, సుంకిరెడ్డి అడిగాడు: "యాడ వుండేది,నువ్విప్పుడూ?' బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ రామారావు జవాబిచ్చాడు: 'విశాఖపట్టణంలో.'

"పన్నీరజ"

'ఏం కండ్లు ఎర్రగుండాయ్?' అని రామారావుని జాగ్రత్తగా పరిశీలించిన మీదట, గురుపాదు అడిగాడు.

'రాత్రంతా ప్రయాణమేగా! రష్‌లో నిద్రపట్టలేదు.' అన్నాడు రామారావ్, ఆవులిస్తూ. సుంకిరెడ్డి ఇంతసేపూ నించొనే ఉన్నాడు. 'కూర్చో! నించొనే వున్నావ్!' అన్నాడు రామారావు.

'ఈడేంటికిలే! వంకలేకి పోదాం' అన్నాడు సుంకిరెడ్డి.

'పాండి పోదాం' అంటూ, యల్లారెడ్డీ, గురుపాదూ లేచారు.

అందరూ నడిచి వెలుదుర్తి ప్రక్కగా ఉండే వాగులోకి వచ్చారు. వర్షాకాలంలో తప్పిస్తే అందులో నీరుండదు. కాని, ఆ ఇసుకలో చెలిమెలు త్రవ్వితే మంచినీరు పడుతుంది. వెలుదుర్తి గ్రామాని కంతటికీ మంచినీళ్ళకు ఆ చెలిమెలే ఆధారం.

'ఈడేడ కుచ్చుంటవ్? గరండాల కిందికి పోదాం' అన్నాడు సుంకిరెడ్డి. అక్కడ కూర్చోబోతున్న గురుపాదును చూస్తూ.

అందరూ వంతెన క్రిందికి వచ్చి కూర్చున్నారు.

అందరికంటే ఆఖరున కూర్చున్నది రామారావు. కూర్చున్న వెంటనే సర్రున లేచి నిలబడ్డాడు.

'ఏం, నిలబడ్తివి?' సుంకిరెడ్డి అడిగాడు.

'అబ్బ! ఇసక కాలిపోవటం లేదూ?'

'అవ్ కాల్తుంది! ఎట్లోకట్ల కూచోచ్చ' మన్నాడు గురుపాదు.

పేపరు పరుచుకుని కూర్చోబోతున్న రామారావుని ఆపి,సుంకిరెడ్డి 'పేపరిట్లియ్యి' మని అడిగాడు.

చేతిరుమాలు పరుచుకొని ఇసుకలో కూర్చున్న రామారావుని యల్లారెడ్డి ప్రశ్నించాడు:' నువ్వుండేఊర్లో, శానా చల్లగుంటాదా?'

క్లుప్తంగా 'ఊఁ!' అన్నాడు రామారావు.

'కర్నూలుకాడికి శానా పెద్దదా?'

'ఊఁ! పెద్దదే!'

పేపరు మొహాని కడ్డం పెట్టుకొని కూర్చున్న సుంకిరెడ్డి, పేపరు వెనకనుంచే అన్నాడు: "పెద్దగుంటే గూడ ఏం ఫలముండాది? కర్నూలు రాజధానైవుంటే."

ఈమాటల్ని తనమీద ప్రయోగించినట్లుగా ఫీలయ్యాడు రామారావు. రాజధాని నిర్ణయం న్యాయప్రకారం జరిగిందేమిటిలే అనుకున్నాడు; అదే పైకికూడా అన్నాడు.

గురుపాదు అన్నాడు: 'రాజధానొస్తే ఏందుండదిలే? యావూరి గొప్ప ఆవూరికుంటది.' ఈమాటల్ని గురుపాదు ఏ ఉద్దేశ్యంతో అన్నాడో తెలియదు. కాని, వీళ్ళమాటలు పెరుగుతాయనీ, వాగ్యుద్ధం ప్రారంభమౌతుందనీ తెలుసుకొని, వాదన తప్పించటానికే ఈమాట లనిఉంటా డనుకుంటాను.

అయినా, రామారావు ఊరుకోలేదు: 'ఏ ఊరుగొప్ప ఆ ఊరుకు ఉంటుం దన్నమాట వేరు. కాని, రాజధానిమాత్రం మిగిలిన ఊళ్ళకంటే గొప్పదై వుండాలికదా? కర్నూల్లాంటి ఊళ్ళల్లో రాజధాని పెట్టి డబ్బు వేస్ట్ చేసేకంటే—'

మధ్యలో ఆ పాడు సుంకిరెడ్డి: 'డబ్బు వింటికి వేస్ట్ చేయాలో చెప్పవయ్?'

'మరి బిల్డింగులు కట్టడానికి డబ్బు కావద్దుటోయ్? కర్నూల్లో కావలసినన్ని బిల్డింగు లెక్కడున్నాయి?'

'ఏందివై అట్లంటావ్? డిస్ట్రిక్ట్‌బోర్డ్ ఆఫీస్ లేదా, ఉస్మానియా కాలేజీ లైబ్రరీ లేదా, ఇంకా—'

"రేపు శ్రావణ శుక్రవారమండీ. ఆఫీసుకు సెలవు మంజూరు చేయిస్తారా?" అని హెడ్‌క్లార్కు మనవిచేసుకోగా కలెక్టరుగారు "ఆపండక్కు పోయిన సంవత్సరం - సెలవిచ్చారా?" అని ప్రశ్నించారు.

కొంత సేపు తటపటాయించి హెడ్ క్లార్కు "ఇచ్చి వుండేవాళ్లేనండి. కాని ఆపండగ పోయిన సంవత్సరం ఆదివారం నాడు వచ్చింది" అనగా కలెక్టరుగారు "అలాగా" అని తలవూచి సెలవు మంజూరు చేశారు.

యం. ఆర్. చిత్తూరు.

'ఊఁ! ఇంక? ' కొంచెం పౌరుషంగానే అడిగాడు రామారావు.

యల్లారెడ్డి కూడా ఇంకో ఏమి ఫలితాలున్నాయో అని ఎదురుచూస్తున్నట్టు చూస్తున్నాడు.

... పూర్వకంగా ...

'ఎంగా ... టాయం తే....'

'ఊఁ! ... గాడ్నే ..., ... కొండారెడ్డి ... ఇవన్నీ ...! ' ... అన్నాడు రామారావు.

యల్లారెడ్డికీ, సుంకిరెడ్డికీ కోపమొచ్చింది. వాళ్లి మాటాడలేదు. ... ఇసకలో ఏవో గీతలు గీస్తున్నారు.

'... ఎలా ...' ... రామారావు ...

యల్లారెడ్డి ఏదో మాటాడబోయాడు, కాని, మళ్ళీ రామారావే మాటాడాడు: 'కర్నూల్లో రాజధాని పెట్టడం, కర్నూలు ప్రజలకే ఇష్టంలేదు.' ఎక్కడిదో గడిచిన వాక్యాల్ని ... చెప్పాడు.

'అపద్దం' అనేసాడు ఉద్రేకంగా ... సుంకిరెడ్డి.

'ఏం అబద్దం? ... కర్నూలు ...' ... రామారావన్నాడు.

... కొంచెం తమాయించుకొని సుంకిరెడ్డి చెప్పాడు: 'అపద్దం వయ్! అపద్దం. మంచిని తీసకొచ్చి యిస్తుంటే ఎవురన్నా వొద్దనేరా?' కాస్సేపాగి అన్నాడు. 'ఉండేవోళ్లం, మాకు తెలుస్తాది. కర్నూల్లో సీవుగాయి మాటేంటి. పెట్టి ఈమాట చెప్పమల్ల, ఏమైతాదో!'

ఇంక ఇలాగ మాటలు పెరగటం రామారావుకే నచ్చలేదు. 'ఊఁ! పోన్లే. గ్రాంపెడ పాయంట్" అన్నాడు. కాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

'వారఫలాల' కాలమ్ని చూస్తూ యల్లారెడ్డి 'నీది యేనక్షత్రం వయ్?' అని అడిగాడు, సుంకిరెడ్డిని.

'ఏందీ? ఏమంటివి?' పరధ్యానంగా ఉన్న సుంకిరెడ్డి అడిగాడు.

తన ప్రశ్నను మళ్ళీ అడిగాడు యల్లారెడ్డి.

'వృశ్చికరాశి' చెప్పాడు సుంకిరెడ్డి. 'నక్షత్రం గొత్తులేదు.'

వృశ్చికరాశి ఫలితాలు చదివాడు యల్లారెడ్డి: 'వారం మొదట్లో ఆరోగ్యం అంత బాగుండదు. వ్యాపార, ఉద్యోగాలలో అట్టే అభివృద్ధి ఉండదు. జరగవలసిన కొన్ని - ఏండి - కార్యములు శత్రువుల మూలంగా జరగవు. కాని, మిత్రులలో గౌరవం, హోదా పెరుగుతుంది. వారం మొదట్లో విషజంతువులవలన ప్రమాదం కలగావచ్చును. అవి 7,9 తేదీలలో అనారోగ్యం; త్రిప్పట; ఐంబాధ ... దుర్వార్తలు.'

చదివాక అన్నాడు యల్లారెడ్డి: 'ఏందీ! విషజంతువులవలన ప్రమాదముంది!'

ప్రక్కమీద సిగ్నలు ... తంగింది.

'నాకు వారఫలాల్లో అస్సలు నమ్మకం లేదు.' అన్నాడు రామారావు. 'పదండి పోదాం. చీకటి పడుతుంది.'

ఉదయం లేవగానే యల్లారెడ్డి, గుడిసె ముందు కూర్చున్న సుంకిరెడ్డిని చూసి ఆశ్చర్యపోయాడు. ఎక్కువ పరిచయం గల ప్రాణస్నేహితుడు కాదు కాబట్టి సుంకిరెడ్డి కోసం రామారావు దుఃఖించలేదు. కాని, సుంకిరెడ్డి పట్ల వారఫలాలు ఇంత నిజమవుతాయనికూడా కాదు అతడు ఆశ్చర్యపడ్డది; నిన్న సాయంత్రానికి, సుంకిరెడ్డి జీవితానికి సాయంత్రం నిండిందా అని మాత్రమే ఆశ్చర్యపడ్డాడు.

పోతే, రామారావు వారఫలాల్ని నమ్ముతాడు; నమ్మలేడు. కాని ఒక్క సంగతి మాత్రం అతనికి తెలుసు: రాజకీయాలూ, ఉద్యమాలూ, నమ్మకాలూ, అన్నీ - జీవితానికి సంక్రమించినప్పుడే ప్రాణంతో పాటే పరిస్తాయని. ★

చిరిగిన బట్టలు, నలగని దుస్తులు

మధు చాల హడావుడిగా ఉన్నాడు. అతనికి చిరాకు హెచ్చయిపోతూంది. తొమ్మిదిన్నరయింది; ఇంకా బట్టలు వేసుకోవడం కాలేదు. ఆనాడు ఏబట్టలు తొడుక్కోవాలో అతనికో పట్టాన తోచలేదు. పెట్టెలోని బట్టలన్నీ కెలికివేశాడు. ప్రక్కనే కూర్చున్న స్నేహితుణ్ణి సలహా అడగటం - అతను చెప్పిన జత నచ్చకపోవడం; మరి తనకు తోచింది కూడా తన హృదయంలో ఎవ్వరో త్రోసిపుచ్చడం - ఇదంతా చూస్తూవుంటే మధుకు పిచ్చెక్కినట్లుగా ఉంది. అతను జన్మలో ఇలాంటి ఇబ్బంది పడలేదు. కాని ఏదైతే తనకు మొదట నచ్చలేదనుకున్నాడో, దాన్నే అదేమిటో గాని, పాపం చివరికి ఉపయోగించాలని ఉపక్రమించాడు.

అప్పుడే బయటనుంచి, 'బాబూ' అని ఓ బిచ్చగాడు దీనంగా చెయ్యి చాచాడు.

మధు అటు చూడకుండానే మవ్వ పీడిగోడవేమిటని లోలోన గొణుక్కుంటూ, 'వెళ్ళు వెళ్ళు' అన్నాడు.

ఆ బిచ్చగాడు తిరిగి, 'ఒక్క కానీ ఎయ్యండి' బాబూ అన్నాడు.

మధు బనియను వేసుకుంటూ, 'కానీ లేదు గీనీ లేదు వెళ్ళు' అని, ఆపదాలు నొక్కుతూ, అందుకు తగ్గట్టుగా చేయి ఆడించాడు ఎంతో విసుగుదలతో. అతని దృష్టి అంతా ఆ బట్టలు నలగకుండా ఎట్లా తొడుక్కోవాలో అన్న విషయంపై కేంద్రీకరించబడి ఎంతో పనితనాన్ని ప్రదర్శించుకుంటూంది. ఈ కష్టాన్ని గుర్తించలేని ముష్టివాడు 'పిల్లలతో మలమల మాడిపోతున్నాం బాబూ'అన్నాడు.

మధుకు కోపంతో కవిత్వం కూడా తన్నుకొచ్చింది. అతను, 'ఇక్కడ మేమేమీ కిలకిల కులుకుతూ, కూర్చోడం లేదు. దయచెయ్యి.' అన్నాడు. అలా అని తను చెప్పినదాంట్లో ఏదో నవ్వుకోవడానికి వీలైన విషయం ఉందని అనుకున్నాడో ఏమో, స్నేహితుని వైపుచూసి తన కళ్ళల్లో కాస్త చిరునవ్వు మెరిపించాడు. అప్పటికా స్నేహితుడు ఏవో ఊహల్లో మునిగినవాడై, మధు వైపు ఓపిచ్చి చూపు ప్రసరించి ఊరుకున్నాడు. మధు కాస్త నిరుత్సాహపడ్డాడు. కాని దుస్తులు ధరించడం విషయంలో మాత్రం కించిత్తూ అజాగ్రత్తపడలేదు. బిచ్చగాడు అంతటితో మధును వదలి వెళ్ళనూలేదు. వాడు చాలపొడవుగా ఉన్నాడు. కాళ్ళు ఎంతో నిడివిగా ఉన్నాయి. చేతిలో పొట్టికర్ర, నడుం కొద్దిగా వంగి ఉంది. నెత్తిమీద ఓ పాతిక అంగుళం ఎత్తున తెల్లని జుత్తు ఉంది. గడ్డం అంతకు తక్కువగానే ఉంది గాని అది అక్కడక్కడ అసంపూర్తిగా మొలచి

శ్రీ పంధి [illegible]రాజు

ముగం చాల వికారంగా ఉంది. మొత్తం మీద అతని ముగం రైలుగట్టు కిరుప్రక్కలా నిప్పురవ్వలు పడి అక్కడ ఉన్న గడ్డి కొద్ది కొద్దిగా తగులబడి కొంచెం పచ్చగా కొంచెం నల్లగా కాలి ఆరిన చేనులా ఉన్నట్టు వికృతంగా ఉంది. వాని కళ్ళు లోతుకు దించుకొనిపోయి గాజుకన్నులు రెండు అక్కడ అతికించినట్టుగా న్నాయి. వానిముందు ఒక చిన్న కుర్రాడు వాని రెండవ చేతిని పుచ్చుకొని నిలచి ఉన్నాడు. వాని వెనుక ఒక పెద్ద కుర్రవాడు తండ్రిపై మీద ఉన్న నల్లని చింకి మురికిగుడ్డను ఒక చేత్తో పుచ్చుకొని రెండవ చేతిలో భిక్షాపాత్ర నుంచుకొని ఎటో చూస్తున్నాడు. ముందున్న పసివాని జుట్టు రాగిబొచ్చువలె ఉంది. వాడి బుగ్గలమీద ఏడుపు కన్నీళ్ళ మరకలున్నాయి. వాడి కొక గోచీ ఉంది. వాడి ఒళ్ళంతా దుమ్ముకొట్టుకొని ఉంది. వెనుకనున్న వాని నెత్తిమీద పుట్టెడు తల ఉంది. అది అట్టలుకట్టి ఉంది. వాడు చినిగిపోయిన పెద్ద మిలటరీ చొక్కా తొడుక్కొని ఉన్నాడు.

బిచ్చగాడు, 'ఒక్క కానీ ఇప్పించండి బాబూ...దరమ పెబువులు' అన్నాడు.

మధుకు ఎక్కడలేని కోపము విసురుగా వచ్చింది. అట్లా రావడానికి కారణం వాడి పేంటు ఒకచోట కొద్దిగా మడతబడింది.

'నీకు కాదురా...వెళ్ళమంటూంటే...' అని ఒక్క అరుపు అరచి మధు, 'వెధవ... ఇందాకటినుంచి చెప్తున్నా కదలడు చూడు' అని స్నేహితునివైపు చూశాడు. ఈ మాట విన్న ఆ మిత్రుడు ఓ నవ్వునవ్వి ఊరుకున్నాడు. ఈ నవ్వులో ఏమున్నదో మరి అది ఏ అర్థాన్ని మధుకు అందించినదో కాని, మధు విసురుగా, 'వెళ్లు. ఇక్కడి నుంచి' అని విపరీతంగా గద్దించాడా బిచ్చగాణ్ణి. బిచ్చగాడు అంతటితో వెనుకంజ వేయలేదు. ఇంకా అతడాశ విడనాడలేదు. ప్రభువులు వాడ్ని వదలించుకోవడానికి విసిగిపారేసిన కానీ అయినా ఆ కానీలో విసుగుద లేముంటుంది? సరిగదా అది హాయిగా మారుతుంది. అంచేత అతను కోపగించి పారేసినా పది తిట్టి పారేసినా ఎలా చేసినా మరేం ఫరవాలేదు. ఎలా పారేసినా కానీ కానీయే!

అందుకనే బిచ్చగాడు, 'కొత్త కనికరించండి బాబూ' అన్నాడు చాల జాలిగా. ఇహ మధు కోపాన్ని ఆపుకోలేకపోయాడు. 'ఒకసారి చెప్తే చాలదు రా...ఫో... ఇక్కడనుంచి...ఊ వెళ్ళు...' అన్నాడు కళ్లెర్రజేసి, బిచ్చగానివైపు తేరి పారజూసి. బిచ్చగాడు, 'బాబూ ఒక కానీ ఇయ్యి బాబూ...పిల్లలతో...' అని ఇంకా ఏదో అనబోతూవుంటే — 'వెధవా ... నీకు కాదురా చెప్పేది.' అని మధు ఆకసం ఊడిపడేట్టుగా అరిచాడు. ఇహ బిచ్చగాడు మరి లాభం లేదనుకొని అక్కడనుంచి కదలిపోతూ, 'ఈ బాబేమి ఏత్తాడు లేరా...పద పద... ఈ ఏసాల బాబులికి రోసాలు జాత్తి' అన్నాడు. అన్న తరువాత ఇంకా ఏదో తిడుతూన్నట్టుగానే వినిపించింది మధుకి. మధుకి బిచ్చగాని వెనకాలే వెళ్ళి వాణ్ణి పడతన్నాలనిపించింది. కాని అతణ్ణి ఏ సభ్యతా శక్తి ఆపిందో తెలియదు; మిత్రుని వైపు చూసి, "చూశావా వాడెలా తిడుతున్నాడో... పెడితే పెళ్ళి పెట్టకపోతే చావూ కోరుతా రీ వెధవలు...అడిగినవా

ళ్ళందరికీ మనం ఎక్కడనుంచి తెచ్చి ఇయ్యగలం? ఇవ్వకపోతే వీళ్ళ తిట్లు పడాలన్నమాట! నీచపు వెధవ. ఎంతలో దిగజారి పోయాడు!" అని తల దువ్వుకొనడం మరొకసారి పూర్తిచేసి అద్దంలో ఇంకొకసారి ముస్తాబునంతా సరిచూసుకొని, 'పదరా పోదాం... టైమయిపోయింది. ఈ పాటికే ఆ కమీషనరు వచ్చేస్తా డనుకుంటాను. ఆ అ. ఎంతదూరంలే. సైకిళ్ళ మీద పోతాంగా.' అంటూ సైకిలుమీద అతిజాగ్రత్తగా కూర్చుని సున్నితంగా దాన్ని తొక్కుతూ, మధు స్నేహితునితో బయలుదేరాడు. త్రోవలో మధు మిత్రునితో 'ఆ కమీషనరు ఓ పట్టాన ఇస్తానన్నా డనుకున్నా వేమిటి? ఎన్ని రికమండేషన్లు చేయించవలసి వచ్చింది! మొత్తంమీద ఒప్పుకున్నా డనుకో. ఇంక ఇవ్వాల్టితో మన నిరుద్యోగం పీడ మన నుంచి దొడు తియ్యవలసిందే! ఇంక మా నాన్న గొడవ సన్నగిల్ల కేమౌతుంది? అప్పుడే మొన్న మా నాన్న ఏమన్నాడో తెలుసా? ఎవరో ఈ ఉద్యోగం సంగతి తెలిసి పిల్లనిస్తామని అప్పుడే దగ్గఱకు చేరారట. నేను 'ఊఁ' అంటే ఆ గుదిబండ మనకు తగిలించేసేవారే. నేనుమాత్రం అందు కొప్పుకోలేదు. అసలు మనం ఒక సంవత్సరంపాటైనా ఈ ఉద్యోగం మజా అనుభవించకపోతే ఎలారా...ఏమంటావ్? వెనక ఆ కిళ్ళీ కొట్టుగాడి కెంత పాగనో.. జీతం రాగానే వాడి బాకీ తీర్చేసి, కొత్తా ఇంకొకడి దగ్గఱకు మార్చెయ్యాలి.

ఈ ఉద్యోగంవచ్చిందని తెలియనేగా వాడిక ఈబాకీ అడగటం మానేస్తా డనుకుంటాను. అయినా సరే వాడిదగ్గఱ ఇక ఏమీ కొనగూడదు. మొన్న పదిమందిలో ఎంత ఖచ్చితంగా నిలేసి అడిగాడు! ఆ మాత్రం తీర్చకుండా ఎగేస్తామనుకున్నాడు కాబోలు!

ఇంతలో మునిసిపల్ ఆఫీసు వచ్చేసింది. స్నేహితులిద్దరూ సైకిళ్లు దిగారు. మధు కమీషనరుగారి గదివైపు నడకసాగించాడు. స్నేహితుడు బైటసైకిళ్లవద్ద నిలచి ఎటో చూస్తున్నాడు.

కమీషనరుగారి గదివైపు వస్తూన్న మధుని, విలువైన అందాలదుస్తులలో మెరసిపోతూన్న మధుని బంట్రోతు నాగయ్య ఆపు పెట్టలేక పోయాడు. మధు అతనివైపు చూడకుండానే తిన్నగా కమీషనరుగారి గదిలో ప్రవేశించాడు. మధు ఆగదిలో అడుగుపెడుతూనే 'గుడ్‌మార్నింగ్ సర్' అన్నాడు. కమీషనరు మధు మొగం చూడగానే మొగం చిట్లించి, ఎవరు మీరన్నట్లు చూశాడు. మధు, '[illegible] పంపించారండి...మీతో చెప్పారట కదండీ' అంటూ చేతిలోని అప్లికేషను ఇచ్చాడు. కమీషనరుగారు 'సారీ... ఆపోస్టులో ఇప్పుడే ఒకర్ని నియమించడమైంది. మళ్ళీ ఖాళీలు వచ్చినప్పుడు పిలుస్తా లెండి' అన్నాడు.

ఈమాటతో మధు మొగం ఒక్కసారిగా పాలిపోయింది. అతని కేమి మాట్లాడాలో తోచలేదు. కాని, 'మీరు కొంచెం అనుగ్రహించాలండి...చాలా పేదవాణ్ణి. మీరు దయచూడకపోతే...' అన్నాడు. కమీషనరుగారు విసుగుతో, 'ఇక్కడి పరిస్థితులు మీకు అర్థం కావు. ఇక మీరు వెళ్ళండి' అన్నాడు. మధు కాళ్లు విపరీతంగా వణికిపోతున్నాయి. అతని గుండె విపరీతంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. అతను, 'నేను చాల పేదవాణ్ణండీ...మీరు......

(39-వ పేజీ చూడండి)



"అబ్బే ఏమీ లేదు చిరిగిన బట్టలకు, నలగని దుస్తులకు తేడా ఏమిటా అని ఆలోచిస్తున్నాను." అన్నాడు.

ఎవరి పెళ్ళి?

'ఏమండీ వాడుళీ?'

సుబ్బమ్మగారు చేతిలో కాఫీగ్లాసు పట్టుకునివచ్చి భర్త నడిగింది. ఏవో లెక్కల్లో మునిగి తేలుతున్న రామమూర్తి పంతులుగారు యిటు తిరిగి కాస్త చికాకుగా అడిగారు:

'ఎవరే?'

'ఇంకొకరి సంగతీ యింకొకరి సంగతీ ఎందుకు చెప్తాను? వాడే ఆ భాస్కరం గాడే! సిరి అబ్బకపోయినా చీడ అంటిందని...'

'అబ్బబ్బ! నోరు విప్పితే సామెతలు. ఈ సామెతలు లేకుండా నువ్వు మాట్లాడలేవు కేం? ఇలాగే సందర్భంగానో అసందర్భంగానో ఏదో ఒకటి అంటూంటావు. వాడికి కోప మొస్తూంటుంది. ఇప్పుడూ అంతే అయ్యుంటుంది. అంతేనా?'

'సరే అంతా మీకు తెలిస్తే, నే చెప్పే దేముంది? వస్తా, చేతిలో పనుంది.'

'ఓస్-ఎంతలో ఎంత కోపమే! నీకున్న రాచకార్యాలు నాకు తెలుసు గాని సంగతేమిటో చెబుదూ.'

'అవునండీ, మీకంతా హాస్యంగా ఉంది. 'మనవాడు కదా అని మహరాజుతో చెబితే మరి రెండు తగల్నియ్యమన్నాడట' అయినా నాబుద్ధితక్కువగాని నేను మీతో చెప్పడమేమిటి? ఆ కొడుక్కి తండ్రికాదు మీరూ?'

'అబ్బబ్బ, ఏమిటో చెప్పవే!'

'ఏం లేదండీ యివాళ కార్తీక సోమవారమూ, చీకటంట లేచి గోదావరి కెళ్ళి స్నానంచేసి వచ్చి పూజ చేసుకుందామనుకుంటూంటే భాస్కరం లేచీ లేవగానే పెరట్లోకి వస్తూ నన్ను ముట్టుకున్నాడు. కొంచెం చూసుకోవద్దూ? మళ్ళీ నే ఎక్కడ స్నానంచేసేది చెప్పండి? స్నానం చెయ్యకుండా ఆ మయిల గుడ్డతో ఎలా వుండను? చేసింది చేసినా యీ యింట్లో కొరత్తడానికి వీల్లేదు. ఏమిరా అంటే 'ఈరోజుల్లో యిన్ని ఆచారాలున్న దాన్ని నిన్నే చూశాను' అని పెద్ద లెక్చరూ. నాకు వళ్లు మండింది సుమండీ. 'గుర్రం గుడ్డిదయినా దాణాకు లోటులేదని' యింట్లో వూరికే పడున్నా లెక్చర్లకేం లోటు లేదన్నాను. దాంతో యింత మొహం చేసుకుని తాగుతూ తాగుతూన్న కాఫీ అక్కడ పెట్టేసి వెళిపోయాడు. వాడేం చేసినా బాగానే ఉంటుంది. అయినా ఎందుకన్నానా అని నా ప్రాణం ఉసూరుమంది. కాస్త వాణ్ణి పిలిచి యీ కాఫీ యిద్దురూ'

సుబ్బమ్మగారి మొహంలో రామమూర్తి పంతులుగారికి ఆ క్షణం తల్లిప్రేమ గోచరించి అదోకరకమైన పూజ్యభావం ఏర్పడింది.

'అయినా చూడు సుబ్బులూ. నువ్వు యీ ఆచారాలూ, వ్రతాలూ కాస్త మానుకోవాలి. దీనివల్ల యింట్లో అందరికీ బాధగానే ఉంది - ఏమిటి చెప్పు దీని అర్థం?'

శ్రీ అవసరాల రామకృష్ణారావు

'సరే. 'కంచే చేను మేస్తే' యింక అడగక్కర్లేదు. ఏదో పూర్వకాలపు దాన్ని. నన్నిలా వెళ్ళిపోనీండి. మీ యిష్టం - మీ తండ్రీ కొడుకులు ఏం చేస్తారో' ఆ కాఫీ గ్లాసు అక్కడ పెట్టి సుబ్బమ్మగారు విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

* * *

రామనాధం వచ్చేసరికి శ్రీనివాసరావు బట్టలు సర్దుకుంటున్నాడు.

'అదేమిట్రా నీనూ ఎక్కడికి?' అన్నాడు రామనాధం ఆశ్చర్యంగా.

'మా వూరికిరా.'

'అదేమిటీ, యివాళ మధ్యాన్నం రేపు ఆదివారం, యీ రెండ్రోజుల శలవకీ మీ వూరు వెడతావా? ఎందుకూ?'

ఈ అమాయక ప్రశ్నకు శ్రీనివాసరావూ, గోపాలం నవ్వుకున్నారు.

'రోజుకీ రోజున్నరకీ ఊళ్ళెందుకు వెడతారో పెళ్ళికానివాడు వాడికేం తెలుస్తుందిరా?'

మళ్ళీ యిద్దరూ నవ్వేరు. రామనాథం మనసు అదోలా అయింది.

'ఒరే యిప్పట్లో మీనాన్న నీకు పెళ్ళి చెయ్యడేమిట్రా?' అని అడిగాడు శ్రీనివాసరావు.

'వాడికిప్పట్లో పెళ్ళెందుకురా కుర్రాడూ!' వెటకారంగా అన్నాడు గోపాలం.

'కుర్రాడూ! ఎందరు కుర్రాళ్ళని అడిగావు కాదు! ఒరే అబ్బీ నీ 'ఏజ్' ఎంతరా?'

'అసలే చస్తూంటే వాడి నెందుకురా అడుగుతావు? వాడి స్కూలు ఫైనలు రికార్డు చూశాను. ట్వంటీ టూ కంప్లీట్ అయ్యాయనుకుంటాను.' అన్నాడు గోపాలం, రామనాథం వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

'ఒస్తారా బ్రదర్, సిగరెట్లు తెచ్చుకోవాలి' గోపాలం వెళ్ళిపోయాడు.

'ఏంరా రామనాథం? మాట్లాడవేం? నిన్ను చూస్తే జాలేస్తోంది - అయినా యీ పెద్దవాళ్ళకు బుద్ధుండాలి, ఆమాత్రం పిల్లల అవసరాలు గ్రహించవద్దూ? అయినా నాకు తెలియలేదు, మీ ఫాదర్ నీకెందుకు పెళ్ళిచెయ్యడు? వాటీజ్ ది కేస్ విత్ యువర్ ఫాదర్?'

రామనాథం బుర్ర డెస్కుమీద పెట్టుకుని కూర్చున్నాడు. మాట్లాడలేదు.

'ఏంరా మాట్లాడవ్? నేను సీరియస్ గా అడుగుతున్నాను. ఇలాంటి విషయాల్లో మొహమాటపడి లాభంలేదు. నేను రాసేదా మీ ఫాదర్ కి?'

'ఊరుకోరా బాబూ, ఇంకా పెళ్ళి కావలసిన అన్న లిద్దరున్నారు!'

'మైగాడ్! ఇదా నీ డిఫికల్టీ? అయితే మీ ఫాదర్ వాళ్ళకెందుకు చెయ్యలేదు?'

'మా యింటి పరిస్థితులు వింటే అప్పుడు నీ కర్థమౌతుంది బ్రదర్. మా అమ్మ ఉత్త వెర్రిది. ఆమె పూర్వకాలపుది. ఆవిడ ఆచారాలూ, వ్రతాలూ సాగుతే యింక ఆమెకి రెండోది అక్కర్లేదు. పొద్దుట లేస్తే తల ఆరబెట్టుకోడం, వత్తులు చేసుకోడం - యిలాంటి పనులతో ఆమెకు రెండో విషయం ఆలోచించడానికే టైం ఉండదు, ఇంక మా నాన్న. డబ్బు కళ్ళబడాలి. మమ్మల్ని ముగ్గుర్నీ సంతలో అమ్మి సొమ్ము చేసుకుందామని ఆయన ఉద్దేశం. ఎప్పుడు ఎక్కువ ధర ఒస్తే అప్పుడు అమ్ముతాడు. అంతవరకూ మేమిలా ఉండవలసిందే.'

'మరి మీ బ్రదర్స్ ఏంచేస్తున్నారు?'

'మా పెద్దన్నయ్య మద్రాసులో 'లా'

గోమతీదేవిగారి చిత్రాలు



పచ్చీసు



పూర్వ స్మృతులు



పరధ్యానం

★ ఎవరి పెళ్ళి? ★

చదువుతున్నాడు. నేను స్కూలు ఫైనలు చదువుతూంటేవాడు బియ్యే చదివేవాడు. దాన్నిబట్టి చూసుకో ఎన్ని దండయాత్రలు కొట్టేడో. ఇంక భాస్కరం అన్నయ్య. వాడికి అసలు చదువబ్బలేదు. మొన్న సెప్టెంబరుకి యింటర్ కట్టేడు. ఏమయిందో మరి!'

'నాకు మీఫాదర్ని చూస్తే కాదుగాని మీ బ్రదర్స్ని చూస్తే ఒళ్ళు మండుతోందిరా! ఇంత చేతకాని వాళ్ళా మీరు? ఆయన్ని ఎదిరించడానికి ఒకడికీ దమ్ములు లేకపోయాయా? పెద్దవాళ్ళయేది, వయోవృద్ధులయేది. మంచి కో సంప్రొటెస్టు చెయ్యలేకే భారతజాతి యింతఅధోగతిలో ఉందేమో! అందరిమాటకీ ఏంగాని యిన్ని కబుర్లు చెబుతావ్ నువ్వెలా ఊరుకున్నావ్ రా?'

'ఊరుకోక నన్నేం చెయ్యమంటావురా?'

'ఇంత సిల్లీ క్వొశ్చన్ వెయ్యడానికి నీకు సిగ్గులేకపోయిందిరా? మైనారిటీ తీరినవాడికి ఆమాత్రం అథారిటీ లేదా? ఇదే యింగ్లీషువాడైతే యిలా ఊరుకొంటాడా? నాకేం? మనం పూరుకున్నా ఆడపిల్లను కన్నవాళ్ళు ఊరుకోరు. రమాదేవి ఫాదర్ ఎలాగా మరో సంబంధం చూచుకుంటాడు'

'అదేమిట్రా? అలాఅంటున్నావేమిటి?'

'ఈసంగతి నీకు ఎప్పుడో చెబుదామనుకుంటున్నాను. సమయంవచ్చిందికాబట్టి చెబుతున్నాను. మొన్న కంటోన్మెంటులో ప్రసాద్ గారు కనబడి నీగురించి అడిగారు'

'ప్రసాద్ గారే? ఏమన్నారు? మరి యిన్నాళ్ళూ చెప్పలేదేంరా?'

'అలా బిస్ అయిపోకుమరి. వాళ్ళ రమ నీగురించి ఆయనతో చెబుతూంటుందట'

'నిజమే?'

'అనుగో ఆ పొంగే అణుచుకో. మొత్తం మీద ఆ అమ్మాయికి నీమీద యిష్టమున్నట్టు తెలిసింది. అటుపైన నీయిష్టం'

రామనాధం తలలో వెయ్యి వాట్సుల బల్బు వెలిగింది. పారిజాతాల్లాంటి పళ్ళూ, పద్మాల్లాంటికళ్ళూ, పనసతొనలాంటి ఒళ్ళూ ఎలా, ఎలా ఒదులుకోవడం?

'అయితే ఏం చెయ్యమంటావురా?'

'ఏమో మరి. ఆయన మాత్రం నిన్ను 'లైక్' చేసినట్టు కనబడింది. మీ ఫాదర్ కి డబ్బుకావాలంటున్నావ్, మీ మదర్ కి ఆచారాలంటున్నావ్. వాళ్ళదంతా ఫారెన్ పోలసీ. ఎలా కుదురుతుందో నాకు తెలీదు. నీకూ తగినంత వయసుంది. ఆలోచించుకో. వస్తానురా బ్రదర్ టైమైంది.'

శ్రీనివాసరావు సంచీ తీసుకుని వెళ్ళిపోయాడు. రామనాధం అటునైపే చూస్తూ ఉండిపోయాడు. అతని మనసులో ఏమి ఆలోచనలున్నాయో చెప్పడంకష్టం.

* * *

'ఈ గొప్పతనం యీ బీదతనం మనం పుట్టుకతో తెచ్చుకున్నావా చెల్లెమ్మా? డబ్బుతోపాటు మన అభిమానాలకీ ఆదరాలకీ కూడా స్థిరంలేదా? అది చిన్నప్పట్నుంచీ వాడిమీదే ఆశ పెట్టుకుంది. వాడు కూడా మీరు చేసుకుంటే వద్దనడు. దాన్ని నీ చేతుల్లో పెడితే నాకు నిశ్చింత. మేమూ పెద్దపెద్ద కట్నాలు యిచ్చుకోలేకపోయినా...'

సుబ్బమ్మగారు యింక ఊరుకోలేకపోయింది.

'దున్నపోతుమీద వర్షం కురిసినట్టు' నామీద ఎందుకు అన్నయ్యా నిష్టూరాలు వదుల్తావ్? ఏదో యీ యింట్లో నేనూ ఓ మనిషిలా తిరుగుతున్నానేగాని 'గుడ్డికన్ను మూసినా తెరిచినా ఒకటే' అన్నట్టు యీ యింట్లో నే ఉన్నా లేకపోయినా ఒకటే గదా? పార్వతిని కోడలుగా చేసుకోడమూ నీతో వియ్యమొందడమూ నా కిప్పటికేనా అయిష్టమౌతుందా? ఇంతకుముందు ఎన్నిసార్లో యీమాట ఆయనదగ్గిర సూచించాను. 'కందకులేని దురద బచ్చలికెందుకు?' అన్నారాయన. నువ్వొచ్చి అడగాలని ఆయన అభిప్రాయం కాబోలు.

'మనసులో మాట మబ్బులో పొద్దు తెలియవు కదా!'

'బాగుందమ్మా! ఇన్నాళ్ళు ఏదో మొహమాటపడి ఊరుకున్నానుగాని బావేం నాకు కొత్తా? ఇంట్లో ఉన్నాడా ఇప్పుడే వెళ్ళి అడుగుతానూ!'

ఆంజనేయులు వీధి గదిలోకి వెళ్ళేసరికి వినబడ్డ మాటలు యివి. 'సరే పెద్దవాడికి ఎనిమిదికి తక్కువ ఎలాగా రాదు. మూడో వాడికేం బంగారు పిచిక. అందం ఆకారంతోపాటు సరస్వతి వాడ్ని వరించింది. ఇంక లక్ష్మి పిలవకుండా వస్తుంది. సాధారణంగా మామగార్లే పిల్లకన్నా ఎక్కువగా పెళ్ళికొడుకుని వరిస్తారు. వద్దన్నా వచ్చి నట్టు పదో పదిహేనో తెచ్చి కాళ్ళదగ్గిర పడేస్తారు. ఇక ఎటొచ్చీ మధ్యవాడే: 'ఎంత పుచ్చు మిరియాలయినా ఏనియాల పాటి చెయ్యవా' అని వాడికేం మొగ మహారాజు. అందరికీ అన్నీ అబ్బుతాయా మరీ? వాడి విషయంలోనైనా అయిదు సంఖ్యపై మాటే గాని తక్కువరాదు. అంతా మొత్తం ఎంత తక్కువగా చూసుకున్నా పాతిక పైమాటే - పాతిక!'

తనకు స్వాగతం యివ్వకుండా రామ్మూర్తి పంతుల స్వగతం ఏమిటో ఆంజనేయులికి అవగతం కాలేదు.

'ఎవరితో బావా మాటాడుతున్నావ్?' రామయ్యపంతులు ఉలిక్కిపడి యిటు తిరిగాడు.

'ఎవరదీ? ఆంజనేయులా ఏమిటి?'

'అవును బావా! సరేగాని ఎవరితో మాట్లాడుతున్నావ్? ఏమిటా లెక్కలు?'

'ఏవో ఆఫీసు గొడవలులే. ఏం యిలా వచ్చావ్?'

ఆంజనేయులు చేతులు నులుపుకుంటూ అన్నాడు. 'చూడు బావా, చాలా రోజుల్నుంచి ఓ సంగతి నీకు చెపదామనుకుం

టున్నాను. అదైనా నీకు తెలియనిది కాదులే...'

'ఏమిటీ వ్యాఖ్యానం? ఆ చెప్పే దేదో త్వరగా చెప్పు; నాకు చాలా పనులున్నాయ్.'

ఈ మాటతో ఆంజనేయులు మూడొంతులు నిరుత్సాహపడిపోయాడు. అతను లేని శక్తి తెచ్చుకుని యిలా అన్నాడు.

'చూడు. నువ్వు మీ ఆనందుకి యీ శ్రావణంలో పెళ్లి చేస్తావని విన్నాను. మీ భాస్కరానికి కూడా వయసొచ్చింది. నువ్వు ఎవరికీ మాట యివ్వకపోతే...'

'ఊఁ యివ్వకపోతే?'

రామయ్య పంతులు ప్రతిమాటా అంత అధికార పూర్వకంగా నిర్లక్ష్యంగా ఎందుకంటాడో ఆంజనేయులకి అర్థం కాలేదు. ఆడపిల్లని కనడం అన్న ఒక్క నేరం అతన్ని ఒకడివద్ద మానాభిమానాలు చంపుకుని ప్రార్థించవలసిన శిక్ష విధించిందా అనిపించింది.

'అదీ, వాడూ చిన్నప్పట్నుంచి కలసి మెలసి పెరిగారు. మా పార్వతికి మీ భాస్కరం అంటే పంచప్రాణాలూను. నీ అంతస్థుకు తగ్గట్టు నేను జరపలేకపోయినా నా శక్తివంచన లేకుండా కట్నాలూ, కానుకలూ యిస్తాను. ముద్దూ ముచ్చట్లూ జరుపుతాను. నువ్వు యిష్టపడితే మీ ఆనందు పెళ్లితోనే...'

'అపవోయ్ అపు. నీ స్థానం ఏమిటి? నా స్థానం ఏమిటి? ఏదో బంధుత్వంకొద్దీ వస్తూపోతున్నావనుకుంటే యింతింత ఆశలున్నాయా నీకు? నేనెవరు, నువ్వెవరు? నీకూ నాకూ వియ్యమేమిటి? ఈమాట అనడానికి కొంచమైనా ఆలోచనా సిగ్గూ లేకపోయాయా నీకు?'


ఆశలు అడుగంటిన అంత్యస్థితిలో, అన్యాయంగా అలుముకున్న అనుభవంలో-కోపానికి కాలతా, బాధకు పరిమితీ ఉండదు. ఆంజనేయులు అలాంటి స్థితిలోనే పడి హద్దులు దాటిపోయాడు.

'ఈ మాటలు అడడానికి నీకే కొంచమయినా ఆలోచనా సిగ్గూ ఉండవలసింది. ఈ పాపిష్టి డబ్బుతో ఒళ్లు మర్చి కళ్లు కనబడక నువ్వెన్నాళ్ళు పరవళ్లు తొక్కుతావో నేనూ చూడకపోను' ఇంకా ఏదో అనబోయి కిటికీలోంచి వారింపు గమనించి ఆంజనేయులు బలవంతంగా ఆపుకున్నాడు.

'ఛీ-నోరుమ్మయ్. ఇంకా సిగ్గులేక మాట్లాడుతున్నావ్! ఒరోజు తింటే ఒరోజు పడుకునే మహారాజువి దురదృష్టానికి దుఃఖిస్తూ దూరంగా పడివుండక, పదిమందిలో తలెత్తుకు తిరుగుతున్నదే చాలక - నాతో వియ్యాని కొచ్చి కయ్యానికి కాలు దువ్వుతున్నావ్! జాగ్రత్త అవతలికి యీడిపించగలను.'

'నువ్వు నన్ను ఈడిపించే దేమిటి? నాలాంటివాడిని ఏడిపించిన ఉసురు నిన్నే యీడిపించగలదు. ఇన్నాళ్ళనుంచి తిరుగు

(౫౫-వ పేజీ చూడండి)





విజ్ఞానవీధులు


"డాక్టర్"



137. అద్దము ముఖాన్ని సరిగ్గా చూపిస్తుందా?

అద్దంలో అక్షరాలు తిరగవేసినట్లు కనబడతాయి. కాని ముఖం మామూలుగానే కనబడుతుంది. కారణ మేమిటండీ? అని విజయవాడనుంచి సెప్పల్లి మోహనకుటుంబరావుగారు అడుగుతున్నారు.

పుస్తకాన్ని విప్పి అద్దాని కెదురుగా పట్టుకుంటే, అద్దము అక్షరాల్ని తిరగవేస్తుందని సులువుగా తెలుస్తుంది. పటములో




'శ్రీ' అనే అక్షరము తిరగబడే రీతిని సూచించాము. 'శ్రీ' అను అక్షరమున్న కాగితాన్ని పుస్తకము మూసినట్లు మూస్తే బింబానికి ప్రతిబింబానికీ బిందువు బిందువుకీ సామరస్యము కనబడుతుంది. ఇప్పుడు ఈ అక్షరానికి బదులుగా మీ ముఖాన్ని అద్దముదగ్గర చేర్చండి. ముఖమ్మీది ప్రతీ బిందువుకీ, అద్దానికి వెనక బింబపు బిందు వేర్పడుతుంది. పై 'శ్రీ'కి ఏర్పడ్డట్టే ముఖానికి కూడా తిరగబడ్డ బింబమే ఏర్పడుతుంది.

మీ క్రాపు ఎడమవైపునకలకదా పాపిడి తీస్తారూ? మీరు నాయెదట నిలబడ్డా రనుకోండి. మీ పాపిడి నా కుడిచేతివైపు ఉంటుంది. ఇప్పుడు మీరు అద్దము ముందు నిలబడి మీ పాపిడి ఏ చేతివేపు ఉందో గుర్తించండి. మీ పాపిడి మీ ఎడమచేతివైపే ఉంటుంది. మీరే గాని మీకు ఎదురుగా నిలబడగలిగితే పాపిడి మీ కుడిచేతి వేపు కనబడాలిగదా? నాకలాగే గోచరిస్తుంది? మీ రూపం అంతా అద్దంలో ఎడమభాగం ఎడమచేతివేపూ, కుడిభాగం కుడిచేతి వేపూ 'తిరగబడే' కనబడుతుంది.

మీరు మరొకలాగ పొరపాటుగా భావించక ముక్కుపుడక (ఒక్కటే) పెట్టుకున్న స్త్రీముఖాన్ని అద్దంలో చూడండి. మీరు మామూలుగా చూచినప్పుడు మీ యెడమ చేతివైపున్నట్లు కనిపించే ముక్కుపుడక ఆమె రూపాన్ని అద్దంలో చూచినప్పుడు మీ కుడివైపున్నట్లు కనబడుతుంది. ముఖకవళికలో కుడియెడమభాగాలకి భేదమున్న వ్యక్తు లందరూ అద్దంలో చూచినప్పుడు మారినట్లు కనబడతారు.

పూర్వకాలం రాణులకు సైరంధ్రు లుండేవారు అలంకరించడానికి. రాణులు తమకుతామే అలంకరించుకుంటే తాము పైవాళ్లకి ఎలాగు కనపడతారో ఊహించుకోలేరు కనక అలంకారము అనుకున్నట్లు ఉండదు. సైరంధ్రి అలంకరిస్తే, పైవారికి ఉత్తర ఎలాగ కనపడుతుందో ఆరూపానికి తగినట్లు అలంకరిస్తుంది. కనక సైరంధ్రి అలంకారానికి చాలా అవసరం.



రెండు అద్దాల పలకలు తెచ్చి, పటములోలాగ 45° కోణములో అమర్చండి. ఇప్పుడు మీ ముఖము చూడండి. కోణము సరిపోకపోతే ముఖాన్ని రెండు ముక్కలు చేసినట్లు కనబడుతుంది. ఈ రెండు భాగాలూ, ఒక పూర్తి ముఖ మయ్యేటట్లు సర్దండి. ఇదీ మీరు మా అందరికీ కనిపించే రీతి. మీ రూపానికి మీరే ఎదురుగా నిలిచి చూస్తున్నా రన్నమాట. పాపిడి చూసుకోండి. మీకుడి చేతివైపుకి వస్తుంది. అయితే పలకఅద్దము ముఖాన్ని సరిగ్గా చూపిస్తుం దంటారా? —రావు.

చిట్టి ప్రశ్నల జవాబులు

—మన ముక్కురంధ్రాలు రెండూ లోముక్కులో కలుస్తాయి. అచోటికి క్రిందుగా చీమిడి ఏర్పడుతూంటుంది. మనము కుడివైపు తిరిగి పండుకున్నప్పుడు ఈ చీమిడి బరువువల్ల కుడివైపున్న నాసికా రంధ్రమువైపు చేరి శ్వాసని అడ్డగిస్తుంది. కనక అప్పుడు శ్వాస ఎడమ నాసికా రంధ్రముద్వారా జరుగుతుంది.

—చంద్రమండలములోకి రాకెట్లలో వెళ్లడానికి అనుకూలపరిస్థితు లేవో అని పరిశోధనలు జరుగుతున్నాయి కాని యింకా అది

"మిత్రుడు జయరాం గారికి-లేక లేక ఇంత కాలానికి మిమ్మల్ని కొంత డబ్బ పంపించ వలసిందిగా కోరుతున్నందుకు నేను చాలా చింతిస్తున్నాను. పరిస్థితి అంత విషమమైందని మీరు గుర్తించాలి. గుర్తించడంతో బాటు ఒకనూరు రూపాయలను నా అడ్రసుకు మనియార్డరు చేస్తే-అదీ టెలిగ్రాఫు ద్వారా అయితే మరీ మంచిది-నేను కలకాలం మీకు కృతజ్ఞుడినై వుంటాను. మీ డబ్బు అప్పుగా భావింపబడి త్వరలో వాపసు చేయబడును. ఇట్లు నాగరాజు"

మరోమాట: వ్రాయడానికేమి ఈజాబును వ్రాసేశాను గానీ, ఈలా వ్రాసినందుకు మాత్రం నాకు చాలా లజ్జగా వుంది. అందువల్లనే దీన్ని పోస్టుచేయడానికి వెళ్తున్న మా పెద్ద కుర్రాణ్ణి వెనుతిరిగి రావలిసిందని మా చిన్న కుర్రాణ్ణి పంపించాను. కానీ వీడు వాణ్ణి కలుసుకొనేసరికి ఈజాబు పోస్టు బాక్సులో పడిపోయింది.

లా. రా."

యం. ఆర్., చిత్తూరు.

ఎంతవరకు ఆచరణయోగ్యాలో సోదా చేసే యత్నము జరగలేదు.

—సముద్రమధ్యంలో కెరటాలుండవన్నది నిజము కాదు. బలమైన గాలి వీచుతూంటే కెరటాలు పుట్టకేంచేస్తాయి? మధ్యధరాసముద్రంలో చాలా ఎత్తైన కెరటాలు లేస్తాయి. ఎర్రసముద్రములో గాలి జోరుగా ఉండడమువల్ల అరేబియా సముద్రంలోకంటె పెద్దకెరటాలు లేస్తాయి.

—విషము అన్నది ఫలానిది మాత్రమే అని చెప్పడానికి వీలులేదు. మోతాదు మించిపోతే ఆహారమే 'విషము' అవుతుంది. నెత్తుర్ని ముద్దగట్టించేదీ, నరాల్ని స్తంభింపజేసేదీ, విషమే. పాముకోరల విషము మన ఆహారపదార్థాలలోవుండే ప్రొటీను(మాంసకృత్తు)మాత్రమే. విజాతీయమైన ప్రొటీను నెత్తురులో చేరితే నెత్తురు ముద్దగట్టుకుపోవచ్చు. పాలు ఇంజక్షను పుచ్చుకుంటే విపరీతమైన జ్వరం వస్తుంది. ఇంకొకరి నెత్తురు మన నెత్తురులోకి ఎక్కిస్తే మన నెత్తురులోని ఎర్రకణాలు ముద్దగట్టి మరణానికి కారణము కావచ్చు. అందుకే సరిపడే నెత్తురుగాని రోగులకు ఎక్కించరు. కాబట్టి 'విషము' అన్నది ఫలానా అని చెప్పడానికి వీలులేదు. ఏది తింటే వికటిస్తుందో అది విషమే.

—మెరుపు మెరిసినప్పుడు ఒక్కొక్కప్పుడు సిటీ కరెంటు ఆగిపోయినట్లు లైట్లు ఆరిపోతాయి. దీనికి కారణము ఇదీ అని శోధించి కనుక్కున్నట్లు లేదు. మెరుపు అంటే అమేయమైన బలముకల విద్యుత్ప్రవాహము. ఈ ప్రవాహమువల్ల ఎలక్ట్రికుతీగలలో అతిబలమైన ప్రవాహాన్ని పుట్టించి పవర్‌హౌసులోని ఫ్యూజును తెంపేస్తుందేమో నంటాను, కొంతసేపు మాత్రమే ఆరిదీపాలు మళ్ళీ వచ్చాయంటే, సిటీ కరెంటుకు తాత్కాలికంగా నిరోధము వచ్చిందన్నమాట.

—విమానానికి ప్రొపెల్లరులాగ పక్షుల రెక్కలకిగల వంపు వాటికి ముందుకు ఎగరడానికి సాయపడుతుంది. పక్షుల రెక్కలు రేకుల్లాగ కాక, ముందు అంచులదగ్గర వంగి వుంటాయి కాదూ? ఈ వంపువల్ల గాలి వెనక్కి (కిందికి కాదు) నెట్టబడి పక్షుల్ని ముందుకి నెట్టుతుంది.

—అనంతము అంటే అంతము, (లేక, అవధి) లేనిది. ఒక సంఖ్యని అర, పాతిక, ఇలాగ చిన్నభిన్నాలచే భాగిస్తే వచ్చే లబ్ధము ఎక్కువౌతుందని తెలుసుగా మీకూ? ఆ అంకెను సున్నాతో భాగిస్తే వచ్చేది అనంతము.

—మనము విశ్రాంతి అవసరము కనక నిద్రపోతాము కాని రాత్రి అయిందన్న కారణమువల్ల నిద్రపోము. రైల్వే ఉద్యోగస్థులు పగలే నిద్రపోవాలి. విశ్రాంతి లేకపోతే ఎలాగ? మీరు సూర్యుడు ఎప్పుడూ కనబడేటట్టుగా ఏరోప్లేనులో ప్రయాణము చేస్తే రాత్రిపడదు గాని మీకు అలసట వస్తుంది. మరి నిద్రపోకుంటే ఎలాగా?

—సూర్యుడికీ భూమికీ నడుమ వాయువులు లేవు. శూన్యప్రదేశమే వుంటుంది. శబ్దాలు ప్రసరించడానికి గాలి, నీరూ, వస్తువూ వంటివి కావాలిగాని వెలుతురుకీ వేడికీ అక్కరలేదు. కనకనే సూర్యుడి వెలుతురూ వేడ మనకు అందుతున్నాయిగాని సూర్యగోళపు ప్రేలుడులు మనకి వినబడవు.

—చంద్రుని కిరణాల్లో కూడా ఉష్ణముంటుంది. ఈ ఉష్ణం కొలవడానికి సాధనాలు కూడా వున్నాయి. వెన్నెల్లో సూర్యుని వెలుతురులో ఉన్నంత ఉష్ణం లేకపోడానికి కారణం చంద్రబింబపు ఉపరిభాగం అద్దంవలె నున్నగా లేకపోవడమే. ఎండలో అద్దం పెట్టి పరావర్తం చేసిన సూర్యరశ్మికీ, ఏదైనా బట్టను కట్టి పరావర్తంచేసిన సూర్యరశ్మికీ, తేడా గమనించే వుంటారు మీరు. వెన్నెలంటే ఈ రెండో రకం సూర్యరశ్మి వంటిది.

—కాశ్మిక్ కిరణాలు అంటే విశ్వాంతరాళమునుంచి అన్ని వైపులా ప్రసరించే అతిశక్తివంతమైన కిరణాలు. ఇవి ఎక్కడనుంచి వస్తున్నాయో నిర్ధారణగా తెలియదు కాని విశ్వాంతరాళములో ద్రవ్యము శక్తిగా మారుటవల్ల కలుగుతున్నాయని మేక్మిలన్ వైజ్ఞానికుడూ, శక్తి ద్రవ్యముగా మారుతూండడంవల్ల కలుగుతూండవచ్చునని మిల్లికాను వైజ్ఞానికుడూ అన్నారు. ★







హంస సందేశం

చిత్రకారిణి:
శ్రీమతి గోమతీ దేవి, మద్రాసు.

బొమ్మరిల్లు

పాపాయి ధైర్యం

★

రచన: శ్రీ కాసుఖేల సోమేశ్వరరావు

నల్లమబ్బుల్లోంచి జల్లొకటి వచ్చింది
సెగలు కక్కేనేల పొగరణగిపోయింది
ఇళ్లముందర నీళ్లు కాలువలుగట్టాయి
చలిగాలి వీచితే తాతయ్య వణికాడు.

బిలబిలామంటూను పిల్లలందరునూ
కలకలాలాడేటి కళ్లు దిప్పుతునూ
కులుకుతూ, పలుకుతూ నవ్వు లొలికిస్తూ
గిరగిరా తిరుగుతూ పరుగులను దీశారు.

అందాలపాపాయి దిస్సమొలతోటీ
అమ్మ ఒడి వదిలేసి పాకుతూ, డేకుతూ
తానుగూడా పెద్ద మొనగాడి ననుకోని
చిరునవ్వు చిందిస్తు బయటికొచ్చాడు.

తల్లికుక్కను వదిలి కుక్కపిల్లొకటి
అందాల పాపాయి చందాలు చూసి
ఆడుకుందామంచు మీదికి ఉరికింది
అదిరిపడి పాపాయి కెవ్వుమన్నాడు.

పాపాయి అమ్మంత పరుగెత్తుకొచ్చి
రెండు చేతులు జాచి లేవనెత్తిందీ
చంకెక్కి పాపాయి గుండెదడ తగ్గి
'ఛీ'యనీ కుక్కనూ అదలించి కొట్టాడు.

నా చిట్టి పాప

★

రచన: శ్రీ గోటేటి శ్రీరామారావు

"ఏడువకె ఏడువకె
నా చిట్టిపాప
ఇప్పుడే వస్తారె
మీనాన్నగారు.

ఏడుస్తె నీకళ్ళు
నీలాలుగారు
నీలాలు గారంగ
నేచూడలేను.

నాచిట్టి పాపాయి
నసుకన్న దాన
మిన్నకా ఊరుకో
బంగారు కొండా—

బండిలో వస్తారు
మీనాన్నగారు
బంతుల్లు తెస్తారు
నీఆట కోసం.

కారులో వస్తారు
మీనాన్నగారు
కొత్తచొక్కాలెన్నొ
కొనుక్కొస్తారు.

ఏమేమి కావాలె
ఓ చిన్ని పాప
ఒకసారి నవ్వవే
నిండార నీవు

బొమ్మల్లు తెస్తారు
నాచిట్టి పాప
బంగారు బొమ్మలే
నాబుల్లి పాప."

అనుచు ముద్దాడంగ
ఆ అమ్మ తన్ను
తెలిసింది కాబోలు
తెలబోయినవ్వె.

బొమ్మరిల్లు సీరియల్

అద్దెబోటులో—

ముచ్చటగా ముగ్గురు

(కుక్క సంగతి సరే సరి!)

9

జార్జిగాడు ఎలాగూ మాపాలబడ్డాడు కాబట్టి, యీపడవ చాకిరీ అంతా వాణ్ణే చెయ్యమన్నాం. వాడికిమటుకు వొళ్లువొంచి పనిచెయ్యాలని లేదు—ఆమాట వేరే చెప్పనక్కర లేదనుకోండి. బస్తీలో వున్నంతసేపూ తానేమో మహాపనిచేసి అలసిపోయానని చెప్పుకొన్నాడు. హారిస్సుది అసలే రాతిగుండె. ఇతరులను చూసి జాలిపడటం అనేది వీడి తత్వానికి తెలియనివిషయం.

“బస్తీలో పనిచేసి అలసిపోయావేం? పాపం!—పోనీలే—ఇప్పుడు పడవలో పనిచేసి అలిసిపో? ఆమాత్రం మార్పు ఎవరికైనా మంచే చేస్తుంది. ఊ!... అట్లా చూస్తూ వూరుకొంటావేం!” అంటూ ఆహారిస్సుగాడు జార్జిని కాకి పొడిచినట్లు పొడిచిపొడిచి వదలిపెట్టాడు.

పైకి యిలా అంటున్నప్పటికీ, వాడికి కూడా, యీజార్జిగాడు బోటులో దిగబడి మాయిద్దరికీ వెంటనే యింత టీ కాచియిస్తే బాగుండుననే వున్నది. టీకాచటం అంత చికాకుపని అదేకాని మరొకటిలేదు. అదీకాక, అప్పటికే హారిస్సూ, నేనూ కూడా బాగా అలిసిపోయాము. లోపల అభిప్రాయాలు యిలా వున్నా, జరిగింది మాత్రం యింకొకటి. జార్జిగాడికి పడవతాడు అందించాం. వాడు అది అందుకొని, కాలిబాట వెంట భారంగా నడక సాగించాడు.

అసలు యీ పడవతాళ్లు అనేవే ఎంతటివాడికైనా యిట్టే చికాకు పుట్టించేస్తాయి. ఆతాళ్లని చుట్టబెట్టేటప్పుడు ఎంత జాగ్రత్తగా చుట్టినా, మళ్లీ పట్టుమని ఐదునిమిషాలైనా గడవకుండా వాటిని విప్పబోతే మాత్రం, దుష్టుడు బుర్రలో ఆలోచనల్లాగా, తెగ మారాముళ్లుపడి వుంటాయి.

పడవ తాళ్లని పట్టుకొని పరిహాసం చెయ్యటం నాకు ఎంతమాత్రమూ సరదాకాదు. కాని—వాటి విషయంలో ఒకటి అనుకోకతప్పదు. పడవతాడు అని పిలవబడే ఆపదార్థాన్ని పట్టుకెళ్లి, చెట్టూ చేమ, కంచె, డొంకా ఏదీ అడ్డంలేని పొలంలో సూటిగా విప్పి పడేసుకొంటూపోయామనుకోండి. తీరాఅరనిమిషమైనా గడవకుండా వెనక్కి తిరిగిచూడండి — అంతసేపూ మీరు నడుములు పడిపోయేటట్లుగా సూటిగా పరుచుకొచ్చిన యీతాడు తాడుఅంతా లుంగచుట్టగా చుట్టుకుపోయి, పొలానికి నట్టనడాన పెద్ద కుప్పపడిపోతుంది. ఎలా జరుగుతుందో ఎందుకు జరుగుతుందో చెప్పలేం కానీ, యింతపెద్ద తాడూ మెలికలు తిరిగిపోతుంది. పీటముళ్లు పడిపోతుంది. దానికొసలు ఏమై

మూలం :
జెరోమ్ కె. జెరోమ్
★
అనువాదం :
విశ్వాత్ముల నరసింహమూర్తి

★ ముచ్చటగా ముగ్గురు ★

పోతారో ఏమో — ఆగడ్డిమీద కూలబడిపోయి ఘట్టిగా అరగంటసేపు రెక్కలు ముక్కలు చేసుకొని, తంటాలు పడితేకాని అంతూపొంతూ దొరకదు.

మొత్తంమీద పడవతాళ్లను గురించిన నా అభిప్రాయం యిల్లా వుంటుంది. అల్లా అన్నంత మాత్రంచేత అన్ని పడవతాళ్లూ అంత నీచంగా వుంటాయని నాఅభిప్రాయం కాదు: కొన్నికొన్ని నిజంగా చాలామంచివే కావచ్చు. కొన్నికొన్ని పడవతాళ్లు వున్నాయంటే, అవి యిల్లాంటి వెధవ వేషాలు ఏమీ వెయ్యకుండా, మాటిమాటికీ ఆడవాళ్ల చేతుల్లోని అల్లిక దారాల్లా మెలికలు తిరిగిపోకుండా, అతి బుద్ధిగావుండి, పడవతాళ్ల సంతతికే కీర్తి ప్రఖ్యాతులు ఆర్జించి పెట్టేవిగావున్నా వుండవచ్చు. ఉండాలని నా ఆశకూడా!—కాని యింతమటుకు అంతమంచి తాడు ఏదీ నాకు తారసిల్లలేదు.

మాపడవ యిందాక లాకుకి చేరేముందు నేనే స్వయంగా యీపడవతాడు పైకితీశాను. సామాన్యంగా ఆహారిస్నుగాణ్ణి ఛస్తే యీతాడు తాకనివ్వను. వాడు వుత్త అజాగ్రత్తమనిషి. అక్కడ పెట్టేటప్పుడు దాన్ని ఎంతో జాగ్రత్తగా చుట్టచుట్టి, నట్టనడాన యింకో తాడుతో గట్టిగా కట్టేసి, పడవకి అడుగున నింపాదిగా పెట్టాను. ఏగుణాన వున్నాడో హారిస్సు యీసారి దాన్ని పైకి లేవనెత్తేటప్పుడు జాగ్రత్తగానే లేవనెత్తి, జార్జి చేతుల్లో పెట్టాడు. ఆజార్జిగాడు దాన్ని తనకి దూరంగా వుండేలా రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకొని విప్పటం మొదలుపెట్టాడు. వాడి ధోరణి చూస్తే పసిపిల్ల వొంటిమీది పొత్తిళ్లు విప్పుతున్నట్లుంది కాని, పడవతాడు విప్పుతున్నట్లు లేదు. పట్టుమని పన్నెండుగజాల తాడు అయినా విప్పాడో లేదో, అంతలో దాని ఆకారం అంతా మారిపోయి, అంతా కలిపి కుక్కలుపీకిన కాలిపట్టాలా తయారైంది.

ఎప్పుడూ యింతే! పడవతాడుతో కూర్చినపని ఎప్పుడైనా యిలాగే తయారౌతుంది. ఒడ్డుమీద నిలబడి దీనిచిక్కు వూడదీయాలని తంటాలుపడే పెద్దమనిషి, తప్పంతా అసలుదాన్ని మొట్టమొదలు చుట్టినవాడిదేనను కొంటాడు. ఒడ్డుమీద నిలబడ్డ మనిషి,—ఎప్పుడైనా సరే, — తన మనస్సులో ఏది అనుకొంటాడో అది వెంటనే పైకి అనెయ్యగలడు' అనేస్తాడు.

"చవటవెధవని కాకపోతే, యీపడవ తాడుతో చేపలుపట్టేవల అల్లబోయావా? ఏమిటిలా యీపని? నీబొందపని?" అని మీలాంటి నాలాంటి ఘరానా మనిషిని పట్టుకొని దులిపేస్తాడు. ఆపీటముళ్లు అన్నీ విప్పలేక తల బద్దలుకొట్టు కొంటాడు. ప్రాణం విసిగిపోయి దాన్ని నేలమీద దభేలున పడేసి, కొస ఎక్కడైనా కనిపిస్తుందేమోనని గుట్టగా పడివున్న ఆమోకు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తాడు.


తాడు విప్పబోయిన వాడు యిలా అనుకొంటే, అసలు ఆతాడుని చుట్టచుట్టి అక్కడపెట్టినవాడు యింకోలా అనుకొంటాడు. విప్పబోయిన వాడి అశ్రద్ధ మూలంగానే యిదంతా యింత తిరుగా తయారైందని వీడి నమ్మకం.

"నీ చేతుల్లో పడకముందు అది తిరుగానే వుంది!" అని వీడువొళ్లు మండిపోయి అరుస్తాడు. "పని ఏదైనా చేసేటప్పుడు కాస్త కళ్లుతెరచి వుంచుకోలేవూ? కాకపోయినా—నీలాంటి కుంక చేతుల్లో గడవాసమైనా యిలా మెలికలు తిరిగిపోయి, ముళ్లుపడిపోతుందిలే!" అని వీడూ కసితీరా అనేస్తాడు.

మొత్తంమీద యిలా ఐదారు నిమిషాలు గడిచేలోగా ఆవెధవతాడు మూలంగా వీళ్లిద్దరి మధ్యా పచ్చగడ్డివేస్తే భగ్గుమనేటంత వైరం పెరిగిపోతుంది. అందుబాటులో వుంటే ఒకళ్లనొకళ్లు ఆతాడుతోనే వురితీసేసు కొందురేమో కూడా! మరొక ఐదు నిమిషాలు గడిచేలోగా మొదటినుంచీ తాడు ముళ్లు వూడదీయాలని తంటాలుపడుతున్న వ్యక్తి ఒక్కసారిగా వెర్రికేక ఒకటి వేసి, తాడుమీద ఎక్కి తందనాలు తొక్కటం ప్రారంభిస్తాడు. తనచేతికి ఏది అందితే అదే ఆతాటికొన అనే భ్రమలోపడి, దాన్నిపట్టి బలవంతాన పైకి లాగాలని చూస్తాడు. వీడి యీ ప్రయత్న ఫలితంగా తాడుముళ్లు అన్నీ మరీ బిగుసుకుపోతాయి. ఇదంతా చూసినమీదట వొళ్లు మండుకుపోయిన రెండో పెద్దమనిషి ఒక్క అంగలో

బోటులోనుంచి దూకి ఒడ్డుమీదికివచ్చి పడతాడు ఇద్దరుకలసి ఒక్కసారే తాడు ముల్లు వూడదీయబోయి ఒకరుచేసే పనికి ఒకరు అడ్డం తగులుతారు ఇద్దరూ ఒక్కతాడు ముక్కనే చెరోపక్కా పట్టుకొని అటు కొకడు, యిటుకొకడు పట్టి లాగబోయి, ఎంతకీ తాడు కదలకపోగా, తప్పెక్కడుందో నని విస్తుపోతారు ఈవిధంగా తంటాలు పడిపడి, చివరికెప్పటికో చిక్కు

(41-వ పేజీ చూడండి)



కడపటి క్షణాలు

సుమారు నూరేళ్ల క్రితం మధ్యపరగణాలలో 'పగటిచుక్క' అనే బందిపోటు దొంగల నాయకుడొకడు ఉండేవాడు. వాడిక్రింద ఐదువందల మంది అనహాయశూరులు చేరి, వాడేం చెపుతే అది చేస్తూండేవారు. 'పగటిచుక్క' దోచుకోని ఊరు లేదు; కొల్లగొట్టని పల్లె లేదు. పట్టపగలుకూడా దారులమ్మట ప్రయాణం చెయ్యటానికి ప్రజలు జడిసేవారు. వాడిమాట జ్ఞాపకంవచ్చిన రాత్రి ఎవరికీ నిద్ర పట్టేదికాదు.

దొరతనంవారు 'పగటిచుక్క'ను పట్టియిచ్చిన వాళ్లకి పదివేల రూపాయలు బహుమతి ఇస్తామన్నారు. పదివేలల్లా పాతిక వేలదాకా ఈ బహుమతీ మొత్తం పెరిగింది కాని 'పగటిచుక్క'ను ఎవరూ పట్టుకోలేక పోయారు. ప్రయత్నంచేసిన వాళ్లంతా వాడి అనుచరుల చేతుల్లో పడి ప్రాణాలు కోల్పోయేవారు.

ఆఖరికి వాణ్ణి ఒకస్త్రీ మాయోపాయం వల్ల పట్టి పోలీసులకు పప్పగించింది. పగటిచుక్క పట్టుబడ్డాడని తెలియటంతోనే ప్రజలందరూ పండుగ చేసుకున్నారు. కేసు వెంటనే విచారణ ఐపోతుందనీ, 'పగటిచుక్క'కు జడ్జీగారు తప్పక ఉరిశిక్ష వేస్తారనీ అందరూ చెప్పుకున్నారు.

ఆలోగా 'పగటిచుక్క' అనుచరులు తమనాయకుణ్ణి విడిపించుకోటానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని పోలీసులు ప్రత్యేకం బందోబస్తు ఎక్కువ చెయ్యటంవల్ల దొంగల ఆటలేవీ సాగేయికావు.

అప్పుడు వాళ్లొక ఎత్తువేశారు. జడ్జీగారి ఏకైక కుమారుడు షికారు కెళ్లి వస్తూంటే అతగాణ్ణి పట్టుకు తీసుకుపోయి బంధించి, జడ్జీగారికొక జాబు వ్రాశారు. "మానాయకుడైన 'పగటిచుక్క'ను వదిలేస్తేనే,

శ్రీ పాలంకి
వెంకటరామచంద్రమూర్తి

మీ కుమారుడు మీకు దక్కుతాడు. 'పగటిచుక్క'కు ఏమాత్రం హాని తలపెట్టినా, మీవాణ్ణి చంపేస్తాము." అని ఉంది, ఆజాబులో.

ఆఉత్తరం చూసుకున్న జడ్జీగారి కోడలు మామగారి పాదాలపైపడి, "నాపతి ప్రాణాలు మీచేతిలో ఉన్నాయి. మీకుమారుణ్ణి రక్షించుకుని నాకు పతిభిక్ష పెట్టండి!" అని ప్రార్థించింది. ఆ న్యాయాధికారి ఆమెతో "అమ్మాయి, ఈఆపద సమయంలో ఆభగవంతుడే మనల్ని రక్షించాలి. ధైర్యం వీడకు! అనేక హత్యలూ, నేరాలూ చేసిన 'పగటిచుక్క'కు శిక్ష వెయ్యకుండా ఉండటం ఎలాగ సాధ్యం? నాధర్మం నేను నెరవేర్చకపోతే, అపఖ్యాతికీ పాపానికీ ఒడిగట్టిన వాణ్ణి ఔతాను" అన్నాడు.

మర్నాడు జడ్జీగారు కేసు విచారణ చేశారు. తనకొడుకు కోసం ఆలోచించకుండా న్యాయప్రకారం 'పగటిచుక్క' వెయ్యవలసిన ఉరిశిక్ష విధించారు.

ప్రజల్ని సమాధాన పరచటంకోసం కోర్టులో జడ్జీ తనకు ఉరిశిక్ష విధించినా, లోపాయకారీగా జైలు అధికార్లతో చెప్పి తను పారిపోవటానికి అవకాశం కలుగచేయక పోడను కున్నాడు 'పగటిచుక్క.' కాని అటువంటిది ఏదీ జరక్కపోవటంవల్ల ఆదొంగల నాయకుడు ఉగ్రుడై, "సరేకానియ్యి! నాతోబాటు నీకొడుకు కూడా చస్తాడు! అప్పుడు వాడికోసం యావజ్జీవం నువ్వూ, నీకోడలూ దుఃఖం అనుభవిద్దురుగాని!" అని న్యాయాధికారిని మనస్సులో తిట్టుకున్నాడు. అంతటితో ఆగక, "నన్ను ఉరితీసెయ్యటంతోనే జడ్జీ కొడుకుని చిత్రవధచేసి, ఆతలకాయను తండ్రి గుమ్మం ముందు పడేసి పొండి!" అని దొంగలకు రహస్యంగా ఉత్తరువు పంపేడు.

'పగటిచుక్క'ను ఉరితీసేరోజు వచ్చింది. ఆఉదయమే జైలు అధికారి వాడిగదికి వెళ్లి, "నీకు కడసారి కోరిక యేదైనాఉంటే చెప్పు.

తీరుస్తాము" అన్నాడు.

'పగటిచుక్క' తనకేమీ కోరిక లేదన్నాడు. "అయితే భగవంతుణ్ణి ప్రార్థన చేసుకో ఇంక" అన్నాడు అధికారి.

ఇంతవరకూ నేనెన్నడూ ఆ భగవంతుడనే వాణ్ణి గురించి ఆలోచించలేదు. ఈఆఖరి క్షణాలలో మాత్రం నాకు దేవునితో యేంపని? అన్నాడు పగటిచుక్క.'

"భగవంతుడు దయామయుడు. నీవు ఈజన్మలో చేసిన పాపాలన్నీ ఆతణ్ణి ఒక్కసారి మనసారా ధ్యానంచేస్తే పోవచ్చు, లేకపోతే నువ్వు నరకకూపంలో పడిపోతావు" అన్నాడు అధికారి.

"నరకం అనేది ఒకటి ఉంటే అది నాకు ఎలాగా తప్పదు. ఇన్నాళ్లూ లేనిది ఇప్పుడొకసారి ప్రార్థిస్తే నరకం తప్పుతుందా?" అన్నాడు పగటిచుక్క.

"ఎందుకు తప్పదూ? జీవితమంతా వృథాఐనా ఈఆఖరిక్షణాలలో నువ్వొక ఘనకార్యం చెయ్యకూడదని ఎక్కడ ఉంది? అన్నాడు అధికారి.

"దేవుడెలాగ ఉంటాడో ఊహించుకోకలిగితే తప్ప ధ్యానం చెయ్యటం కష్టంకదా" అన్నాడు 'పగటి చుక్క.'

"దేవుడు దయామయుడని చెప్పేను. దేవుని స్వరూపం ఊహించుకో లేకపోతే, నిన్ను దయతో చూసిన ఎవరో ఒకరి స్వరూపాన్ని మనస్సులో తలుచుకుని అదే దేవుని స్వరూపమనుకుని ప్రార్థనచెయ్యి" అని చెప్పి, అధికారి వెళ్లిపోయాడు.



"నా పతిప్రాణాలు మీ చేతిలో ఉన్నాయి. మీ కుమారుణ్ణి రక్షించుకుని నాకు పతిభిక్ష పెట్టండి!"

పగటిచుక్క, "నన్నెవరు దయతో చూశారు?" అని ఆలోచించడం ప్రారంభించాడు. తల్లి తండ్రులు తమ పిల్లల్ని దయతో చూస్తారు. తన తండ్రి తనకు జ్ఞానంరాక పూర్వమే చనిపోయాడు. తల్లి కూడా తనకి పదేళ్లప్పుడే చని

(48 వ పేజీ చూడండి)

వేషంలోని మోసం

మే నెల ఎనిమిదో తారీఖు మాకు వేసవి సెలవలు ఇచ్చారు ఎండ తీక్షణంగావుంది బజారులన్నీ నిర్మానుష్యంగా వున్నై

మాగోడ గడియారం ఒకటి కొట్టింది అంటే నాకు అనుమానం వేసింది. అర్ధగంటలు కొట్టే గడియారం అవటంచేత, టైము ఎంత అయిందా అని తలఎత్తి చూచాను. ఒంటిగంటమీద చిన్నముల్లు పన్నెండుమీద పెద్దముల్లు వున్నై

మా నాన్నగారు భోంచేసి ఆరోజు దినపత్రిక చదువుతున్నారు మాఅమ్మ వంటగది వదిలి బయటకు రాలేదు యింకా ఏవో సర్దుతూనే వుంది

“శ్రీరామ .. సీతక్క . తోకన్నా కుట్టుదేవన్నా. బద్రాచల రామన్నా కొండగోపన్నా . కుట్టు దేవన్నా” బయటనుండి కేక వినిపించింది

మా లక్ష్మి వచ్చి ‘ఎవరురా అన్నా?’ అని అడిగింది

“కోయవాడ”న్నాను

తలుపు నెట్టుకొని లోపలికివచ్చి “శ్రీరామ సీతక్క, కుట్టు దేవన్నా” అంటూ మధ్య గదిలోకి వచ్చి కూర్చున్నాడు

మాఅమ్మకు కోపం వచ్చింది. “ముష్టికి వేళాపాళా లేదూ వెళ్ళు వెళ్ళు” అంటూ లోపలినుండి కసిరింది

“అమ్మగారు మంచి కోపంలో వున్నారులే మాంచి. .అమ్మగారికి మాంచి అదృష్టరేఖ వుండాదిలే ” నాకు కోపం నవ్వు వక్కసారిగా వచ్చినై నేరుగా లోపలికివచ్చి, కదలకుండా తిష్టవేసి, నేర్పుగా మాట్లాడ్తున్నాడు

“ఏయ్' ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావు?” అన్నాను కాస్త ఘుర్జింపు గొంతుతో

శ్రీ పేటేటి

నారాయణ లోకహాస్య

“కోయదొర వచ్చినాడులే, అన్నా కోయదొర చుట్ట కాల్చుకొని వెళ్తాడులే” తెచ్చినమూటలో నుంచి పుగాకు కాడ తీసి ఈనతీస్తూ అన్నాడు

“ఎండ జాస్తిగా వుండాదిలే, చుట్ట కాల్చుకొని వెళ్తాను ఏం పుగాకులే అన్నా మీ తావున దొరికేది నప్ప నప్పగ వుంటాది మా దేశాన పుగాకు తాగినామంటే కైపెక్కి పోవాలిలే అన్నా, కైపు కొంచెం నువ్వు పెట్టు అన్నా ”

వీడి సంభాషణ ధోరణి చూచి నాకు కోపంవచ్చింది “నిప్పు లేదూ ఏమీ లేదూ నడూ బయటకు” అన్నాను

“వుండ్రా అన్నా, ఈవేషం మాటలూ చూస్తుంటే నవ్వు వస్తోంది” అన్నది మాలక్ష్మి

“మా కాడికి వస్తే మంచి మర్యాద చేస్తాములే వెదురు బియ్యం పుట్టతేనె యిచ్చి మాంచి సంతృప్తి చేస్తాములే, బద్రాచల రామన్నా. కొండ గోపన్నా. కుట్టుదేవన్నా నాలుగు మంచి మాటలు చెప్తానులే మంచి మాటలు”

ఆమాటలు అంటూ వుంటే మా లక్ష్మి వాడిదగ్గరకువచ్చికూర్చుంది. నేనూ వెళ్ళి మరోప్రక్క కూర్చున్నాను

“పెద్దపెద్ద చదువు చదివీ మీరు పెద్ద వుద్యోగాలు చేస్తారులే పరీక్షలు రాసి వచ్చినారు కాని గుడబిడ మంటూంది మనస్సులో. పరీక్ష అవతారా లేదని భయపడాల్సినదేమి లేదులే, పేసాతారు”

చెయ్యి చూడకుండానే కో[illegible] వాడు చెప్పిన మాటలు నాకూ లక్ష్మికి కాస్తంత వుత్సాహాన్ని కలిగించినై

“మా చెల్లెలు సంగతి చెప్పు” అన్నాను

“సీతక్క కూడ పేసు అవ్తాది కాని, అమ్మగారు యి[illegible] ఏడుతో యింటోనే కూకుంటారు. బయటకు వెళ్ళటానికి వీలుపడదులే వీలు. ఏమి చదివినా యింతవరకే చదువు అమ్మాయికి రామ[illegible] లాంటి వాడు దొరుకుతాడు తాళి కట్టేవాడు ఎవర్ని లెక్క సేయదులే ఎప్పుడూ ముక్కుమీద కోపం వుంటాదిలే అమ్మాయికి”

ఈ మాటలకు లక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ యింట్లోకి వెళ్ళి యీ సంగతులన్నీ అమ్మకు చెప్పి, అమ్మను వెంట బెట్టుకొని వచ్చింది.

"అమ్మగారు అదృష్ట వంతులు లే, అమ్మగారి సేతిన అదృష్టరేఖ వుండాది. అమ్మాయికి యీ ఏడులో పెళ్ళి అవుతుందని చెప్పినాను లే, రామన్న లాంటి చక్కటివాడు దొరుకుతాడు లే అమ్మగారు వొళ్ళు దాయకుండా పని సేస్తారు పని. ఏడు కొండల సామివున్నె పంగనామాలసామి కొండకి వెళ్ళాలి వెళ్ళాలి అనుకుంటారు గాని వెళ్ళలేకపోతారు. ఈఏడు పెళ్ళిఅయిన తర్వాత వెళ్తారు లే. అమ్మగారికి నాలుగు మంచిమాటలు చెప్పి వెళ్తామని వచ్చినాను లె. శ్రీరామ...సీతక్క... తోకన్నా...కుట్టుదేవన్నా. అమ్మగారికి సంతానం రెండు పెట్టలు ఒక పుంజు. పెద్దపెట్ట వున్నె పెట్ట, పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయింది లే వాళ్ళయింటికి. అమ్మగారు మాట దాయ లేదు లే. ఏదైనామాట చెప్తే అమ్మగారినోట దాగదు లే మాట"

నేనూ లక్ష్మి అమ్మ వంక చూచాం. నవ్వుతూ వుండండ్రా అంటూ తిరిగి కోయవాడికేసి చూచింది.



చెతిలోని గోకుడుపార పక్కని పెట్టి నెత్తిన ఒక్కటిచ్చారు నాన్నగారు.

కోయవాడు కనుబొమ్మలు పైకెత్తి "కోపం వస్తాదేమో వున్న మాట చెప్తాను లే, కొండకు వెళ్ళి వచ్చిన తర్వాత పుంజు పుట్టాడు కాని తోకయ్య పేరుపెట్టమ్మా, కోయన్న ఏమో చెప్పినారు లే అని మర్చిపోబోకమ్మ, తోకయ్య తెల్సుగా తోకయ్య"

"అయ్యగారు వుద్యోగం చేస్తున్నారే, పెద్ద పేరులోకి వెల్తారు లే. దుడ్డువున్నె దుడ్డు ఎక్కువగా తెస్తారు లే అమ్మా. బద్రాచల రామన్నా...కొండ గోపన్నా... కుట్టుదేవన్నా" అంటూ ముగించాడు.

మాసాన్న అప్పుడే పోగది

వేషంలోని మోసం

లోపలికి వచ్చాడు "ఏమిట్రా యిదంతా ఒకటే గోల" అంటూ.

"నాన్నా మరే మరి వున్నవి వున్నట్లు చెప్పాడు" అంది లక్ష్మి.

"అవునండి మీకు ప్రమోషన్ వస్తుందట" - మా నాన్న వంక చూస్తూ చిరునవ్వు నవ్వుతూ చెప్పింది అమ్మ.

"మరే నాన్నా నాకు తమ్ముడు పుడతాడట" అన్నాను నేను.

"ఏడ్చేవులేరా వెధవా" అంటూ నెత్తిన ఒకటిచ్చారు.

"అవును నాన్నా అతనే చెప్పాడు" అంది అమ్మదగ్గరకు వెళ్తూ లక్ష్మి.

"అయ్యగారు శాంతమూర్తులు. ఎవరికన్నా సహాయం చేయగలిగి వుంటే చేస్తారుగాని హాని చేయరు లే. వుద్యోగంలో పెద్దపేరు గడిస్తారు" డబ్బు ఎక్కువ యిస్తారులే. పంగనామాలసామిని చూస్తారులే కొద్ది రోజుల్లో. మనం మాటసెప్పినా మంటే తిరుగుండదు లేదొరా. శ్రీరామ, సీతక్క, తోకయ్య, కుట్టిదేవన్నా అయ్యగారికి రాత్రిళ్ళు సరిగా నిద్ర పట్టదు లే నిద్ర. నిద్రలో తుళ్ళి పడిలేస్తారు లే. మిమ్మల్ని గ్రహం పీడిస్తోంది. తాయెత్తు యిస్తానులే దొర. మూలికల మందు యిస్తాను మూడు రోజులు వుపవాసమున్నారంటే సుఖ్ఖా పెట్టి నిద్రపోతారులే" అన్నాడు జోబిలో చెయ్యిపెట్టా.

"సినుందులూ మాకులూ మాకేమీ అక్కరలేదు కాని ఈ పావలా తీసుకొని బయటకు నడు" అన్నారు. పావలా అందిస్తూ నాన్న.

పావలా తీసి చెవులో పెట్టి శ్రీరామ...సీతక్క...తోకయ్య...కుట్టి దేవన్నా భద్రాచల రామన్నా...కొండ గోపన్నా కుట్టి దేవన్నా. వస్తానురా బాబా" అన్నాడు కోయవాడు నావంక చూస్తూ.

నాకు కాస్త అనుమానం వేసింది. వీడు మా మామయ్య కొడుకు రమేష్ కాదు కదా అని. ఎత్తూ, లావూ అంతా అదే; గొంతూ అదే.

కట్టిన వేషం తీసివేస్తూ "ఎలా వుందిరా వేషం" అన్నాడు రమేష్.

"అమ్మా! అమ్మా రమేష్ బావే, కోయవాడు కాదే, నాన్నా, నాన్నా రమేష్ బావ వేషం వేసుకొచ్చి యింత నాటకం ఆడాడు" అంది పెద్దగా లక్ష్మి.

"ఆరి వెధవా, అందరినీ మరిపించావురా" అంటూ విస్తుపోయారు నాన్న.

"ఎవరూ రమేశా! వెధవా నీకు యివేం బుద్ధులురా" అంటూ గదిలోంచి వచ్చింది మా అమ్మ.

"అవును కాదు మామయ్యా. రేపు స్కూలు వార్షికోత్సవంలో ఫాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో నేనూ పాల్గొంటానని పేరు యిచ్చాను. ఎలా వుంటుందో వేషం వేసుకు వచ్చాను. ఎలావుంది వేషం? రేపు ప్రైజు రావచ్చు నంటారా?" అన్నాడు రమేష్.

"ఇంకా ఎవరెవరు వేస్తున్నారు రా?" వుత్సాహంతో అడిగాను.

"ఒకరితోటి నాకెందుకోయ్. నేను కోయవాని వేషం, విధవావిడ వేషం వేస్తాను" అన్నాడు రమేష్.

"విధవముండ వేషం ఏమిట్రా వెధవా" అన్నారు నాన్న.

"అదే బావుంటుంది లే మామయ్యా! చూస్తావుగా" అంటూ వెళ్ళిపోయాడు.

"ఏం వేషాలో పాడువేషాలు" అన్నారు నాన్న.

"వస్తైతే నేమండీ కొత్తగా ప్రైజు తేవాలి" అన్నాను నేను.

ఒక పల్లెటూరి బడిలో ఒక విద్యార్థికి అ, ఆలు, గుణింతాలు వగైరా పూర్తి యాయి. నాలుగక్షరముల మాటలు చెప్తున్నారు...

పంతులు గారు: "వకు" ఏత్వమిస్తే "వె," "వె" కు దీర్ఘమిస్తే వే.

విద్యార్థి: "వే"...

పం: "ష"...

వి: "ష"...

వి: "వేష"...

పం: "చ"కు ఏత్వ మిస్తే "చె"...

వి: "చె"...

పం: "ట" కు కొమ్మునిస్తే "టు", "టు"కు ఒత్తునిస్తే "ట్టు"

వి: "ట్టు"...,

పం: మొత్తమంతయు కలిపి "వేషచెట్టు"...,

వి: ఓస్! యేషసెట్టునా? ...ఇంకేలో అనుకొన్నా" ...

ఎస్. ఎల్. రావు, మద్రాసు.

అప్పటికి ఆవిషయాన్ని గురించి చర్చ సద్దుమణిగి పోయింది.

ఆరోజు సాయింత్రం రేడియో ట్యూను వేసి కూర్చున్నాను. సిలోన్ స్టేషన్ రికార్డులు వినిపిస్తున్నాయి. మాఅమ్మ అప్పుడే దీపం వెలిగించి లోనికి వెళ్ళింది.

"సుందరమ్మగారు లేరబ్బాయి?" అని నెత్తిన ముసుగువేసుకున్న ఒక వితంతువు వచ్చి అడిగింది.

"దొడ్లో వుంది వెళ్ళండి" అన్నాను.

ఇంతలో చటుక్కున గుర్తు వచ్చి "అరి వెధవా ఎంతలో వేశావు! అన్ని వేషాలకీ సరిపోతావురా! అరే ఆ నడక ఎప్పుడు నేర్చుకున్నావురా?" అంటూ వెంబడించాను.

ముసుగులో వాడు గొణుక్కుంటున్నట్లు వినిపించింది "సుందరమ్మగారూ! నాలుగు కరివేపాకు రెమ్మలు కోసియిస్తారూ" అంటూ చెట్టుక్రిందకు వెళ్ళాడు.

పాదులు బాగుచేస్తున్న మా నాన్నగారు చూశారు. "ఊహూ యింకేం ఆవేషమూ వేసుకొచ్చా! వెధవ వేషాలు ఎప్పుడూనూ. వేళా పాళా లేదూ" అంటూ చేతిలోని దోకుడుపార పక్కనిపెట్టి నెత్తిన ఒక్కటిచ్చారు నాన్నగారు.

"ఇంకొక్కటి యింకొక్కటి" అన్నాను.

ముసుగులోని మనిషి విస్తుపోయింది. ఆమెకు యిదేం అర్థం కాలేదు" యిదేమండోయ్ యిలా కొడ్తున్నారు?" అంటూ వెనక్కు వెనక్కు వెళ్ళింది.

నేను చూసి "సూర్యనారాయణ రావుగారి తల్లి నాన్నా" అన్నాను.

"ఆఁ" అన్నారునాన్న నిర్ఘాంతపోయి.

ఈహాంగామాకు యింట్లో వంట చేసుకొంటున్న మా అమ్మ వచ్చింది.

"ఏదో చూడలేదండీ, పొరపాటు జరిగిపోయింది. ఏమీ అనుకోకండీ. ఆకుఱ్ఱవెధవలు వేసిన వేషం అనుకున్నాను. వేరే భావించకండీ" అంటూ ప్రాధేయపడ్తున్నారు నాన్న.

రవణమ్మకు ఏమీ అర్థంకాక అలాగే స్తంభించిపోయి చూస్తూ ఊరుకుంది.

ప్రొద్దుట జరిగిన నాటకం అంతా రవణమ్మకు చెప్పి "పిల్లలని అలా చెయ్యి చేసుకున్నారు కాని మీలాంటి పెద్దవాళ్ళను అలా చెయ్యి చేసుకుంటారా? వారికి ఆమాత్రం తెలియదూ" అంటూ సర్ది చెప్పింది అమ్మ.

"వారుమాత్రం ఏం చేశారు లేండి. ఈరోజుల్లో పిల్లలు మరీమితిమీరిపోతున్నారు" అంటూ యింటికి దారితీసింది రవణమ్మ. ★

చిరిగిన బట్టలు, నలగని దుస్తులు

(21-వ పేజీ తరువాయి)

తప్పక......' అని ఇంకా ఏదో అనబోతూన్న మధుని వినిపించుకోకుండానే కమీషనరు, 'ఇహ మీరు వెళ్ళండి' అన్నాడు. అంటూ ఆయన ఏవో కాగితాలలో తల దూర్చాడు. మధు పెదవి ఆ.దేమిటో అదోలా వణకింది. అతని నాలుక ఏదో చెప్పబోయి నోటిలోనే అర్థరహితంగా కదలి ఊరుకుంది. అతని నుదురు చెమర్చింది. అతని కళ్లముందు కిళ్ళీ కొట్టువాడు 'హీహీహీ'అని ఏదో అంటూన్నట్టు ఓ సినిమాబొమ్మ నిలచింది. మధు మెల్లగా, 'సార్'అన్నాడు కమీషనరుగారి ముందుకు దీనంగా వంగి. కమీషనరుగారు ఇదంతా గొడవగా ఉందే అనుకుంటూ 'నాగయ్యా వీరిని బయటకు తీసుకెళ్ళు' అన్నారు, టేబిలుమీద ఉన్న గంట మ్రోగించి, తల ఎత్తకుండానే.

మధు మొగం పాపం వికృతంగా మారిపోయింది. అతనికి తెలియకుండానే పళ్ళు పటపట లాడాయి. బయటకు స్నేహితుడున్న చోటికి ఎలా నడచివచ్చాడో చెప్పలేం. ఆ మిత్రుని దగ్గఱకు వచ్చేప్పటికి అతని నోటినుండి ఎన్ని రకాల తిట్లు బయటపడ్డాయో అంతకన్నా చెప్పలేం. పది నిమిషాలవరకూ స్నేహితునితో ఏ సంగతీ మాట్లాడలేకపోయాడు. అతి కష్టం మీద జరిగిన సంగతి అనేక బూతుల కలయికతో అతని నోటినుంచి బయట పడేప్పటికి చాల టైము తీసుకుంది.

ఇదంతా విని ఆ స్నేహితుడు మధు కష్టాన్ని ఏమాత్రం గుర్తించకుండా పకపకా నవ్వడం మొదలుపెట్టాడు. మధు, మిత్రునివైపు వింతగా చూసి, "ఎందుకురా నవ్వుతావు' అన్నాడు. ఆ చెలికాడు కాస్సేపు జవాబు చెప్పలేదు. కాని చివరికి చెప్పేశాడు. 'అబ్బే ఏమీ లేదు... చిరిగిన బట్టలకు, నలగని దుస్తులకు తేడా ఏమిటా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు.

మధుకు ఓ పట్టాన అర్థం కాలేదు. అంచాత 'అం.టే?' అన్నాడు. దానికా మిత్రుడు, "అబ్బే ఏమీలేదు. ఆ బిచ్చగానికీ, బియ్యే చదివిన నీకూ దుస్తుల్లో తప్ప తేడా ఎందులో ఉన్నదా అని. చదువులేని ఆ ముదుసలి బిచ్చగానికన్నా హీనంగా దిగజారిపోయిన నీ సంస్కారానికి ఏడవాలో నవ్వాలో బోధపడటంలేదు. ఆ తిట్లవల్ల నీకు ఒరిగేదేమిటో నాకంతకన్నా అవగాహన కావడంలేదు"

ఇలా అనేసరికి మధు నిశ్చేష్టుడై అలాగే శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు పాపం! ★

అల్పబుద్ధి

బంగారపు టుయ్యాలలో మహారాజు పవళించి ఉన్నారు. దాన దాసీలు వింజామరలతో విసురుతూ, ఉయ్యాల వూపుతున్నారు. మహారాజుగారికి కొద్దికొద్దిగా నిద్రాదేవి ఆవహిస్తోంది. ఇంతలో బంగారపు టుయ్యాల వెండి గొలుసు మీద పెంపుడు చిలుక ఒకటి వాలింది. "ఉంగరం, ఉగరం వజ్రపు టుంగరం" అంటూ పాట, ప్రారంభించింది. ఎంతసేపటికి ఆపకుండా పాడుతూనేవుంది. చుట్టూ వున్న దాసీలు దాన్ని తరిమారు. అదిపోలేదు. ఒక గొలుసుమీద నుంచి మరొక గొలుసుపైకి ఎగిరి వాలుతూ మరింత గోలచేయడం ప్రారంభించింది.

మహారాజుగారు నిద్ర భంగమయిందని ఆగ్రహంతో లేచారు." "ఛీ ఏమిటి"దని ఒకదాసీ నడిగారు.

"మహా ప్రభూ! చిలుకకు ఒక వజ్రపుటుంగరం దొరికింది, గోల చేస్తోంది" అని దాసీలు మనవి చేశారు.

"ఛీ పాడుచిలుక నానిద్ర చెడగొట్టింది. ఆఉంగరం లాక్కోండి" అని రాజావారు ఆజ్ఞయిచ్చారు.

దాసీలంతా భగీరథ ప్రయత్నాలు చేసి చిలుకని పట్టుకుని ఉంగరం లాక్కున్నారు.

చిలుక మళ్ళీ ఉయ్యాల గొళ్లెం మీద చేరి మళ్లీ పాట ప్రారంభించింది. "రాజాగారికి గతిలేక, నా ఉంగరం లాక్కున్నారో" అని రొదచేయసాగింది. రాజాగారికి శివమెత్తినట్లయింది. "దాని ఉంగరం పారయెండిరా. హాయ గోల" అన్నారు. దాసీలు ఉంగరం చిలుకకు ఇచ్చివేశారు.

శ్రీమతి సరోజ

చిలుక సంతోషంతో గంతులేసింది. "మహారాజుగారు, నా తడాఖాచూసి భయపడి నాఉంగరం నాకిచ్చేశారు. గతిలేక నాఉంగరం తీసుకున్నారు. హడలెత్తి అవతల పారేశారే" అని పాట ప్రారంభించింది.

ఈసారి రాజాగారు నిస్పృహతో లేచి కూర్చున్నారు. చిలుక మరింత బిగ్గరగా పాడుతూనేవుంది. రాజాగారికి ఈ మారు నవ్వు వచ్చింది. ఇంతలో తెర ఆవలినుంచి ఫకాలున నవ్వు వినిపించింది. చిలుక తెరలోకి వెళ్ళిపోయింది.

కొద్దిసేపటిలో రాణీగారు చిలుకను చేతిపై నెక్కించుకుని ముద్దులు కురిపిస్తూ తూగుటుయ్యాలవద్దకు వచ్చారు. రాజాగారి ప్రక్కన ఆసీనులయ్యారు. రాజాగారు ఆశ్చర్యంగా మహారాణీవైపు చూచారు.

"ఆరోజు మీరు, నన్ను ఒక ప్రశ్న వేశారు. జ్ఞాపకం వుందా? అల్పులను, జయించడం కష్టమా, గొప్పవారిని జయించడం కష్టమా అని? "దానికి నేనేమి సమాధానం చెప్పలేదు కదూ. అందుకే ఇప్పుడు సమాధానం చెప్పించాను" అంటూ రాణీగారు పకపకనవ్వింది.

"నిజమే, అల్పుల అల్పబుద్ధిని, జయించలేం" అన్నారు రాజాగారు. "మాచిలుక మా మంచి చిలుక" అంటూ రాణీగారు, చిలుకను గారాబుచేశారు. చిలుక మురిసిపోతూ ఉంగరం రాజాగారి మీద పడేసి, "అల్పబుద్ధి అంటే అదేనోయ్" అంటూ రాణీగారి అంతఃపురంలోకి పారిపోయింది. రాజాగారు, రాణీ చమత్కారానికి, చిలుక సాహసానికి మెచ్చుకున్నారు. రాణీగారు నవ్వుకుంటూ తన చిట్టిచిలుకదగ్గరకు దారితీశారు. ★

★ ముచ్చటగా ముగ్గురు ★

(38 వ పేజీ తరువాయి)

అంతా వూడదీస్తారు: కాని అప్పటికి వీళ్లపడవ నీళ్లల్లో చాలాదూరం కొట్టుకుపోయి అడ్డుకట్టమీదగా దొర్లిపడి, ముక్కలు ముక్కలుగా బద్దలైపోయే స్థితికి వస్తుంది.

ఇదంతా నేనేమీ వుబుసుపోక కోసం కల్పించి చెప్పటంలేదు. నాఎరికలో యిలాంటి ఘట్టంఒకసారి జరిగింది. ఒకరోజు వుదయం మేము కొంతమందిమి పడవలో ప్రయాణం చేస్తున్నాము. ఈదురుగాలి జోరుగా వీస్తున్న ఆసమయంలో మాపడవ 'ఖాపెనీ' [illegible], నీటివాలులో కొట్టుకు వస్తున్నది. నది అక్కడ కొంచెం మలుపు తిరుగుతుంది. మాపడవ సరిగ్గా అక్కడికి వచ్చేసమయానికి, గట్టుమీద యిద్దరు మనుష్యులు కనిపించారు. ఆక్షణంలో వాళ్లిద్దరి మొఖాల మీద కనిపించినంతటి నిస్పృహ మరెన్నడూ ఎవరి మొఖంలోనూ నేను చూడలేదు. కారణం ఏమిటై వుంటుందా అని వాళ్లకేసి పరీక్షగా చూశాను. వాళ్ల చేతుల్లో పెద్దపడవ తాడుఒకటి వేళ్లాడుతోంది: దాన్ని బట్టే గ్రహించాను — వాళ్లకేదో పెద్ద ఆపదేవచ్చి వుంటుందని. మాపడవ వేగాన్ని కొంచెం తగ్గించి సంగతేమిటని వాళ్లను అడిగాను.

"మా పడవ కాస్తా కొట్టుకుపోయిందండి. ఈదిక్కుమాలిన తాడు చిక్కుపడిపోతే, దాన్ని సరిచేసుకొందామని మేము యిద్దరమూ పడవలోంచి దిగాము. తాడు సరిచేసుకొని వెనక్కి తిరిగి చూసే సరికి పడవే మటుమాయమై పోయింది!" అన్నారు వాళ్లు యిద్దరు.

తాముభయులూ యిలా పరాకుగా వున్నప్పుడు తమని ఆవెధవబోటు అంత మోసంచేసి తప్పించుకు పోయినందుకు వాళ్లు చాలా నొచ్చుకొంటున్నట్లు కనిపించారు.

వాళ్లకంట్లో దుమ్ముచల్లి పారిపోయిన ఆబోటు మాకు ఆతరువాత ఒక అరమైలు దూరంలో అవుపించింది. అక్కడ ఏవోదుబ్బులు దానికి అడ్డంవచ్చి, నిలబడిపోయింది. వాళ్లమీది జాలికొద్దీ, ఆబోటుని మేము పట్టితెచ్చి, వాళ్లకు అప్పగించి, మాదారిని మేము వచ్చేశాం. ఆదిక్కుమాలిన బోటు యిలా మళ్ళీ ఎక్కడ తమకళ్లు గప్పి తప్పించుకుపోతుందోనని వాళ్లు ఆతరువాత వారంరోజులు దాకా నదిలో వదిలి పెట్టి వుండరు.

కాని ఆరోజు బోటుకోసం బెంగ పడిపోయి వాళ్లు గట్టుమీద అటూ యిటూ కంగారుగా తిరుగుతున్న ఆదృశ్యంమాత్రం నాకు ఎన్నటికీ మరుపురాదు.

నది వొడ్డున నడుస్తుంటే పడవలాగే వాళ్లవింత చర్యలు ఎన్నో మనకంటపడతాయి. అతి సామాన్యంగా ఎదురయ్యే దృశ్యం ఏమిటంటే—పడవలాగే వాళ్లు యిద్దరు ఏదో బిగ్గరగా వాదించుకొంటూ, అతి వేగంగా నడుస్తూ వుంటారు. వాళ్లకి వెనకాల వంద గజాల దూరంలో పడవ ఒకటి నీటిలో కొట్టుకు వస్తుంటుంది. అందులోవుండే వ్యక్తి ఒకచేత్తో చుక్కాని పట్టుకొని రెండోచేత్తో తల బాదుకొంటూ వీళ్లని వుద్దేశించి ఏమిటేమిటో అరుస్తుంటాడు. పడవలో వున్నవాడికి ఏదో జరిగివుంటుంది! తెడ్డు కర్ర వూడివచ్చేసి వుండవచ్చు: లేదా బోటుమేకు నీళ్లల్లో పడిపోయి వుండవచ్చు: అదీ కాకపోతే—వాడి నెత్తి మీది టోపీ గాలికి ఎగిరిపోయి వుండవచ్చు: ఏదైనా జరిగివుండవచ్చు. అంచేతనే వాడు అంత బిగ్గరగా అరుస్తూ పడవ ఆపమని గోల పెడుతుంటాడు. వీళ్లు వినిపించుకోరు. వాడికి చిరాకు వేస్తుంది.

"మీచెవుల్లో సీసం వుందేరా? పిలుస్తుంటే వినిపించుకోరేం?" అని మళ్లీ అరుస్తాడు. వీళ్లు యీసారీ వినిపించుకోరు. వాడికి మరీ వొళ్లు మండుకుపోతుంది. "ఆగండిరోయ్!" అని ఒక్కకేక పెడతాడు. వీళ్లు అదీ వినిపించుకోరు. అంతటితో వాడికి నిజంగా పిచ్చెక్కిపోతుంది. బోటులోనే గంతులేస్తాడు. ఒంటికాలిమీద నాట్యమాడుతాడు. మొఖమంతా కందగడ్డలా జేవురించేవరకు, కంఠ నాళాలు బద్దలైపోయే వరకు ఘీంకరిస్తాడు. జ్ఞాపకంవచ్చిన ప్రతి మనిషినీ పట్టుకుని శాపనార్థాలు పెడతాడు. వీడు చేసే యీ చేష్టలమూలంగా నదిగట్టుమీద గొడ్లను కాచుకొనే

★ ముచ్చటగా ముగ్గురు ★

పిల్లమూక అంతా వీడివంకే కన్ను ఆర్పకుండా చూసి చూసి, చివరికి చేతికొద్దీ వాడిమీదికి రాళ్లు విసురుతారు. ఈరాళ్లవానలో నుంచీ తప్పించుకోనూ లేక, పడవలోంచి బయటకి దూకెయ్యనూ లేక వాడుపెట్టే గోలకి అంతు అంటూ వుండదు.

పడవలాగే బుద్ధిమంతులు, ఆపని చేస్తున్నంతసేపూ తాము లాగుతున్నది పడవననే విషయాన్ని మరచిపోకుండా, అప్పుడప్పుడూ కాస్త వెనక్కితిరిగి పడవ కూడావస్తున్నదో లేదో సరిచూసుకొంటూ వుంటే, యిలాంటి అవస్తలు ఎవరికీరావు. అదీకాక పడవ లాగేపని ఒక్కడు చేస్తేనే మంచిది: యిద్దరు చేరారంటే, యిద్దరూ కలిసి బాతాఖానీలో పడిపోయి పడవసంగతే మరచిపోవటం తప్పనిసరిగా జరుగుతుంది, పోనీ — ఆపడవలకైనా, అటువంటి పరిస్థితులలో వాళ్లకు చేస్తున్నపని జ్ఞాపకం చేసేటంత శక్తి సామర్థ్యాలు వుంటాయా అంటే, అదీలేదు.

పడవలాగే పనిలో యిద్దరు చేరినప్పుడు, వాళ్లిద్దరూ కలిసి పడవమాట ఎంతబాగా మరచిపోగలరో వివరిస్తూ జార్జిగాడు ఒకనాటి సాయంకాలం మాకు యీకింది కథ వుదాహరణగా చెప్పాడు.

వాడు, మరి ముగ్గురూ కలిసి ఒకరోజు సాయంకాలం 'మెయిడెన్ హెడ్' నుంచీ పడవనిండా సరుకు ఏదో వేయించుకొని వెళ్లుతున్నారట. వాళ్లపడవ 'కాక్‌హామ్' లాకుదాటి కొంచెం ఎగువకి పోయేసరికి అక్కడ, కాలిబాట వెంట ఒకఆడదీ ఒక మొగవాడు నడిచి వస్తూవుండటం వీళ్లకంటబడిందట. వాళ్ల వాలకాన్ని బట్టి చూస్తే యిద్దరూకూడా ఏదో చాలా హుషారైన విషయాన్ని గురించి మాట్లాడుకొంటూ అందులో పడిపోయి బయటి ప్రపంచం విషయమే మరచిపోయివున్నట్లు కనిపించారట. వాళ్ల చేతుల్లో ఒక పెద్ద యినపకొక్కెమూ, దానికి తగిలించి పెద్ద పడవతాడూ వున్నాయట. పడవతాడైతే వున్నది కానీ, ఆతాడు ఏపడవకీ కట్టివున్నట్లు తోచలేదట. ఆతాడుకి రెండో కొనమాత్రం నీటిలో తేలుకొంటూ వీళ్ల వెనకాలే వస్తున్నదట. కనుచూపు మేరదూరంలో ఎక్కడా విడిగా బోటుఅనేది ఏదీ లేకపోయినా, యీజంట యీడ్చుకువస్తున్న తాడు అంతకుముందు ఏదో ఒక పడవకి కట్టబడినదై వుండటం మాత్ర నిశ్చయం. మరి అంతలో ఆబోటు ఏమైందో. ఆబోటులో ఎవరైనా ప్రయాణీకులు వుంటే వాళ్లగతి ఏమైందో అంతా అయోమయంగా వుంది. ఏం ప్రమాదం జరిగిందో ఏమో? ఏప్రమాదం జరిగినా, అందువల్ల యీజంట ఏవిధమైన అంతరాయాన్నీ పొందలేదని మాత్రం తేటతెల్లమైంది. వాళ్ల చేతుల్లో యినపకొక్కెం వుంది: ఆకొక్కెనికి తాడు తగిలించి వుంది. వాళ్లకు కావలసింది అంతవరకే కాబోలు!

వాళ్లని ఆ అపస్మార దశలోనుంచి తట్టిలేపుదామనుకొంటూ వుండగా మా జార్జిగాడికి బలే ఆలోచన ఒకటి బుర్రలో చటుక్కున మెరిసిందట. ఆపని చేయటం మానేసి, వాళ్లు యీడ్చుకుపోతున్న తాడు తాలూకు రెండోకొనని పట్టి వుచ్చు వ[illegible] మాట్లాడకుండా తను ఎక్కివున్న బోటుకి తగిలించేసి, అంతవరకూ వీళ్లపడవ లాగుతున్నవాళ్లతో సహా అందరూ పడవలోకి ఎక్కికూర్చుని పైపులు వెలిగించారట.

వీళ్లు యింతపని చేసినా కబుర్ల సందడిలో పడిన ఆజంట, అదేమీ గమనించకుండా యింత బరువైన బోటునీ 'మార్లో' దాకా యీడ్చుకుపోయాక కాని తెలివితెచ్చుకోలేదట.

'మార్లో' లాకు దాకా, అంటే దాదాపు రెండుమైళ్ల దూరం తమదికాని బోటు ఏదో తాముభయులు అనవసరంగా యింత కష్టపడి, యీడ్చుకొచ్చామని వాళ్లకి తెలిసిరాగానే మాత్రం, వాళ్ల మొఖాల్లో కనిపించినంత విచారభావం, తన జన్మలో తానెక్కడా చూడలేదని జార్జి అన్నాడు. అందమైన ఆ ఆడపిల్లపక్కన వుండబట్టిగానీ, లేకపోతే ఆ మొగాడు తనకి జరిగిన అన్యాయానికి ఎంతెంత లావు బండబూతులు దొర్లించేవాడో చెప్పలేనని కూడా జార్జి అన్నాడు.

అందులోనూ ఆ ఆడపిల్లే ముందుగా తెప్పరిల్లి గుండెలు బాదుకొని "బోటులో ఎక్కిన అత్తయ్య ఏమైపోయింది, హెన్రీ?" అని లబోమని ఏడ్చేసిందట.

పాపం, వాళ్లకి ఆ అత్తయ్య తరువాత అయినా దొరికిందా?" అని హారిస్సు అడిగాడు.

అదేమో తనకు తెలియదని జార్జి సమాధానం చెప్పాడు.

(ఇంకా వుంది)

'కడపటి క్షణాలు'

(35-వ పేజీ తరువాయి)

పోయింది. కాని ఆమె పగటిచుక్కకు బాగా జ్ఞాపకం ఉంది "మాఅమ్మ నన్ను ప్రేమతోనూ దయతోనూ చూసేది. ఆమె నాచిన్నతనంలో చనిపోకుండా ఇంకా కొంతకాలం బ్రతికిఉంటే నాజీవితం బందిపోటు దొంగతనాలలోగాక మరొక మార్గంలో వెళ్లిఉండేదేమో" అనుకున్నాడు పగటి చుక్క.

వాడు తల్లినిగూర్చి ఆలోచించుకుంటూంటే చిన్ననాటి సంగతి ఒకటి జ్ఞాపకంవచ్చింది. ఒకనాడు వాడూ పక్కింటి కుర్రవాడూ తమతమ మట్టి ఏనుగులను తెచ్చుకుని ఆడుకుంటున్నారు. ఆటలో పక్కింటి కుర్రవాడి కాలిక్రిందపడి తన యేనుగతొండం విరిగిపోయింది. తను కోపంతో ప్రక్కింటి కుర్రవాని బొమ్మను తీసి దాని తొండాన్ని కూడా విరిచెయ్యబోయాడు. అప్పుడు లోపలనుండి తల్లి వచ్చి, "వాడిబొమ్మ విరిచేస్తే, నీబొమ్మ బాగుపడుతుందిట్రా నాయనా? వాడిబొమ్మను వాడికిచ్చెయ్యి" అని ఇప్పించేసింది.

ఆచిన్ననాటి సంగతిని ఆలోచించుకుంటూన్న 'పగటిచుక్క'కు "అన్నా" అన్న పిలుపు వినపడింది. "ఎవరు?" అన్నాడు పగటిచుక్క. అతనిముందు ఒకస్త్రీ నిలపడి, "అన్నా, పతిభిక్ష నేడటానికి వచ్చాను. నాభర్త ప్రాణాలు నీ చేతులలో వచ్చాను. నాభర్త ప్రాణాలు నీచేతులలో ఉన్నాయి." అంది.

"న్యాయాధికారి కోడలవా నువ్వు?" అన్నాడు పగటిచుక్క. "ఔను. నా మామగారు తన ధర్మాన్ని నెరవేర్చుకున్నారు. నిన్ను విడిపించటం ఆయన చేతులలో లేదు. నాభర్తను చంపించటంవల్ల నీకేమి లాభం?" అన్నదామె.

పగటిచుక్కకు ఆక్షణంలో తల్లి చిన్ననాడు చెప్పిన ఆమాటలు జ్ఞాప్తి కొచ్చాయి మళ్ళీ. "వాడి బొమ్మవిరిచేస్తే నీబొమ్మ బాగుపడుతుందిట్రా నాయనా? వాడి బొమ్మను వాడి కిచ్చెయ్యి!"

"నిజమే. న్యాయాధికారి కుమారుని ప్రాణాలు తీయిస్తే నాప్రాణాలు నిలపడతాయా? ఆ నిరపరాధిని చంపించటం అర్థంలేనిపని! నాజీవితం వృధాయేఐనా ఈఆఖరి క్షణంలో ఈఘనకార్యం చేస్తాను." అన్న నిశ్చయానికొచ్చి పగటిచుక్క న్యాయాధికారి కోడలితో, "చెల్లెలా, వెళ్లు. , నీభర్త సురక్షితంగా ఇంటికి చేరుకుంటాడు." అని చెప్పి పంపేశాడు.

ఆమె వెళ్లేక 'పగటిచుక్క' తన అనుచరులకు కడసారి ఆజ్ఞను పంపేడు. "న్యాయాధిపతి కుమారుణ్ణి వదిలెయ్యండి. మీరందరూ ఇంక బందిపోటు దొంగతనాలు మానేసి, మీ భుజబలాన్ని దేశసేవలో వినియోగించండి".

ఈ విధంగా 'పగటిచుక్క' తన ఆఖరి క్షణాలలో ఒకప్రాణం నిలపెట్టడమే కాకుండా తన ఐదువందల మంది అనుచరుల జీవితాలనూ బాగుపరచ గలిగేడు.

★



మద్రాసు ఆర్ట్ ప్రొడక్షన్స్ వారి "రోహిణి" లో వృద్ధ జమీందారుగా రంగారావు.



ఆత్మహత్య చేసుకొనడానికి నీటిలో పడిన రోహిణిని జమీందారు పెద్ద కొడుకు రక్షిస్తాడు.

"రోహిణి" లో

మాధురీ దేవి, సహస్రనామం.

★

పుడోవ్కిన్ సిద్ధాంతాలు

సోవియెట్ దర్శకుడు పుడోవ్కిన్ సిద్ధాంతాలు మొదటిసారిగా విన్నవారికి కొంత విచిత్రంగా కనిపిస్తాయి. సామాన్యంగా అనుకునేదానికి విరుద్ధంగా ఉండడంవల్ల ఆ సిద్ధాంతాలు చప్పున అర్థరహితంగా కూడా తోస్తాయి. కాని ఆ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినప్పుడు, అంటే తెరమీద ప్రత్యక్షంగా అనుసరించి చూపినప్పుడు వాటిలో ఉండే శక్తి యాథార్థ్యం గోచరిస్తుంది.

ఉదాహరణకి సినిమా కళలో తారలు ప్రధానం కాదని, దర్శకుడే ముఖ్యుడనీ అంటాడు పుడోవ్కిన్. కాని మన సినిమాలు దర్శకుడిమీదకంటే తారలమీదనే ఎక్కువ ఆధారపడతాయనేది మన అనుభవంలో విషయం.

* * *

1928, 29 ప్రాంతాల్లో అమెరికానుంచి టాకీచిత్రాలు విరివిగా రావడం ప్రారంభించినప్పుడు పాశ్చాత్య విమర్శకులు కొందరు, టాకీల మూలంగా సినిమాకళ పాడైపోతోందని వాపోయారు. కాని పుడోవ్కిన్ సౌండ్ రికార్డింగ్‌ను జాగ్రత్తగా ఉపయోగించుకుంటే సినిమాకళకు కొత్తబలం చేకూరుతుందని అన్నాడు. ఆరోజుల్లో వచ్చే టాకీచిత్రాలు కేవలం ఫొటో తీయబడిన నాటకాలని అతను కూడా విమర్శించాడు. శబ్దగ్రహణాన్ని ఉపయోగించుకునే పద్ధతి అది కాదనీ, మాంటేజ్ పద్ధతిని శబ్దగ్రహణానికి కూడా అన్వయింప చెయ్యడమే సరియైన మార్గమనీ అతడు సిద్ధాంతీకరించాడు. ఈ విషయంలో అతని అభిప్రాయాలు కొన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము.

* * *

"ఏ షాట్ తరవాత ఏ షాట్ వస్తే అనుకున్న 'ఎఫెక్ట్' వస్తుందో కనిపెట్టడం, ఆయా షాట్లను తెరపై ఎంతసేపు చూపించాలి, షాట్లను శీఘ్రగతిలో మార్చాలా, మందగతిలో మార్చాలా మొదలైన 'రిద్మిక్' సమస్యలను పరిష్కరించడం—ఇవే సినిమా దర్శకుడు చెయ్యవలసిన ముఖ్యమైన పనులు; ఇదే దర్శకత్వ కళ. ఈకళనే 'మాంటేజ్' లేక సృజనాత్మకమైన 'ఎడిటింగ్' అని అంటాము. ఈ మాంటేజ్ సహాయంతోనే నేను నటీనటుల నటన మొదలైన క్లిష్ట సమస్యలను పరిష్కరించగలిగాను.

* * *

శబ్దచిత్రాలకు అపారమైన భవిష్యత్తు ఉన్నదని నా నమ్మకం. "శబ్ద చిత్రం" అనే మాటకీ, మామూలుగా వాడబడే "టాకీ చిత్రం" అనే మాటకీ గల వ్యత్యాసం మీరు గుర్తిస్తారనే అనుకుంటున్నాను. టాకీచిత్రాల్లో తెరమీద కనిపించే బొమ్మలు, సంభాషణలు, ఇతర ధ్వనులు చక్కగా సింక్రొనైజ్ అవుతాయి. ఈ చిత్రాలు రంగస్థలంమీది నాటకాలను ఫొటో తీసినట్టే ఉంటాయి గాని అంతకు భిన్నంగా ఉండవు....

తెరమీద మనిషిని చూపించి అతడు పలికే మాటలను పెదవుల కదలికతో సమానంగా సింక్రొనైజ్ చెయ్యడం సిసలైన మార్గం కాదు. అది నాటకాల అనుకరణ మవుతుంది తప్ప సినిమాటిక్ లక్షణం అనిపించుకోదు......

బెర్లిన్‌లో ఒక పత్రికా ప్రతినిధి నన్నడిగాడు: "మీ సైలెంటు చిత్రం 'మదర్'లో చనిపోయిన భర్త శవంమీద పడి అమ్మపాత్ర ఏడుస్తుంది. ఆ ఏడుపును ప్రేక్షకులకు వినిపించగలిగితే ఇంకా ఎక్కువ రసపుష్టి కలిగేది కాదా?" అని.

ఆరోజుల్లో శబ్దగ్రహణం లేదు గాని, ఉంటే ఇలా చేసేవాణ్ణి: మొదటిషాట్‌లో భర్త శవంవద్ద ఆమె కూర్చుని వుంటుంది; చేతులు కడుక్కునే వాష్‌బేసిన్‌లో నీళ్ళు పడుతున్న గలగలశబ్దం వినిపిస్తుంది; తరవాత చనిపోయిన మనిషి తల, తలవద్ద వెలుగుతున్న కొవ్వొత్తి, కనిపించే షాట్



ఈస్టిండియా వారి "పక్కింటి అమ్మాయి" లో పంచపాండవులు: ఆర్. కె. రావు, రేలంగి, ఇమామ్, శ్రీనివాసరావు, తాతాచారి.

వస్తుంది; ఈ షాట్‌లో వినిపిస్తుంది ఎంత ఆపుకున్నా ఆగని ఏడుపుధ్వని.

శబ్దచిత్రం అనేది ఈ మార్గంలోనే సాగాలని నా అభిప్రాయం...

* * *

చలన చిత్రానికి శబ్దాన్ని జోడించడం వల్ల కొత్తగా వచ్చేలాభం ఏమిటి? శబ్దగ్రహణంవల్ల చలనచిత్రానికి ఎక్కువ సహజత్వం కలుగుతుందన్నమాట నిజమే. ఉదాహరణకి, సైలెంటు చిత్రాల్లో పరుగిడుతున్న కారుమాత్రం కనిపించేది. ఇప్పుడు కారుచేసే ధ్వనికూడా వినిపిస్తున్నది. ఇదివరకు మాట్లాడుతున్న మనిషి నోరు తెరవడం, మూయడం మాత్రమే కనిపించేది. ఇప్పుడు అతడు చెప్పే మాటలుకూడా వినిపిస్తున్నాయి. కాని సినిమాలో శబ్దం సాధించదగినది ఇంతకంటే ఎక్కువ వున్నది. కథలోని భావాన్ని వ్యక్తీకరించడానికి బొమ్మ సహాయపడినట్టే, శబ్దంకూడా ఇతోధికంగా సహాయపడాలి. బొమ్మను శబ్దం అనుసరించగూడదు. బొమ్మ ఒక భావం వ్యక్తీకరిస్తే శబ్దం మరొకభావం వ్యక్తీకరించాలి."

ఈ సిద్ధాంతానికి పుడోవ్కిన్ తన తొలి శబ్ద చిత్రం *Deserter* నుంచి ఒక చక్కని ఉదాహరణ ఇచ్చాడు:

"*Deserter* చిత్రం రెండో భాగంలో ముందుగా ఒక పశ్చిమ యూరపియన్ నగర దృశ్యం కనిపిస్తుంది. విశాలమైన వీధులు; ఖరీదైన కార్లు అటూ యిటూ పోతూ వస్తూ వుంటాయి; ఠీవిగా నుంచుని ట్రాఫిక్ పోలీసులు డైరెక్షన్లు ఇస్తూంటారు. ఆదృశ్యం చాలా ప్రశాంతంగా, క్రమబద్ధమైన జీవితాన్ని స్ఫురింపజేస్తూంటుంది. ఈ క్రమబద్ధమైన ప్రశాంతతను భగ్నంచేస్తూ హఠాత్తుగా కార్మికుల ఊరేగింపు ఒకటి దూరం నుంచి దృగ్గోచరమవుతుంది. గుంపుమధ్య ఎత్తుగా కార్మికులజెండా ఎగురుతూంటుంది. ఊరేగింపు సమీపిస్తున్నకొద్దీ రోడ్ల మీద కార్లన్నీ పక్కలకి తొలిగిపోతాయి. ఊరేగింపు అంతకంతకు పెద్దదవుతుంది. కార్మికుల నడకలోను, ముఖాల్లోను వారి దృఢనిశ్చయం వెల్లడవుతుంది. ఈలోగా మన దృష్టి పోలీసులవైపు తిరుగుతుంది. పోలీసులు తొందర తొందరగా సిద్ధం అవుతారు. గుర్రాలూ, లారీలు అన్నీ ఒకచోట చేరుతాయి. సంఘర్షణ తప్పదన్నట్టు కనిపిస్తుంది. మరుక్షణంలో గుర్రాలమీద వున్న పోలీసులు కార్మికులమీదికి దూకుతారు. గుర్రాలు కాళ్లెత్తి కార్మికుల్ని పొడుస్తూంటాయి. కార్మికులు శక్తికొద్దీ ఎదుర్కొంటారు. జెండా వున్నచోట పోరాటం మరీ ముమ్మరంగా వుంటుంది. పోలీసుల చేతుల్లో ఆయుధాలు వుంటాయి కనక ఒక్కొక్కసారి పోలీసులదే విజయం అనిపిస్తూంటుంది; కార్మికుల శక్తి తగ్గిపోతున్నట్టు కనిపిస్తుంది. ఇంతలో కార్మికులు మళ్ళీ విజృంభించి పోలీసులను ఎదుర్కొంటారు. చివరికి వారి జెండాను పోలీసులు లాక్కుని కిందపడేస్తారు. జెండాగుడ్డ పీలికలై పోతుంది. పోలీసులు కార్మికులను అరెస్టు చేస్తూంటారు. వారి ఉద్యమం యావత్తూ దెబ్బతిన్నట్టు కనిపిస్తుంది. కార్మికులు మళ్ళీ కోలుకోలేరనిపిస్తుంది. ఇందాకటి ఉత్సాహం, పోరాటం అన్నీ అణగిపోతాయి. అంతా నిరుత్సాహంగా ఉంటుంది. ఈ నిరుత్సాహంలోంచి మళ్లీ మొట్టమొదటి ప్రశాంతదృశ్యం కనిపిస్తుంది. కార్మికుల్లో జవసత్వాలు పూర్తిగా చచ్చినట్టు అనిపిస్తుంది. ఇంతలో హఠాత్తుగా వీధిచివరమళ్లీ కార్మికులజెండా తలఎత్తుతుంది. మళ్ళీ దానిచుట్టూ జనంపోగవుతారు...."

ఈ దృశ్యానికి నేపథ్యసంగీతం సమకూర్చడమెలా? దృశ్యాన్ని శబ్దం అనుసరించాలంటే ఈవిధంగా చెయ్యాలి: మొదట ప్రశాంత దృశ్యానికి అనుగుణంగా మృదువైన సంగీతం వినిపిస్తుంది. కార్మికుల ఊరే

గింపు కనిపించినప్పుడు మార్చింగ్ సంగీతం వినిపిస్తుంది. పోలీసులు కార్మికుల నెదుర్కొనబోయేటప్పుడు సంగీతం కఠినంగా మారి బెదిరిస్తున్నట్టు వినిపిస్తుంది. పోలీసులు, కార్మికులు తలపడినప్పుడు కార్మికుల ఉత్సాహం సన్నగిలిపోవడంతో పాటు సంగీతంకూడా బాధగా, విషాదపూరితంగా మారుతుంది. జెండా తిరిగి తలఎత్తినప్పుడు మాత్రమే సంగీతం ఆశను, ఉత్సాహాన్ని సూచించేబాణీలో వినబడుతుంది.

ఈవిధంగా సంగీతం సమకూర్చడంవల్ల ఆ దృశ్యంలోని పైపైభావాలు మాత్రమే వ్యక్తమవుతాయికాని అంతరార్థాలు వ్యక్తం కావు. అందుచేత నా సంగీతదర్శకునికి (షాపోరిన్) ఒకసూచన చేశాను 'ఈ దృశ్యం కనిపించినంతసేపూ సంగీతం ధైర్యాన్ని, ఉత్సాహాన్ని, అంతిమ విజయాన్ని సూచించే బాణీలో ఉండాలని చెప్పాను. మొదటినుంచి చివరిదాకా నేపథ్యసంగీతంఇనుమడిస్తున్న శక్తితో పురోగమించాలి. కనిపించేదృశ్యం రకరకాలుగా మారుతుంది కాని వినిపించే సంగీతం ఒక్క స్థాయీ భావంలో నిలుస్తుంది. తెరమీద మొదట కార్మికుల ఉత్సాహం, తరవాత పోలీసులవల్ల ప్రమాదం, తరవాత కార్మికుల సంఘర్షణశక్తి, వారు ఒకసారి నెగ్గడం, మరొకసారి తగ్గడం, చివరికి ఓడిపోవడం, తిరిగి పోయిన ధైర్యం చేకూర్చుకుని జెండాను లేవనెత్తడం—ఇన్ని రకాలుగా దృశ్యం మారుతుంది. జ్వరంతో ఉన్న మనిషి టెంపరేచరులాగా దృశ్యం ఒకసారి తగ్గుస్థాయిలో, మరొకసారి హెచ్చుస్థాయిలో కనిపిస్తుంది. దీనికి భిన్నంగా సంగీతం సుస్థిరంగా వుంటుంది. మొదట ప్రశాంతమైన దృశ్యం కనిపించినప్పుడు సంగీతం విప్లవోత్సాహంతో ధ్వనిస్తుంది. కార్మికుల ఊరేగింపు కనిపించినప్పుడు సంగీతం ఒక్క ఊపుతో ప్రేక్షకులను ఊరేగింపులోకి లాక్కుపోతుంది. పోలీసులు కార్మికులను హింసిస్తుంటే కార్మికుల క్రోధం హెచ్చినట్టే ప్రేక్షకుల్లో కూడా క్రోధం కలిగిస్తుంది సంగీతం. కార్మికుల్లో ఉత్సాహం, శక్తి చచ్చిపోయినప్పుడు కూడా సంగీతం ఇంకా విప్లవోద్దీపకంగా విజృంభిస్తుంది. కార్మికులు ఓడిపోయి చెల్లాచెదరైనప్పుడు కూడా సంగీతం విజయగర్వంతో వినిపిస్తుంది. చివరికి కార్మికులు తిరిగి ఒకచోట చేరి జెండా పైకెత్తినప్పుడు సంగీతం పతాకదశకందుకుని మేఘగర్జన చేస్తుంది. ఆ క్షణంలోమాత్రం బొమ్మలోని భావం, శబ్దంలోని భావం మేళవిస్తాయి. అంతవరకూ రెండూ వేర్వేరు భావాలు స్ఫురింపజేస్తూనే వుంటాయి.

ఇక్కడ సంగీతం చేసిన పనేమిటి? తెరమీది దృశ్యం యథార్థంగా జరుగుతున్న సంఘటనఅయితే, సంగీతంమాత్రం ఆ సంఘటనపట్ల ప్రేక్షకులకు ఎటువంటి భావం కలగాలని దర్శకుడు వాంఛిస్తున్నాడో ఆ భావాన్నే స్ఫురింపజేస్తున్నది. కార్మికుల ఉద్యమం దెబ్బమీద దెబ్బ తింటున్నకొద్దీ వారిలో అంతిమ విజయం మనదేననే భావం దృఢతరమౌతున్నదని సంగీతం ప్రేక్షకులకు బోధింపచేస్తుంది."

* * *

ఈమాదిరి ఉదాహరణలు పుడోవ్కిన్ చిత్రాలన్నిటిలోనూ కనిపిస్తాయి. ఈ పద్ధతి పుడోవ్కిన్ చిత్రాల్లోనే కాక రష్యన్ చిత్రాలన్నిటిలోనూ అనుసరించబడుతోంది. ఇంత సూక్ష్మమైన పద్ధతులు మన చిత్రాల్లో ప్రవేశపెడితే మన సామాన్య ప్రజానీకానికి అవి అర్థం అవుతాయా అని సందేహం కలగవచ్చును. దర్శకుడు ఏ పద్ధతులు అనుసరిస్తున్నాడో ప్రేక్షకులకు అర్థం కానక్కర్లేదు. ఆ పద్ధతులవల్ల కలిగే ఫలితాలే ప్రేక్షకులకు కావలసింది. రష్యన్ దర్శకులు ఇంత చిత్రచిత్రమైన సిద్ధాంతాలు అనుసరించినా, వారికి కావలసినదల్లా ప్రేక్షకులను చిత్రం చూస్తున్నంతసేపూ తన్మయులనుగా చేసి ఉంచడమే. అలా చెయ్యడానికి అవసరమైన టెక్నిక్‌ను మాత్రమే వారు అవలంబిస్తారు. ★

"షగూఫా" సమీక్ష

పి ఎన్ ఫిలిమ్స్‌వారి మొదటి హిందీ చిత్రం "షగూఫా" గత శుక్రవారం స్టార్ టాకీసులో విడుదలైనది. నిర్మాత ప్రేమ్‌నాథ్, దర్శకుడు హెచ్ ఎస్ రావైల్, ఫొటోగ్రఫీ రాజేంద్రమలోని, సంగీతం సి రామచంద్ర, ప్రేమ్‌నాథ్, బీనారాయ్,

★



అతడు తన చిన్ననాటి స్నేహితుడు అశోక్ అని బీనా భ్రమ, ఆమె భ్రమ నిజమని డాక్టర్ ప్రేమ్‌నాథ్‌కు తెలియదు

పి ఎన్ ఫిలిమ్స్ వారి 'షగూఫా'లో బీనారాయ్, ప్రేమ్‌నాథ్.



భర్త మరొక స్త్రీని ప్రేమిస్తున్నాడని ఆమెబాధపడుతోంది.
పి. ఎన్. ఫిలిమ్స్ వారి "షగూఫా" లో పూర్ణిమ.

★ "షగూఫా" సమీక్ష ★

బిపిన్‌గుప్త, పూర్ణిమ మొదలగువారు నటించారు.

చిత్రం ఎత్తుగడలో ఇదేదో సైకాలజీ, మిస్టరీ ప్రధాన లక్షణాలుగా గల కొత్తరకం చిత్రం అనిపిస్తుంది. ప్రేమ్‌నాథ్ 'సైకియాట్రిస్టు' పోజులో రావడం, బీనారాయ్ మతిచలించిన దానివలె చేష్టలు చేయడం చూసి ఇటువంటి కొత్తకథను ఎత్తుకున్నందుకు ప్రేమ్‌నాథ్‌ను అభినందిస్తాము కూడా. తీరా కథ కొంత దూరం సాగేసరికి, ఇందులో సైకాలజీలేదు, మిస్టరీలేదు, సస్పెన్సులేదు, కేవలం 'ట్రయాంగ్యులర్' ప్రేమకథ మాత్రమే అనిపిస్తుంది. హాలీవుడ్ నుంచి చక్కని సైకలాజికల్ చిత్రాలు, మిస్టరీ చిత్రాలు అనేకం వచ్చాయి. ఈచిత్రం కథకుడు వాటి వ్యామోహంలో పడి మధ్యలో ఏం చేయాలో తోచక చేతులు కాల్చుకున్నట్టు తోస్తుంది.

అశోక్, బీనా చిన్నతనంలో ఇరుగు పొరుగున ఉంటూ స్నేహంగా పెరిగారు. అశోక్ బీదవాడు; బీనా ధనికుని కుమార్తె. ఒకరోజున అశోక్ ఆటల్లో కోపంవచ్చి బీనా కాలు కొరుకుతాడు. దానిపై బీనా తండ్రి అశోక్‌ను చితక గొడతాడు. ఆరోజు రాత్రే అశోక్ యిల్లు కాలిపోతుంది. అశోక్, అతని తల్లి చనిపోయారని అంతా అనుకుంటారు. అప్పటినుంచీ బీనా మనస్సు చలిస్తుంది. పూర్వపు సంగతులన్నీ మరిచిపోయి పిచ్చిగా ఉంటూ ఉంటుంది. కాని అశోక్, అతనితల్లి నిజంగా చావలేదు. ఆవూరినుంచి వెళ్లిపోయి వేరేచోట నివసిస్తారు. అతనికి ప్రేమనాథ్ అని తల్లి మారుపేరు పెడుతుంది. పెద్దవాడై పెళ్లి చేసుకుని డాక్టరువృత్తి ప్రారంభిస్తాడు. బీనా మతి చాంచల్యం కుదర్చడానికి అతడే వస్తాడు. కాని అతనికి కూడా తన చిన్నతనంలో జరిగిన సంగతులేవీ జ్ఞాపకం ఉండవు. తానే అశోక్ అనికూడా అతనికి జ్ఞాపకం ఉండదు. బీనా ఉన్మాదం పోగొట్టడానికని, తానే అశోక్‌నని ఆమెతో చెప్పి, ఎలాగైతేనేం ఆమె జబ్బు నయం చేస్తాడు. అశోక్ తన చిన్నప్పటి స్నేహితుడు గనుక బీనా అతన్ని ప్రేమిస్తుంది. అతడు తాను అశోక్ కాదనీ, తన పేరు ప్రేమనాథ్ అనీ చెబుతాడు. చివరికి తల్లి వల్ల తెలుస్తుంది తాను నిజంగా అశోక్ అని. అప్పుడు అటు భార్యపట్ల కర్తవ్యం, ఇటు చిన్ననాటి స్నేహితురాలిపట్ల కర్తవ్యం అతన్ని రెండు వేపుల్నించీ ముట్టడిస్తాయి ఇంతలో బీనా కూడా అతని పరిస్థితి గమనించి తనంతటతనే అతని జీవితం నుంచి తొలగిపోతుంది. 'ట్రయాంగిల్' లోని ఒక ఆంగిల్ తొలగిపోగా నేసమస్యతీరిపోతుంది.

సామాన్య లోపాలు లేకుండా కథ రాయడం, ఆకథలో ప్రేక్షకులకు నమ్మకం కలిగేట్లు చేయడం మనవారికి ఇప్పుడప్పుడే అలవడే కళలాగాలేదు "షగూఫా" కథలో ముందు గా అర్థం కానిది, అశోక్ తన చిన్నతనం అంత పూర్తిగా ఎలా మరిచిపోగలిగాడనేది. బీనాకు మతి చలించింది గనుక ఆమె మర్చిపోయిందంటే అర్థంఉంది. కాని మతి శుభ్రంగావున్న అశోక్ తమఇల్లు కాలిపోవడం లాంటి ప్రధానసంఘటలను కూడా ఎలా మరిచిపోతాడు? అతడప్పటికి బాగా బుద్ధి తెలిసిన కుర్రవాడేగాని మరీ పాపాయి కాడే?

ఈచిత్రంలో ప్రేమ్‌నాథ్, బీనారాయ్ చక్కగా నటించారు. కథలోను, డైరెక్షనులోను లోపాలున్నప్పటికీ వారిద్దరి నటనా విశేషంవల్ల చిత్రం చూడదగినదిగా ఉంది. కాని బీనారాయ్‌ని మాస్తున్నంత సేపూ ఆరోగ్యం, సౌందర్యం మూర్తీభవించిన శుభ్రమైన యువతిలాగా వుంది గాని పదిహేనేళ్లనుంచీ మతిస్థిరం లేక బాధపడే యువతిలాగలేదు. లతామంగేష్కర్, గీతారాయ్‌ల ప్లేబాక్ పాటలు బాగానే వున్నాయి.

ఈచిత్రంలో సెటింగులు, దుస్తులు, వ్యక్తులు-అన్నీ చూసి భారత దేశంలో బోలెడంత బీదరికం, మురికి, అసహ్యం ఉన్నాయనే సంగతి మరిచిపోయి, వాన దేశం అమెరికాకు తీసిపోదని కాసేపు మనం భ్రమిస్తే భ్రమించవచ్చు. ★

ఇటాలియన్ సినిమా పరిశ్రమ

కొన్ని విశేషాలు


రెండవ ప్రపంచయుద్ధ ఫలితంగా పర్యవసానమైన దేశాల్లో ఇటలీ ఒకటి. పారిశ్రామికంగా, వ్యావసాయికంగా ఆ దేశం బాగా వెనకబడిపోయింది. దారిద్ర్యానికీ, నిరుద్యోగానికీ ఆ దేశం నిలయమైంది. ఆశ్చర్య మేమిటంటే ఆర్థికంగా ఇంత వెనకబడిపోయిన దేశం ప్రపంచమంతటిచేతా ప్రశంస లందుకుంటున్న సినిమాచిత్రాలు తయారుచేస్తోంది. జార్ చక్రవర్తుల నిరంకుశ పరిపాలనలో అన్ని విధాలా వెనకబడిపోయిన రష్యా గొప్ప సారస్వతం సృష్టించినట్లే ఈనాడు ఇటలీ అత్యుత్తమ చిత్రాలు సృష్టిస్తోంది. ఇప్పుడు ఇటలీలో సారస్వతం మొదలైన కళలకంటే సినిమాకళే పురోగమిస్తోంది.

1945 లో రాబర్టో రోజెలినీ "ఓపెన్ సిటీ" అనే చిత్రం తయారు చేసి నప్పటినుంచీ ఇటలీలో "నియోరియలిజం" లేక "నవవాస్తవికత" అనే పద్ధతిలో విరివిగా చిత్రాలు తయారుకాబడుతున్నాయి. అచ్చగా డాక్యుమెంటరీలు కాకుండా ఏదో కథ అడ్డంపెట్టుకుని యధార్థపరిస్థితులను ప్రతిబింబించడమే ఈ పద్ధతిలోని సారాంశం.

ఇటాలియన్ సినిమాలను పరిశీలించితే కొన్ని వింత విషయాలు బయటపడతాయి. ఈ నవవాస్తవిక చిత్రాల్లో నటనయే వృత్తిగాగల నటీనటులకంటె అమెచూర్ నటీనటులే ఎక్కువగా కనిపిస్తారు. తారలకు ప్రాముఖ్యం ఉన్నప్పటికీ పలువురు దర్శకులు తమ చిత్రాల్లోని ప్రధాన పాత్రలకు అమెచూర్ నటీనటులనే ఎన్నుకుంటున్నారు. అయితే ఈ పద్ధతివల్ల ఒక్కొక్కసారి విషాదకర పరిణామాలు కూడా కలుగుతున్నాయట.

ఉదాహరణకి, "బైసికిల్ థీవ్స్"లో కథానాయకుడుగా నటించి ఒక్క వెలుగు వెలిగిన లాంబర్టో మాగియొరానీ ఇప్పుడు ఏదో సినిమా కంపెనీలో 'లైట్‌బోయ్'గా కుదురుకుని కాలం గడుపుతున్నాడు "బైసికిల్ థీవ్స్" తరవాత అతనికి మరొకఛాన్సు ఇవ్వడానికి దర్శకుడు డీసికా ప్రయత్నించాడు. కాని అతడు అప్రధాన పాత్రలకు కూడా అనర్హుడైపోయాడు. అతని అనర్హత అతనికే ఆశ్చర్యం కలిగించింది. ఒకసారి సినిమా రంగంలో గొప్పపేరు సంపాదించి, సినిమాగ్లామర్ రుచి చూసిన తరవాత అతనికి తిరిగి మరి ఏ ఉద్యోగం చేయడానికీ బుద్ధి పుట్టలేదు. సినిమారంగాన్నే అంటిపెట్టుకున్నాడు. అతనిమీద గౌరవం కొద్దీ కంపెనీవారు ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో చిన్న ఉద్యోగమిచ్చి ఉంచుకున్నారట.

రెనాటో కాస్టెల్లానీ అనే దర్శకుడు *Two cents worth of hope* అనే గొప్ప చిత్రం తీశాడు. అందులో నాయికగా మేరియా ఫియోరా అనే ఆమె మొదటిసారిగా నటించింది. రోమ్ నగరపు మురికిపేటల్లో ఆమెను దర్శకుడు డిస్కవర్ చేసి తన చిత్రంలోకి తీసుకున్నాడు. ఆచిత్రంలో దుర్భర దారిద్ర్య మనుభవించే బీదప్రజల జీవితం కథావస్తువు. ఆయువతి అందులో అద్వితీయంగా నటించినదని అందరూ ప్రశంసించారు. కాని తరవాత ఆమె మరే పాత్రకూ పనికిరాలేదు. ఇప్పుడామె సినిమా రంగం వదిలిపోలేక ఏదో చిన్న ఉద్యోగంతో పొట్ట పోసుకుంటోంది. ఇలాగ ఒక వెలుగు వెలిగి ఆరిపోయే నటీనటులు నిజానికి నటునా కొంకలం కలిగిన వారు కొత్త దర్శకుని మహిమవల్ల వారికి ఆ తాత్కాలిక ఆవేశం కలుగుతున్నది.



పి. ఎ. పి. వారి "పెంపుడు కొడుకు"లో సావిత్రి, లింగం ఎస్. దుర్గారావు.

ఇటాలియన్ సినిమా పరిశ్రమలో మరొక వింత కనిపిస్తుంది. నిర్మాతలు యావన్మందీ కన్సర్వేటివ్ పక్షాలకూ, కాథలిక్ రాజకీయ పక్షాలకూ చెందినవారు. సినిమా పరిశ్రమ యావత్తూ వారిచేతుల్లోనే వున్నది. కాని డైరెక్టర్లు తారలు, నటీనటులు యావన్మందీ కమ్యూనిస్టులో, కమ్యూనిస్టు సానుభూతి పరులో, లేక ఇతర వామపక్షాల వారో అయివుంటారు. జమీందారీ వంశంనుండి వచ్చిన లూచినో విస్కాంటీ అనే ఆయన డైరెక్టరవడంతోటే కమ్యూనిస్టుకూడా అయ్యాడట. ఎన్నా మాగ్నానీ అనే ప్రసిద్ధతారకూడా కమ్యూనిస్టు. అయితే అమెరికాలో మాదిరికాక ఇటలీలో నిర్మాతలకు, దర్శకులకు, తారలకు విరోధాలు, ద్వేషాలు లేవు. ఎంత కాథలిక్ నిర్మాత అయినా కమ్యూనిస్టుడైరెక్టర్ని, తారనీ పిలిచి తనచిత్రంలో పనిచెయ్యమని అడుగుతాడట. వారుకూడా నిరభ్యంతరంగా అంగీకరిస్తారట. వ్యాపారం వ్యాపారమేనని వారి సిద్ధాంతం.

ఇలాగ పరస్పర విరుద్ధ రాజకీయాలకు చెందినవారు కలిసి చిత్రం తయారు చేయడంతో ఆ రెంటినీ సమన్వయం చేసే మార్గ



ఆర్టిస్టు (విన్సెంట్ ప్రైస్) లా మైనపు బొమ్మలను స్నేహి... చూపుస్తున్నారు
వార్నర్ బ్రదర్స్ వారి House of uax త్రీ-డీ చిత్రంలో ఒక సన్నివేశం

మరొక త్రీ-డీ చిత్రం "హౌస్ ఆఫ్ వాక్స్"

వార్నర్ బ్రదర్స్‌వారి త్రీ-డీ చిత్రం "హౌస్ ఆఫ్ వాక్స్" గత శుక్రవారంనుండీ ఓడియన్‌లో ప్రదర్శింపబడుతోంది గురువారంనాడు పత్రికా ప్రతినిధులకు ప్రత్యేకంగా చూపించారు

ఇటాలియన్ సినిమా పరిశ్రమ

వ్యక్త్వ ప్రధానమైన కళ వారి చిత్రాల్లో కనిపిస్తోంది అందుకే ఇటాలియన్ చిత్రాలకు ఇటు పాశ్చాత్య దేశాల్లోనూ అటు తూర్పు యూరప్‌దేశాల్లోనూ కూడా సమానమైన ఆదరణ లభిస్తోంది "బైసికిల్ తీవ్స్" చిత్రం తూర్పు యూరప్‌లో ప్రదర్శించబడినప్పుడు అది పెట్టుబడిదారీవ్యవస్థనువిమర్శించే చిత్రమనిఆరంతా ప్రశంసించారట ★

ఇదివరలో వచ్చిన "మెట్రోస్కోపిక్స్"కూ, దీనికీ తేడావున్నది అది కేవలం త్రీడైమన్షనల్ టెక్నిక్ కోసం తీయబడినది ఇందులో ఒక కథ ఉండడంవల్ల, త్రీ-డీ కంటే కథకే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది పైగా భిన్నభిన్న వర్ణాలు (వార్నర్ కలర్) కూడా కనిపిస్తాయి

ఈ చిత్రానికి పావలా పావలా చొప్పున పోలరాయిడ్ కళ్ళజోళ్ళు సప్లయి చేయబడుతున్నాయి ఆట ముగిసిన తరవాత కళ్ళజోళ్ళు హాలువారికి వాపసు చెయ్యవలెనని నిబంధనకూడా ఉన్నది

త్రీ-డీ చిత్రాల విషయం 24-6-53 సంచికలో కొంతవరకూ వివరించబడింది క్లుప్తంగా చెప్పాలంటే, త్రీ-డీ చిత్రాల్లో ఒకే దృశ్యం షూట్ చెయ్యడానికి రెండు కెమేరాలు ఉపయోగిస్తారు అలా షూట్ చేసిన రెండు ఫిలుములను 'ఇంటర్ లాక్' చెయ్యబడిన రెండు ప్రొజెక్టర్ల ద్వారా తెరమీద ప్రొజెక్టు చేస్తారు మామూలుగా చూస్తే తెరమీద ద్వంద్వ ప్రతిబింబం కనిపిస్తుంది పోలరాయిడ్ కళ్ళజోడు పెట్టుకుని చూస్తే ఏకప్రతిబింబం కనిపించడమే కాక వస్తువుకూ వస్తువుకూ మధ్యగల దూరం కూడా స్పష్టంగా కనిపిస్తుంది

ఈ కొత్తచిత్రంలో వస్తువుల మధ్య దూరం బాగా సాధించబడింది ముఖ్యంగా లాంగ్ షాట్లలో దృశ్యం యథార్థంగా చూస్తున్నట్టే వున్నది దూరంకూడా కనిపించడంవల్ల కథకు అదనపు ప్రయోజనం ఏమైనా కలిగిందా అంటే లేదనే చెప్పాలి ఈ చిత్రం ప్రథమప్రయత్నాల్లో ఒకటి గనుక ఇలా జరిగిఉండవచ్చు ముందుముందు త్రీ-డీ టెక్నిక్‌లోంచి కొత్తరకం సినిమాకళ ఏదైనా ఉద్భవిస్తే ఉద్భవించవచ్చు

వార్నర్ బ్రదర్స్‌వారు చాల సంవత్సరాలక్రిందట "హౌస్ ఆఫ్ వాక్స్" అనే చిత్రం తీశారు అదే కథను తిరిగి 'హామ

రల్ విజన్' అనబడే పేటెంట్ త్రీ-డీ టెక్నిక్‌లో ఇప్పుడీ చిత్రంగా తీశారు

మైనంతో శిల్పం చేసే ఆర్టిస్టు ఒకడుంటాడు. అతడి స్టూడియోనిండా మైనపు శిల్పాలుంటాయి వాటిలోకల్లా మేరీ ఆంటోయ్‌నెట్ (ఫ్రెంచివిప్లవంనాటి మహారాణి) అనే శిల్పం అతడికెంతో ఇష్టం ఆశిల్పం తనకు ఇమ్మని ఒక స్నేహితుడు బలవంతం చేస్తాడు ఆర్టిస్టు ఇవ్వనంటాడు స్నేహితుడు స్టూడియో అంతా దగ్ధం చేస్తాడు మేరీ ఆంటోయ్‌నెట్ శిల్పంకూడా తగలబడిపోతుంది ఆ మంటల్లో ఆర్టిస్టు ముఖంకూడా కాలిపోయి వికృతంగా, పిశాచంలాగ తయారవుతాడు స్నేహితుడిపై పగతీర్చుకోడానికి అతణ్ణి చంపి ఆశవాన్ని తనకొత్త స్టూడియోలో ఉంచుతాడు అందరూ ఆ శవాన్ని చూసి మైనం బొమ్మ అనుకుంటారు ఇదివరకు సౌందర్యం ఆరాధించే ఆర్టిస్టు ఇప్పుడు ఘాతుకత్వాన్ని ఆరాధిస్తూ, భయానకమైన శిల్పాలతో స్టూడియో నింపేస్తాడు ఒక యువతిని చంపి ఆమె శవాన్ని కూడా మైనం బొమ్మగా ప్రదర్శిస్తాడు ఆ యువతి సోదరి తన మేరీ ఆంటోయ్‌నెట్ శిల్పంలాగ ఉండడం చూసి ఆమెనుకూడా చంపి మైనం బొమ్మగా ప్రదర్శించాలని భావిస్తాడు ఒకరోజున ఆమెను చంపడానికి ప్రయత్నిస్తాడు సరిగ్గా సమయానికి పోలీసులు వచ్చి ఆమెను రక్షిస్తారు ఆర్టిస్టు మరుగుతున్న మైనం తొట్టెలో మరణిస్తాడు

ఈకథ చాలా భయానకంగా చిత్రించబడింది 'కొన్నిచోట్ల భయానకం కాకుండా జుగుప్స కలిగే దృశ్యాలు కనిపిస్తాయి. ఇకముందు హాలీవుడ్‌నుంచి వచ్చే త్రీ-డీ చిత్రాలు సాధారణకథలతో కూడినవై ఉంటాయని ఆశించవచ్చు ★

★ సినిమా వార్తలు ★

దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలి అధ్యక్షుడు శ్రీ ఎ రామయ్య, కార్యదర్శి శ్రీ బి నాగిరెడ్డిగార్లు ఈనెల 22 న విజయవాడ వెళ్ళారు ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి ఆధ్వర్యంలో జరిగిన డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో వారు మాట్లాడారు ఆగస్టు 5 వ తేదీన మొదట ఆటకు వచ్చిన సొమ్మును భారత ఫిలిం ఫెడరేషనుకు విరాళంగా యివ్వాలని వారు విజ్ఞప్తి చేశారు (ఈ సొమ్ము ఎగ్జిబిటర, డిస్ట్రిబ్యూటర్ల, ప్రొడ్యూసర్ల వాటాలతో కూడివుంటుంది)

నాగిరెడ్డిగారు మాట్లాడుతూ ఫిలిం పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి పరిశ్రమలోని వివిధశాఖల వారు ఏకమై ఆందోళన చేయాలనీ, ఆగస్టు 5 న వసూలయ్యే సొమ్ము ఈ ఆందో[illegible]



అన కల్యంత ప్రియమైన మేరీ ఆంటొయ్‌నెట్ బొమ్మ కాలిపోతుంటే ఆర్టిస్ట్ రక్షించ ప్రయత్నిస్తున్నాడు

త్రీ—డీ చిత్రం *House of wax* లో ఘోరాక ఘట్టం

ప్రశ్నలు-సమాధానాలు

శ్రీ డి. ఆర్. సుబ్బారావు—విజయవాడ.

కలకత్తాలో చాలావరకు శరత్ చంద్ర ఛటర్జీ రచించిన కథలనే చిత్రాలుగా నిర్మిస్తున్నారని తెలిసినది. అది నిజమేనా? నిజమయినట్లయితే ఛటర్జీయొక్క రచనలో వుండే గొప్పతనమేమిటో విశదపరుస్తారా?

—బెంగాలీవారు శరత్ కథలే కాదు, మిగతా ప్రసిద్ధరచయితల కథలుకూడా సినిమాలు తీస్తున్నారు. శరత్ కథలకు బెంగాల్ రాష్ట్రంలో విపరీతమైన ప్రజాదరం ఉన్నది. అందుచేతే అతని కథలపై నిర్మాతలకంత మోజు.

* * *

శ్రీ జి. వి. రఘునాథరావు — తోటపల్లి గూడెం.

సొసైటీవారి "ప్రపంచం" చిత్రంలో దారాశింగ్, ఆలీరజాల మధ్య జరిగే కుస్తీ పోటీలు, శ్రీ నాగయ్యగారిచేత పాడించడం జరిగిన తరువాత కథ సుమారు 40 సంవత్సరాలవరకూ నడుస్తుంది. 40 సంవత్సరాలకు ముందు ఈ కుస్తీపోటీలు జరిగాయా? శ్రీ నాగయ్యగారు అప్పుడు యిప్పటివలె ఉన్నారా?—

—కుస్తీలు, నాగయ్యగారు పాట పాడడం బహుశా వర్తమానకాలంలో జరిగినవై యుండి, తరవాత కథ అంతా భవిష్యత్తులో అంటే 1990 ప్రాంతాల్లో జరిగినదని నిర్మాత ఉద్దేశ్యమేమో? అదీగాక, ప్రపంచం వేరు, "ప్రపంచం" వేరు. దానికీ దీనికీ అట్టే పోలికలు లేవు. దాని లాజిక్ వేరు, దీని లాజిక్ వేరు. సొసైటీవారు విశ్వామిత్ర సృష్టిలాటిది చేయాలని ప్రయత్నించారు.

* * *

శ్రీమతి శోభాశ్రీ—పాలకొల్లు.

ప్రొఫెషనల్ చిత్రాలకు తీసేవిధానం, చూసేవిధానం వ్రాయించండి.

—24-6-58 తేదీ సంచిక మరొక్కసారి తిరగేస్తే కనిపిస్తుందండి.

* * *

శ్రీ ఎస్. చిట్టి వీర్రాచారి—విజయనగరము.

సినిమాలలో నటించే 'చలం', నవలలు వ్రాసే 'చలం' కార్టూన్లు వ్రాసే 'చలం' వీరు ముగ్గురూ ఒక్కరేనా?

—దేశంలో ఇంకా అనేకులు 'చలం' పేరు కలిగినవారు అనేక పనులు చేస్తూండవచ్చు. వారంతా ఒక్కరెలాగవుతారండీ?

* * *

శ్రీ అధికార్ల మురళీధర్—విశాఖపట్నం.

"దాగ్"లో దిలీప్ కుమార్ త్రాగి తూలుతూ పాడిన పాట చాలా అసందర్భంగా ఉందన్నారు, ఆ చిత్రం రివ్యూ ఇస్తూ. "దేవదాసు"లో అట్లాంటి సన్నివేశాలలోని పాటలు అసందర్భం అనిపించలేదా?

—అసలు సినిమాలలో పాత్రలచేత పాడించడమే అసందర్భమని 15-7-58 సంచికలో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చాము. కథానాయిక ఘోరదుఃఖంలో మునిగివుండి, వెక్కి వెక్కి ఏడుస్తూ, రాగతాళాలు తప్పకుండా, మధురంగా పాటపాడితే అసందర్భంగా ఉండదా? ఇటువంటి పాటలు దాదాపు ప్రతి సినిమాలోనూ ఉంటాయి. దేవదాసు తాగివుండి పాడిన పాట నిస్సందేహంగా అసందర్భమే. అలాగే మిగతా పాటలు కూడా అసందర్భమే.

★

సినిమా వార్తలు


సాగించడానికే వినియోగపడుతుందనీ చెప్పారు. రామయ్యగారు మాట్లాడుతూ, ఢిల్లీలో ఒక కేంద్ర కార్యాలయం నెలకొల్పి రెండు మూడు వేల రూ॥ల జీతంతో ఒక వ్యక్తిని అటు ప్రభుత్వానికీ ఇటు ఫిలిం పరిశ్రమకూ మధ్య అనుసంధానోద్యోగిగా నియమించాలని ఫెడరేషన్ ఆలోచిస్తున్నదనీ, పార్లమెంటు సభ్యులకు, ప్రభుత్వానికి ఫిలిం పరిశ్రమ సమస్యలను గూర్చి నచ్చచెప్పి పరిశ్రమ అభివృద్ధికి కృషిచేయగలమనీ అన్నారు.

దక్షిణ భారతంలోని 600 థియేటర్లలో 300 దాకా ఆంధ్రదేశంలో ఉన్నాయనీ, ఆంధ్రనుండి లక్ష రూపాయలదాకా వసూలు కావచ్చుననీ నాగిరెడ్డిగారన్నారు.

* * *

నటుడు, నిర్మాత, డైరెక్టరు మిస్టర్ ప్రేమనాథ్ ఈనెల 24 న మద్రాసులో తన మొదటి చిత్రం "మగూఫా" విడుదలయ్యే సందర్భంలో మద్రాసు వచ్చారు. ఆ రోజు సాయంత్రం కన్నిమరాహోటల్‌లో ఆయన పత్రికా విలేఖరులతో ఇష్టాగోష్ఠి జరిపారు.

★



House of wax లో ఒక సన్నివేశం.

★ నిచ్చెనలు—పాములు ★

(11-వ పేజీ తరువాయి)

సూ: వేళాకోళమా, నిజమా? సరిగ్గా చెప్పు, పెళ్ళే!

జాన: అహాఁ, సాక్షాత్తూ! వేళాకోళం అంటారేమిటి, నాకేం కర్మ, మీతో వేళాకోళం ఆడేదాకా?

సూ: మరెవరితో ఆడతావు?

జా: చాల్లెండి. సరసం. కాని పాపం, నాకా అమ్మాయిని చూస్తే జాలేస్తుందండీ. అమ్మాయేమిటి లెండి, ఒక చెంప నెరిసింది. అయినా అన్యాయమండీ. ఇన్నాళ్ళూ ఉండి యిప్పుడు పుట్టిందేమిటి చెప్మా ఈ నకీబుద్ధి! ఎంత చక్కగా- ఉందనుకున్నారమ్మాయి! పాపం! కుందనం బొమ్మనుకోండి. మొగిలిపొత్తురంగు.

సూ: కూడా తీసుకొచ్చేశాడా ఏమిటి?

జా: మరేమిటి లేకపోతే. మూడు రోజులు అయింది. కలుపుగోలు మనిషి. అప్పుడే మేం యిద్దరం ఫ్రెండ్స్ అయిపోయాం. స్కూల్ ఫైనల్ చదివిందట మళ్ళీ. చెల్లీ అంటూ ఇవాళల్లా ఇక్కడే ఉంది. మన పెళ్ళి ఫొటో చూసి ఎంతో ముచ్చట పడింది.

సూ: చూశావా! పాలేశ్వరుడూ ఎంత లోతైన మనిషో. ఇలాంటివాళ్ళే తడిగుడ్డలతో గొంతుకలు కోస్తారు. ప్రయాణం చేస్తున్నంతసేపూ మరేవో సంగతులు మాట్లాడాడు కాని, పెళ్ళిఊసే ఎత్తాడు కాదు. అందుకే అంటారు, లోకంలో ఎంతలేని వాళ్ళూ ఉన్నారని.

జా: ఇంకోటికూడా ఉందిలెండి మరి. ఏ మొహం పెట్టుకు చెపుతాడు తగుదునమ్మా అని. మొహంలో పెళ్ళికొడుకు కళ ఏమైనా వుంటేనా!

సూ: ఉండాలి. పెళ్ళికొడుకే మరీ. కాడూ. ఇదేమిటి, యీ టేబిలంతా ఇలా చిందరవందర చేశావు? యీ గవ్వలూ, పావులూ ఏమిటి చెప్పు!

జాన: మీరు మరీనండీ, కాస్సేపైతే, నేనూ యీ యింట్లో చెత్తే అంటారు. మధ్యాహ్నం తోచక ఆవిడా, నేనూ వైకుంఠపాళీ ఆడుకున్నాం. వైకుంఠపాళీ అంటే ఆవిడ చెవికోసుకుంటుంది. విసుగు లేకుండా ఆడగలదు ఇల్లాలు.

(బయటనుండి 'బాబూ, బాబూ,' అని కేక.)

సూ: ఎవరది? వస్తున్నా. (తలుపు తీసిన తర్వాత) ఓహో వెంకటస్వామా? ఏం వెంకటస్వామీ? ఇంత రాత్రివేళ వచ్చావేం?

వెంక: ఏం చెప్పను బాబూ, మాయదారి రాత్రి. ఎంత గోరం బాబూ.

సూ: (కంగారుగా) ఏం జరిగింది?

వెంక: మన పాలేశ్వరుడుబాబు లేడూ. రైలుకింద పడిపోయారు. రెండు కాళ్ళూ తెగిపోయాయి.

సూ: శివ శివా! ఎంత ఘోరం! ఇప్పుడు ఇప్పుడు, అంతా అరగంట అవలేదోయి, ఆయన్ని నేను స్టేషన్లో ఒదిలిపెట్టి. ఇద్దరం సైన్‌డౌన్‌లో కలిసి ఒచ్చాం, రైన్‌మీంచి.

వెంక: మరే బాబయ్యా. అంతా కళ్ళుమూసి తెరిచేంతలో అయిపోయింది. కమ్ములకి అడ్డపడి వచ్చేస్తూంటే త్రీసిక్స్టీటూ గూడ్సు లేదూ, అరో రైలెంబడి బండి వస్తూంది. చూసుకోలేదు. గభాల్న దాని కింద పడిపోయారు.

జా: ఎంత దారుణం. ఏం దారి బాబూ యిప్పుడూ. చ్‌చ్‌చ్‌చ్.

వెంక: తమర్ని పెద్ద మేష్టరుగారు ఎంటనే రమ్మన్నారు బాబయ్యా.

సూ: పద వెళదాం. ఉండుండు. నన్నెందుకు రమ్మన్నారూ?

వెంక: తెలీదు బాబూ.

జా: వెళ్లండి పాపం. కాంతానికి చెప్పొద్దూ.

సూ: (దెబ్బ తిన్నట్టు) కాంతమా, ఏ కాంతం.

జా: అరే, ఏ కాంతమో తెలీదు? ఆయన భార్యండీ.

సూ: కాంతమా. కాంతం.

* * *

కాంతం: సూర్యం, కాళ్ళు ఒణుకుతున్నాయి. దారి తెలీదు. నువ్వు గబగబా ముందుకి వెళుతున్నావ్.

సూర్యం: ఫరవా లేదు. ధైర్యం తెచ్చుకో కాంతం. నెమ్మదిగా నా వెనక రా. పద నీతోపాటే నడుస్తాను.

కాం: (నిస్పృహతో) ధైర్యం! ధైర్యం కాక ఇంకేముంది సూర్యం. ధైర్యం! ఇదివర కెక్కడో విన్నాను సూర్యం, యీ మాటలు. అవును. కాని ఏం లాభం. అంతా మించిపోయింది. నువ్విప్పుడు నా కోసం ఆగనూలేవు. నాకుధైర్యం అవసరమూ లేదు.

సూ: ఇదిగో, మీ యింటికి వచ్చేశాం. కాంతం, యిప్పుడేమనీ లాభం లేదు. నిన్ను ఓదార్చడం నా ఉద్దేశం కాదు. ఎవరిని ఓదార్చను? కాని కాంతం, పాలేశ్వరుడు మీ మేనమామని నాకు యీ క్షణంవరకూ తెలీదు.

కాంతం: ఎవరెవరో కొందరి జీవితాల్లో అన్నీ నిచ్చెనలే. నాకుమాత్రం అడుగడుగునా పాములు.

సూ: కాంతం! పెళ్ళి యిన్నాళ్ళెందుకు ఆలస్యం అయింది?

కాం: నాన్న పోయాక సుబ్బయ్య మరీ తెంపేలుపడిపోయాడు. వాణ్ణి చూసుకుంటూ వచ్చాను. పాపం, వాడూ ప్రయత్నించాడు. కాని చదువు అబ్బలేదు. నేను ఎలిమెంటరీ స్కూలులో టీచరుగా చేరాను. వాణ్ణి ఓతోవలో పెడదామని ఎంతప్రయత్నించినా లాభంలేక పోయింది. చివరకి.

సూ: చివరకి?

కాం: తాలూకాఫీసులో దఫేదారుగా వేయించాను. (సన్నంగా ఏడుస్తుంది.)

సూ: నేను చెయ్యగలిగింది ఏమైనా ఉందా కాంతం?

కాం: ఏముంది? దయుంచు సూర్యం అంతేచాలు. అనుకుంటారుగాని, మనం ఒకరికి కొకరం ఏం చెయ్యగలం.

సూ: ముందుసంగతి ఏమిటి?

కాం: ఇన్నాళ్లూ ఏమైంది! ముందూ అంతే. దేశంపోతాను. మళ్లీ బళ్లో టీచరుగా చేరతాను. సుబ్బయ్యని కనిపెట్టుకు ఉండడం తప్ప యింకేం ఉంది నాకు జీవితంలో ...వెర్రివాడు సుబ్బయ్య.

(పక్కింటి నుంచి సన్నగా పాటవినబడుతుంది.)

మేలుకో శ్రీ సూర్యనారాయణా.

మేలుకో హరి సూర్యనారాయణా.

కాం: ఎవరు సూర్యం, ఆపాట.

సూ: (బాధపడుతూ) జానకి.

కాం: మంచిది సూర్యం. జానకి చాలా మంచిపిల్ల. వేలలో ఎన్నదగినది. జాగ్రత్తగా కాపాడుకో. ఆవిణ్ణి సుఖపెట్టి నువ్వు సుఖపడు. వెళ్లిరా సూర్యం.

★

★ అప్రాప్త మనోహరి ★

(17-వ పేజీ తరువాయి)

జరిగినందుకు మన్నించవలసిందనీ, ఆ జాబు చేరిన తక్షణం బయలుదేరివస్తే కట్నం కానుకల విషయాలు మాట్లాడుకోవచ్చుననీ వ్రాసి వుంది. పారిందిరా పాచిక అనుకొని నారాయణ నేరుగా పరమానందం ఇంటికి వెళ్ళి విజయగర్వంతో ఆ ఉత్తరాన్ని అతని చేతి కిచ్చాడు. పరమానందం చదువుకొని "నువ్వదృష్టవంతుడివి నారాయణా!" అన్నాడు.

"అదే. అమాటే నిన్ను చెప్పొద్దనేది పరమానందం! నేనేం అక్షిపాస్థుల్లేని బికారినా? అల్లరి చిల్లరివాళ్ళతో సావాసం చేసి జులాయిగా తిరిగే రౌడీనా? నాకంటే మించిన అల్లుడు వాళ్లకింకెవడు దొరుకుతాడయ్యా? పోనీలే, ఇప్పుడీ గొడవెందుకు గానీ, నువ్వు బయల్దేరు. ఇద్దరం వెళ్ళొద్దాం" అన్నాడు నారాయణ. పరమానందానికి కంఠకన్నా మించిన పనేముంది గనక! నారాయణ పిలవడమే తడవుగా లేచి పంచెంమీద వేలాడుతున్న షర్టువేసుకొని "మనం తొందరగా వెళ్ళాలి నారాయణా! లేకుంటే బస్సు తప్పిపోతుంది" అంటూ తనే ముందు నడిచాడు.

బస్సు దొరికింది. ప్రయాణం సాఫీగా జరిగిపోయింది. కృష్ణవేణి తండ్రి చుట్టాల కోసం ఎదురుచూస్తున్న వాడిలా వీధి అరుగుమీదే కన్పించాడు. వాళ్ళు కనపడగానే ఆయన లేచి నిలుచొని క్షేమం విచారిస్తూ లోపలికి తీసుకెళ్ళాడు. నారాయణ అప్పుడే ఇంచుమించు ఇంటల్లుడిహోదాతో ఆయన పలకరించినా పలక్కుండా ఈజీ చేర్‌మీద కూచొన్నాడు. కృష్ణవేణి తల్లి కాఫీ తెచ్చి పరమానందానికిమాత్రం ఇచ్చి అతనితో ఏదో మాట్లాడి లోపలికి వెళ్ళిపోయింది. నారాయణ తనకు కూడా ఆమె కాఫీ తెచ్చి ఇస్తుం దనుకొన్నాడు...... అరగంట గడిచిపోయింది గానీ ఆమె మళ్ళీ అక్కడికి రాలేదు. కాబోయే అల్లుడికి కాఫీ ఇవ్వడమే మరచిపోయిన ఈ అత్తగారిని పెళ్ళైన తర్వాత ఎలా శిక్షిస్తే బాగుంటుందో నారాయణ ఆలోచింపసాగాడు.

రాత్రి పనిమిదిగంట లయింది. ఆ ఇంట్లో అందరూ నోరు తెరిస్తే ముత్యాలు రాలిపోయేటట్టు మౌనంగా ఎవరి పనులు వారు చూసుకొంటున్నారు. మాట్లాడ్డం తన డిగ్నిటీకి లోపమనుకొని నారాయణ ఆ ఈజీచేర్‌మీదనే పడుకొని నిద్రపోయాడు. పరమానందం ఊరంతా తిరిగి ఎనిమిది న్నరకు వచ్చి నారాయణను తట్టిలేపి "అప్పుడే నిద్రపోతున్నావేమయ్యా! ఈ వూళ్ళో ఈరాత్రి బ్రహ్మాండమైన డ్రామా జరగబోతుంది. అలా వెళ్ళి చూచివద్దాం రా" అన్నాడు. "అన్నం తినేసి వెళ్దాం లేవయ్యా" అందా మనుకున్నాడు నారాయణ. కానీ ఆమాట తానన్నట్టయితే ఇంత వరకూ తను బెట్టుగా నిలబెట్టుకుంటూ వచ్చిన తీవి కెక్కడ లోపం కలుగుతుందోనని నోరు మూసుకొని పరమానందాన్ని వెంబడించాడు.

గుడిసెల్లో దీపాలప్పటికే ఆరిపోయాయ్. పెంకుటింట్లలోనూ, మిద్దెటిండ్లలో నూ మినుకుమినుకు మంటున్న దీపాలకాంతి గవాక్షాలగుండా వీధిలో పడుతున్నది. గ్రామచావడిముందు మాత్రం ఇరవైముప్పై మంది రైతులు కూచొని లోకాభిరామాయణం మాట్లాడుకొంటున్నారు. వాళ్ళల్లో కొందరు నారాయణను చూడగానే "రండి రండి. అహా అక్కడ గాదు, ఇక్కడ కూచోండి" అని అతణ్ణి అందరికీ మధ్యగా వాపమైన కూచోబెట్టుకొన్నారు. అంత ఆప్యాయంగా పిలిచి దగ్గర కూచోబెట్టు కొన్న ఆ పెద్దమనుషులు తనతో ఏమైనా మాట్లాడదలచుకొన్నారేమో ననుకొన్నాడు నారాయణ. కానీ వాళ్ళెవరూ మాట్లాడలా. తనను జిరాఫీ మృగంగానో, జపల బ్రెగానో భావించి, తదేక దృష్టితో చూస్తూ శిలావిగ్రహాల్లా కూచుండిపోయారు.

ఉండి ఉండి నారాయణ "ఈ రాత్రి మీ ఊర్లో నాటకమటగా" అన్నాడు. పదిమందీ ఏకకంఠంతో "అవునండీ, అవును" అన్నారు. "స్టేజీ ఎక్కడండీ?" అని ప్రశ్నించాడు నారాయణ. "ఇక్కడే నండీ, ఇక్కడే" నన్నారు వాళ్ళు! ఈ సమాధానానికి నారాయణ ఆశ్చర్యపడి "ఐతే వేషగాళ్లెక్కడండీ?" అన్నాడు. "ఈరోజు జరగబోయే నాటకంలో మీరే నండీ కథానాయకులు" అని బదులు చెప్పాడొక కోరమీసాల రైతు యువకుడు. "నేనా, నేనా!" అని దిగ్భ్రమచెంది, ఒకవేళ అతడు తనతో సరసాలాడుతున్నాడేమో ననుకొని నారాయణ "ఐతే ఈనాటకానికి సూత్రధారు డెవరండీ?" అని అడిగాడు. ఆ యువకుడు "అదిగో, ఆయనే సూత్రధారి" అని దూరంగా నిలబడి చుట్ట త్రాగుతున్న పరమానందాన్ని చూపించాడు.

నారాయణకు దిక్కులు తోచలేదు. ఎందుకో గానీ, అక్కడ కూచోడానికి మనస్కరించక అతడు "వస్తానండీ" అని పైకి లేచాడు. "అదేమిటండీ? మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని మేమింతవరం ఇక్కడ కూచొని వుంటే మీరు వెళ్లిపోవడం భావ్యమా? కూచోండి కూచోండి" అంటూ ఒక పెద్దమనిషి అతని చేతిని పట్టుకొని బలవంతంగా కూచోబెట్టాడు. "నాకవతల బోలెడంత పనుంది. మీ మాటలు కాస్త త్వరగా ముగించండి" అన్నాడు నారాయణ. "ఎంతసేపండీ! ఒకటి రెండుమాటలు" అని ముసలాయన ఒక చిటికనశ్యం ఎగబీల్చి మెల్లగా పీఠిక ప్రారంభించాడు.

"నారాయణగారూ! మీరు పట్నంలో కాపురం చేస్తున్న వాళ్ళు. మేము పల్లెటూరి వాళ్లం. మీరు మాకంటే తెలివైనవాళ్ళు. మేము వట్టి బుద్ధిహీనులం. అంతే కాదు. కేవలం, ఒక తెలిసినవాడు ఇది మంచి, ఇది చెడ్డ అని తెలియ జెప్పకపోవడంవల్ల సర్వనాశనమైపోబోయే అమాయకుల్ని చూస్తూ వూరుకోలేని స్వభావం మీది! అలాటి అమాయకుల్ని ఇక్కడికి రప్పించి సర్వనాశనం చేసే ఉద్యోగం మాది."

నారాయణకు గుండె టకీమని ఒక్క సారిగా ఆగిపోబోయి మళ్లీ తీవ్రంగా కొట్టుకోసాగింది. వెలవెలపోతున్న ముఖాన్ని అతడు కిందికి వంచుకొని "అబ్బెబ్బే, మీతో ఆ మాటలన్న దెవరండీ?" అన్నాడు.

"ఎవరో ఐతే మీతో మాట్లాడవలసిన అవసరం మాకే ముందండీ?" అన్నాడు దూరంగా కూచొనివున్న కోరమీసాల వ్యక్తి!

మొదటి పెద్దమనిషి మళ్లీ తన కథనాన్ని ప్రారంభించాడు. "మీరు టాలాటోలీ మనుషులు కారని నాకు తెలుసు. ఏ మాట చెప్పినా మీరు బాగా ఆలోచించుకొని, చెప్పబోయే మాట సత్యమని మీకు తోచిన తరువాతనే చెబుతారని మా నమ్మకం! ఈ వూళ్లోని ఆడవాళ్లమీద మీరీమధ్య కొన్ని అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. అవి మాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయ్. వాటిని మేము నమ్మలేకపోతున్నాం, అవివేకులం గనక! మీరు మేధావులు కాబట్టి మీ మాటలు యథార్థాలని ఇప్పుడే నిరూపించుకోగలరని మా విశ్వాసం. ఇక్కడున్న వాళ్లల్లో ఒక నలుగు రైదుగురు తప్ప మిగతావాళ్లందరూ పెళ్లై, పెళ్లాలతో

కాపురం చేస్తున్నవాళ్లు. ఐనా వాళ్లకింత వరకూ వాళ్ల భార్యలందరూ గయ్యాళిగంపలన్న విషయం తోచనేలేదు. ఇక్కడున్న వాళ్లల్లో ఏ ఒక్క మగాడు గానీ, తన ఇంటావిడ ప్రవర్తనలో ఫలానా లోపముందని తెలుసుకోలేక పోతున్నాడు. చూచారా, మేమందరమూ ఎలాంటి అజ్ఞానాంధకారంలో అల్లాడిపోతున్నామో! మాకు వెలుగు చూపించవలసిన జ్ఞానభాస్కరులు మీరు."

శరీరంమీద తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నట్టనిపించింది నారాయణకు! అతడు గడగడ వణకిపోయాడు.

అంతవరకూ ఒక మూల కూచొనివుండిన ముసలాయన ఒకడు లేచి నారాయణ దగ్గరగా వచ్చి "ఎందుకయ్యా అలా గ్రుక్కిళ్లు మ్రింగుతావ్! మాకు కావలిసింది ఒకే ఒక మాట. ఈ ఉత్తరం నువ్వు వ్రాసిందా కాదా?" అంటూ పైగుడ్డలో భద్రంగా మూటగట్టుకొనివుంచిన జాబును బయటికి తీసి అతనికి చూపించాడు.

నారాయణకు నిలువెల్ల చెమటబట్టి వస్త్రం, పంచ తడిసిపోయాయ్. ఆ చీకట్లో తన చుట్టూ కూచొనివున్న వాళ్లందరూ అతని కళ్లకు భూతాల్లా కన్పించారు. అభూతాల్ని ఇక మాటల్తో ఏమరించాలనుకోడం వృథాప్రయాస అనుకొని నారాయణ ఉన్నట్టుండి ఆ ముసలాయన కాళ్లను రెంటిని పట్టుకొని "నన్ను మన్నించండి బాబూ! బుద్ధి గడ్డిమేసి ఈ పనిచేశాను. ఇకమీదట నే నిలాంటి పనులు చేయను" అన్నాడు. అనడమేమిటి, ఏడ్చాడు!

కాళ్లబేరానికి దిగిన నారాయణపైన అక్కడున్న వృద్ధులకందరికీ జాలి కలిగింది. "నీదీ ఒక బ్రతుకేనటయ్యా! ఇకనైనా బుద్ధి తెచ్చుకొని బ్రతుకు" అని వాళ్ళు ఇండ్లకు వెళ్లిపోయారు. కానీ అక్కడున్న యువకులకు మాత్రం నారాయణను ఇంకా కొంచెం ఏడిపిస్తే బాగుండు ననిపించింది. ఈసారి కోరమీసాల యువకుడు ముందుకు వచ్చి "అప్పుడే నిన్ను విడిచిపెట్టేస్తామనుకొన్నావేమిటి? ముందుంది నీకు ముసళ్ల పండగ! పద లోపలికి. రాత్రంతా ఈ కొట్టులో వుండు. తెల్లవారినాక నీకు తగిన శాస్తేమిటో ఆలోచిస్తాం" అంటూ నారాయణను గ్రామచావడిలోని ఒక గదిలోనికి తోసి తలుపు వేసుకోబోయాడు. ఇంతలో "ఉండండి. నే నాయనతో ఒక మాట చెప్పాల్ల!" అంటూ ఒక మనిషి పరుగెత్తుకుంటూ వచ్చాడు. నారాయణ ఒకసారి తలపైకెత్తి ఆగంతకుణ్ణి చూచి, అవమానాగ్ని తనను నిట్టనిలువునా దహించివేయగా ఇక నిలువలేక, నిలుచున్న చోటనే కూలబడ్డాడు. వచ్చినవాడు రామనాథం!

రామనాథం గదిలోపలికి వచ్చి "మిస్టర్ నారాయణా! మీరు వ్రాసినజాబుకుబదులు వ్రాయనందుకు మన్నించాలి. అక్షరాల్ని పోల్చి ఆజాబు మీరు వ్రాసిందేనని చెప్పినవాడు పరమానందం. నాపట్ల ఎంతో దయవుంచి మీరు నాకు చేసిన మేలుకు నేను కలకాలం కృతజ్ఞుడినై వుంటాను. ఇక పది రోజుల్లో నా పెళ్లి జరగబోతుంది. అప్పుడు మీ రాకను ప్రీతితో ఎదురుచూస్తాను" అని బయటికి వెళ్లిపోయాడు. తలుపు మూయబడి తాళం వేయబడింది.

ఆరాత్రి నారాయణ తననీ స్థితికి తెచ్చిన పరమానందాన్ని గానీ, రామనాథాన్ని గానీ తిట్టుకోలేదు. ఆ గ్రామచావడిని ఒక కోటలా దుర్భేద్యంగా కట్టిన వాళ్ళను లోలోపలనే తిట్టుకున్నాడు!

తెల్లవారింది. తెలవారినట్టు తలుపుతీసిన తరువాత నారాయణకు తెలిసింది. ఇద్దరు యువకులు లోపలికి వచ్చి నారాయణ చేతిపైన పేనాతో ఏదో వ్రాశారు. ఒక దొమ్మర ముసలిది వచ్చి ఆ గీతలపైన పచ్చ పొడిచింది. "ఇక పో" అన్నాడా యువకుల్లో ఒకడు. నారాయణ చావు దప్పి కన్ను లొట్టపోయిన వాడిలా ఒక్క పరుగుతో ఆ వూరు దాటుకొని చేతిపైన ఏమి వ్రాశారోనని చూచుకొన్నాడు. మూడే మూడక్షరాలు కలిగిన "వెధవ" అనే ముచ్చటైన పదం కనిపించిందతనికి! ★

★ ఎవరి పెళ్లి? ★

([illegible]-వ పేజీ తరువాయి)

మున్నా నీ ప్రత్యక్షరూపం యివాళే కాని చూడలేదు. శెలవు బాబా!'

ఆంజనేయులు చరచరా వెళ్లిపోయాడు.

ఇలాంటప్పుడు మాట్లాడితే ఏం జరుగుతుందో సుబ్బమ్మగారికి ముప్పై ఏళ్ళ అనుభవముంది. అంతవరకూ అంతా వింటూ అణచుకున్న దుఃఖం అన్నయ్య వెళ్ళిపోగానే ఆడప్రాణం అవడంచేత ఆపుకోలేకపోయింది. ఆస్వరం విని రామయ్యపంతులు యిటు తిరిగేరు.

'ఏం? అన్నగారికి అవమానం జరిగేసరికి అమ్మగారికి అలకొచ్చిందేమిటి? నువ్వూ ఆయన వెనక ముష్టి చిప్పపట్టుకుని వెళ్లలేకపోయావ్ సరిపోను? మూర్ఖులు! తలకు తగని పరుగులు! 'కాదూర సందులేదు, మెడకో డోలని' తనకి కూటికి లేకపోయినా, తన కూతురికి ఘరానా సంబంధాలు కావాలి. ఇదుగో సుబ్బమ్మా కినీదే చెప్పడం. ఇక ముందు యింట్లో ఆ గోచీపాతరాయుడి పేరెత్తావంటే నీకూ నాకూ పేచీ తప్పదు. జాగ్రత్త! అయినా..!'

మాటపూర్తవకుండానే ఆయింటిముందు ఒక బండీ ఆగింది. అందులోంచి చేతిలో పాప ఉన్న ఒక యువతీ, గూడకట్టుతో ఉన్న ఓ పెద్దమనిషీ దిగేరు. సుబ్బమ్మగారు యింట్లోకి వెళ్ళిపోయింది. ఆ పెద్దమనిషి దిగుతూనే 'మీరుదా నా రామయ్య?' అని అడిగాడు.

'అవును. ఎవరండీ మీరు?' అన్నాడు రామయ్యపంతులు. ఆ వచ్చినతను యీమాటకి జవాబు చెప్పకుండా బండివాడికి డబ్బులిచ్చి - ఆ అమ్మాయి చేతిలో పాప నందుకుని

'మొగనా! సిగ్గుపడబోకుమీ, నాయనా పెద్దలు. వందనం కొడు' అన్నాడు.

ఆ అమ్మాయి కొంచం సంకోచిస్తూ రామయ్యపంతులు కాళ్ళమీదకు వంగబోగా 'అదేమిటి? ఎవరు మీరు? నాకు దండం పెట్టడ మేమిటి?' అన్నాడాయన ఆశ్చర్యంగా.

'కొంతం చెబుతాను. ముందు వందనం సెయ్యనియ్యండి'

మోహిని ఆయన పాదములు కళ్ళకద్దుకుంది,

'మూడు మీ పాప. అంతా అంబురి మామ. నిండా మీస్వరూపం' ఈసారి రామయ్య పంతులికి నిజంగా ఒళ్ళుమండింది.

'అదేమిటి? ఈ పిల్లాడు నా స్వరూపమేమిటి? ఏమిటీ మాటలు ఎవరుమీరు?' ?

అయ్యరు కూతురివైపు తమాషాగా చూసి 'నువ్వు సొల్లు మొగనా' అన్నాడు.

కూతురు ఒక్కసారి తెచ్చుకున్న కోపంతో ఒళ్ళంతా విఱుచుకుని.

'ఫో అప్పా! నీకు నిండా వినోదం! నాన్ సొల్లను. నువ్వుదా సొల్లుమీ!

'ఎన్నా మొగనా యిది? శీగరం. నువ్వుదా సొల్లు'

రామయ్యపంతులుగారికి [illegible] మంది.

'మీసొల్లులు వినలేక నాచెవులు చిల్లులు పడిపోతున్నాయి మహాప్రభో! ఇదెక్కడి అరవసంతొచ్చి పడిందిరా దేముడా!'

ఆ పతితులు పళ్లు కొరుక్కున్నా యీ అయ్యరు కొరుకుపడలేదు.

★ ఎవరి పెళ్ళి? ★

'ఏమిటిసామీ! ఏం ఎరగనట్టు చెబుతూంటారే! అంత హాస్యమా?'

రామయ్య పంతులికి ఏం మాట్లాడాలో తోచలేదు. అయ్యారే అన్నాడు.

'కుర్రవాళ్లుదా అజ్ఞానంచేత ఏదో చేస్తుంటారు మనం పెద్దలము దిద్దుకోవద్దా? ఏమిట్లో చూస్తూంటారు! మోగనా మీ కోడలు కాదా? అమ్మా మోగనా! మీ అత్తగారేగా పార్వతమ్మ!' పూర్ణుడా పోను చూసి నీకుడా ఆనందం సేతురా!'

ఈసారి రామయ్యపంతులు ఊరుకోలేక పోయాడు.

'ఎవరు మీరు? ఈపిల్ల నాకోడ లేమిటి? మీకేమైనా మతిపోయిందా, తాగొచ్చారా? ఏమిటే అల్లరి?'

'మాటలు సెరుగా రానీవ్వండి. నానొదా ఒక పెద్దమనిసి. మద్రాసులో నాకుదా వ్యాపారం ఉండాది మీ పిల్లకాయ ఆనంద్ యీ పిల్లను మోహం సేసి కాపురం ఉండాడు. నిజం కోర్టులో సేదా తెలిసేది. రామ్మా మోగనా'

రామయ్యపంతులు ఖంగారుగా పెరట్లోకి పరిగెత్తి సుబ్బమ్మతో 'నిజం కోర్టులో తెలుస్తుందంటా డేమిటే? కొంపతీసి కేసు పెడతా డేమిటి? మనవాడుగాని నిజంగా కక్కుర్తి పడ్డాడో ఏమో? ఎలాగే?'

'ఎలాగే ఏమిటి? ఆ పిల్లాడికి మన ఆనందు పోలికలు లేకపోలేదు. వాళ్ళను యీ పూటకు ఉండమని బ్రతిమాలి వాడికి వైరివ్వండి.'

'అలా ఉంటావుకాని నీకు ఎన్ని తెలుసునే?'

* * *

తల్లీ కొడుకు అనే మాటలు వినలేక రామయ్యపంతులు చెవులు మూసుకున్నాడు.

'నాకు యిరవై ఎనిమిదేళ్ళున్నాయి. నాకూ అన్ని బాధ్యతలూ తెలుసు. కాని ఏం చెయ్యమంటావే అమ్మా? ఈ మోహిని మా రూంకి పాలు తెచ్చేది. ఎలాగో కలిసింది. తీరా ఆ పిల్లను అలా అన్యాయంగా వదిలెయ్యడానికే నాకు మనసొప్పలేదు. నాన్న మాసంగతులు చూడడు, మా అవసరాలు గమనించడు. ఆయన 'ఎంతసేపూ డబ్బు కావాలి. నే చేసిందాంట్లో తప్పేమిటి చెప్పు?'

'ఆనందుని పిలిచి చీవాట్లు పెట్టడానికి అతనికి మనస్కరించలేదు. 'ఏదో చేశావు గాని నాయనా, కాస్త మడీ ఆచారమూ ఉన్న శుభ్రమైన పిల్లను చూసుకోలేక పోయావా?'

రామయ్య పంతులుగారికి దుఃఖంలో నవ్వొచ్చింది. కోడలుచూస్తే అంత బాగు లేక పోవచ్చునుగాని మనవడ్ని ఎత్తుకోకుండా, ముద్దెట్టుకోకుండా ఆయన వుండ లేకపోయాడు. కొంత డబ్బు లంచంగా యిచ్చి మనవడ్ని వదుల్చుకోడం ఆయనకి మనస్కరించలేదు గడచిన రాత్రి అనేక ఘర్షణల తరువాత ఆయనకి మనవడ్ని ఉంచుకోడమే ఉత్తమంగా తోచింది

ఇంతలో పోష్టుమన్ ఒక ఉత్తరం యిచ్చి వెళ్ళిపోయాడు అది రామనాథం రాసింది. తను రమాదేవిని చేసుకుంటున్నట్టూ - చెప్పకుండా తలపెట్టినందుకు క్షమించమంటూ రామయ్య పంతులుగారు కుర్చీలో కూలబడిపోయాడు

* * *

'ఆనాడు విన్న నానా మాటలూ అన్నాను. నన్ను క్షమించు బావా. కట్నాలూ కానుకలూ నాకు వద్దు - నీ భాస్కరాన్ని నీపిల్లకు చేసుకుంటే చాలు నాకు డబ్బుమీద ఆశ పూర్తిగా చచ్చిపోయింది. నలుగురూ సుఖంగా ఉంటే చాలు. నువ్వు కాదంటేనే గాని నేను ఒప్పుకోను బావా!' ఆంజనేయులు చేతులు పట్టుకుని రామమూర్తి పంతులు బ్రతిమాలుకున్నాడు.

'ఓ కోడలు అరవదీ, మరోపిల్ల యింగ్లీషు నేర్చిన దొరసానీ.. వీళ్ళతో మా పార్వతి ఎలా ఉండగలుగుతుంది బావా!' అన్నాడు ఆంజనేయులు.

'నే నెలా ఉంటున్నాను అన్నయ్యా? స్నానం చెయ్యందే పచ్చి మంచినీళ్లు తాగి ఎరగనే! యీ మాలకూడు ఎల్లా తింటున్నాను?' అని సుబ్బమ్మగారు ముక్కు చీది తిరిగి. 'మా అన్నయ్యకి మీ అంత కర్కశత్వం లేదు రేపు వైశాఖంలో ముహూర్తం పెట్టించండి' అంది చిరునవ్వుతో.

* * *

పెళ్ళికి వచ్చిన పిల్లలలో ఒకడికి యీ ముగ్గురు కొడుకులలో ఎవరికి పెళ్లో అర్థం కాలేదు సుబ్బమ్మగారి దగ్గరకు వెళ్ళి అడిగాడు

'అమ్మమ్మా! అమ్మమ్మా! ఎవరికి పెళ్లి?'

'నా ఆచారాలకి మీ తాతగారి డబ్బుకీ పెళ్ళి నాయనా! ఈ పెళ్లి మా యిద్దరికీ జరిగింది!' అంది! ★


★ కాలక్షేపం ★

(5-వ పేజీ తరువాయి)

నిండా ఎర్రచీమలు ఏరు వరద వచ్చినట్టుగా పరుపునిండా ఆవరించాయి. పరుపు దులిపితే, పైనుంచి రాలుతున్నాయి భావశ్రీ గారు పారిజాతపుపూవుల కొమ్మల క్రిందపవళిస్తే, ఆ పారిజాత పుష్పములలోని తేనెను ఆరగించుటకై చేరిన చీమలు ఆ పువ్వుల లోనే పవళించి, ఆ పుష్పశయ్యానిద్ర విరమించి, ఆ పరుపుమీద ప్రాలడం ప్రారంభించాయి. భావశ్రీగారికి ఆ శయ్య అంపశయ్యలాగున ఉంది అర్ధరాత్రివేళ ఆ చీమల పోరు దయ్యాలతో పోరుగా ఉంది. ఇక అక్కడ ఒక్క క్షణమైనా పరుంటే మాట దక్కదని అక్కడినుండి భావశ్రీ కందరాణీసమేతుడై కొందిశీకునింబోలె నిజ నివాసంబునకుం జనియె.

కాని, భావశ్రీకి ప్రబంధాలలో చెప్పిన వన్నీ అబద్ధాలని బోధపడింది. చక్కని పూలతీగల పొదరింట్లక్రింద నిద్రపోతే స్వర్గానికి చిత్తేసు ఎడంగా ఉంటుందనేమాట సత్యం కాదన్నాను. "ఇక్కడి యీ లవలీనికుంజముల్" (ఇక్కడ ఉండే లవలీ అనే పూలతీగలతో అల్లుకొనియున్న పొదరిండ్లు) చాలా సౌఖ్యప్రదములైనవని అల్లసాని పెద్దనగారి మనుచరిత్రలో వరూధిని చెప్పింది కాని, అవి నిజంగా సౌఖ్యముల్ కావన్నాడు, బహుశ్రీ ప్రవరసోమయాజి—ఇటువంటి దొంగసుఖముల సంగతి నాకు చెప్పవద్దన్నాడు "చెప్పకు మిట్టి తుచ్ఛ సుఖముల్ మీసాలపై తేనియల్'—అనేమాట నిజమని భావశ్రీతో సహా కందరాణి ఆమోదించింది ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madras



ప్రభాతం

ఫొటో : శ్రీ పి. సి. యం. ఈశ్వరబాబు, మద్రాసు

Regd. No. M. 4479

అమ్మకమునకు సిద్ధముగా నున్నది!!

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్



అది ఒక వైభవోజ్జ్వల మహాయుగం— వల్లకాటి అధ్వాన్నశకం; వెల్లివిరిసిన విజ్ఞానం—బ్రహ్మజెముడులా అజ్ఞానం; ఆశాకుసుమాలు పుష్పించిన ఆమధుర వసంతం—నైరాశ్యపు చలి గుబుళ్లు యీచుకున్న శిశిరాస్యం; సర్వసంపత్సమృద్ధి— సర్వతోముఖ క్షామం; సూక్ష్మంగా చెప్పాలంటే—నేటి పరిస్థితికి నకలుగా వుంది నాటి పరిస్థితి.

అలాంటి కల్లోలదినాలలో లండన్ పారిస్ నగరాలను రెంటినీ పెనవేసుకుని సాగిన ప్రణయబలిదాన గాథ!. ఆంగ్ల నవలా ప్రపంచ నిర్మాత చార్లెస్ డికెన్సు ప్రతిభా సంపత్తులు వెల్లివిరిసిపోయిన "టేల్ ఆఫ్ టూసిటీస్" అనే 'క్లాసికల్' నవలకు అనువాదం.

అనువాదకులు:

శ్రీ తెన్నేటి సూరి

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో సీరియల్ గా వెలువడిన ఈ రచనను యిప్పుడు గ్రంథరూపంలో అందజేస్తున్నాం.

వెల: రూ. 3-0-0 లు　　　పోస్టుఖర్చులు ప్రత్యేకం.

ఆంధ్ర గ్రంథమాల, మద్రాసు-1.